
సామాజిక, రాజకీయ పక్షపత్రిక

10 అక్టోబర్ 2017
పేజీలు : 36
వెల : 10/-

# జనసందేశ్

జాతీయ చైతన్య జ్వాల




## విమర్శలు అర్థరహితం..
## ఆర్థికరంగం పురోగమిస్తూనే ఉంది



## నవభారత నిర్మాణానికి ఏకమవుదాం!

# జనసందేశ్

జాతీయ చైతన్య జ్వాల

సామాజిక, రాజకీయ పక్షపత్రిక

సంపుటి:27 | సంచిక:22 | 10 అక్టోబర్ 2017


ఈ సంచికలో...


- విశ్వకళ్యాణ కార్యానికి భారత్ నాయకత్వం వహించాలి! ... 03
- 'స్వచ్ఛతే సేవ'తో మహాత్ముడికి నివాళి ... 04
- తెలంగాణలోనూ బిజెపికి మంచి అవకాశాలు ... 05
- మానవ తప్పిందం వల్లే కాళేశ్వరం ప్రమాదం ... 06
- నవభారత నిర్మాణానికి ఏకమవుదాం! ... 07
- రాజకీయాల్ని ప్రజలకు ఉపయోగపడే పనిముట్టులా మలచాలి ... 10
- 'నవ భారతం' సాకారం చేసుకుందాం! ... 12
- నవ భారతానికి ఆర్థిక పునాదులు ... 16
- విమర్శలు అర్థరహితం.. ఆర్థికరంగం పురోగమిస్తూనే ఉంది ... 18
- విశ్వమంతా ఒక శక్తి స్వరూపమే! ... 20
- పేదలకు విద్యుత్ 'సౌభాగ్య'ం ... 22
- ఏడాదైనా గాడిన పడని పాలన ... 23
- ఖాదీ ప్రచారోద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్దాం ... 24
- ఐరాసలో అబద్ధపు ప్రచారం - బోర్లబొక్కపడ్డ పాకిస్థాన్ ... 26
- బెంగాల్ రాజకీయాల్లో పెను మార్పులు ... 27
- దక్షిణాదిలోనూ పాగా వేస్తాం! ... 28
- బిజెపిలో జోరుగా చేరికలు ... 30
- బతుకమ్మ చీరల్లో అబద్ధపు రంగులు ... 31
- ముఖ్యమంత్రులు జలవివాదాలను పరిష్కరించుకోలేరా? ...32
- గత చరిత్ర జ్ఞాపకాలు - భవిష్యత్ తరాలకు దారి దీపాలు ...33



మీ వార్తలు, సంబంధిత ఫోటోలు (ఫోటోలోని వారి పేర్లు, బాధ్యతలతో సహా) మెయిల్‌ద్వారా కూడా జనసందేశ్‌కు క్షణాల్లో పంపించవచ్చు. మీరు పంపవలసిన చిరునామా (ఈ-మెయిల్): janasandesh@yahoo.co.in

janasandeshmag@gmail.com

Phone No :040 24650866



Editor, Printer & Publisher : **MANTHRI SRINIVASULU**
on behalf of Bharateeya Janata Party and
Printed at Kala Jyothi Process Pvt. Ltd., RTC 'X' Roads, Hyderabad.
Published at: Dr.Shyam Prasad Mukharji Bhavan,
Opp: Exhibition Grounds, Nampally, Hyderabad - 500 001.


## సంపాదకీయం

# విశ్వకళ్యాణ కార్యానికి భారత్ నాయకత్వం వహించాలి!

విశ్వ మానవ సంక్షేమం కోరి విభిన్న మార్గాల్లో ప్రపంచం అంతటా జరిపిన ప్రయత్నాల నుండి విభిన్న సిద్ధాంతాలు, విభిన్న వ్యవస్థలు పురుడు పోసుకున్నాయి. బానిస బంధనాలు తెంచుకుని 1947 ఆగస్టు15న భారత్ స్వతంత్రమయ్యే నాటికి ప్రపంచాన్ని రెండు సిద్ధాంతాలు హోరెత్తిస్తుండేవి. పశ్చిమ దేశాల్లో స్వేచ్ఛ, సమానత్వము, సహోదర భావము వంటి ప్రజాస్వామిక భావనలకు ఆదరణ లభిస్తున్న తరుణంలో కారల్ మార్క్స్ వర్గకలహ సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చారు. మార్క్స్ బాటలో పయనించి పాక్షికంగా సఫలమైన దేశాల్లో రష్యా, చైనాలు ప్రముఖమైనవి. మూడు తరాల ప్రయోగం పరిశీలన పిదప రష్యా నేడు పూర్తి పెట్టుబడిదారీ మార్గానికి మళ్ళగా, చైనా మెల్లిగా మారుతోంది. మన దేశంలో ఆంగ్లేయుల పాలన సాగుతుండగా రష్యా విప్లవస్ఫూర్తితో 1920లో ప్రారంభమైన కమ్యూనిస్టు పార్టీ నేటికి ఎన్ని చీలికలు వాలికలైందో కమ్యూనిస్టులకే తెలీదు.

పశ్చిమాన ఆవిర్భవించిన మతమైనా, మార్క్సిజమైనా విశ్వాసము, ప్రకృతి పట్ల రెండింటిదీ ఒకే తీరు. తమదే సత్యమని, తద్విరుద్ధ విశ్వాసాలు, సిద్ధాంతాలు, వ్యక్తులను మార్చడం, కాదంటే పరిమార్చడం తప్పకాదని, సమస్త ప్రకృతి మానవుని కోసమే కనుక దానిపై ఆధిపత్యం వహించడం మానవుని హక్కు అని ఇరువురూ భావిస్తారు.


ప్రకృతిలోని లక్షలాది జీవరాశుల్లో మానవుడు కూడా ఒక జీవి అని, జీవరాశులన్నీ సుఖ సమృద్ధులతో జీవించాలనేది భారతీయ దృక్పథం. ఫలితం పెట్టుబడిదారుకు చెందాలా, ప్రభుత్వానికి చెందాలా అనే తేడా మినహా ప్రకృతిని కొల్లగొట్టడంలో తప్పు లేదని పశ్చిమ మతస్తులు, మార్క్సిస్టులు ఏకీభవిస్తారు. ప్రకృతిని తల్లిగా భావించి మనిషి మనుగడ సాగించాలని భారతీయత భావిస్తుంది. మౌలిక దృక్పథంలోని ఈ తేడా పాశ్చాత్య భావన నుండి భారతీయతను వేరుగా నిలిపింది.

భారతీయతను మథించి, రాజకీయ రంగానికి అన్వయించిన దీనదయాళ్‌జీ కృషి ఫలితంగా నూతన రాజకీయ దృక్పథం ఆవిష్కృతమైంది. మనిషికి కూడు, గుడ్డ, గూడు కల్పించి, భౌతిక అవసరాలను తీర్చడమే ఆదర్శ పాలనగా ప్రపంచం భావిస్తున్న రోజుల్లో మనిషికి కేవలం శరీరమే కాక బుద్ధి, మనసు, ఆత్మ ఉన్నాయని, వాటిని కూడా తృప్తి పరచే మార్గంతో పాటు సమస్త జీవులకు సంపూర్ణ కళ్యాణాన్ని సమకూర్చే దిశగా పాలకుల ఆలోచన సాగాలని, 'ఏకాత్మ మానవ దర్శనం' పేరిట దీనదయళ్‌జీ ప్రపంచ రాజకీయాలకు నూతన దిశా నిర్దేశనం చేశారు. పెట్టుబడిదారీ విధానం, లేదా కమ్యూనిస్టుల సామ్యవాదం మినహా ప్రపంచ మానవాళికి మరో మార్గమేదీ లేదన్న ఢంకా బజాయింపులు హోరెత్తుతుండగా వెలువడిన ఈ సిద్ధాంతాన్ని కొందరు నిర్లక్ష్యం చేశారు, కొందరు హేళన చేశారు.

మానవ సంక్షేమానికి, స్వతంత్ర భారత ప్రగతికి పెట్టుబడిదారి, లేదా సామ్యవాదం మినహా మరోదారి లేదని భావిస్తూ, పాలక పక్షమైన కాంగ్రెస్, విపక్షమైన కమ్యూనిస్టులతో సహా భారత రాజకీయ రంగంలోని ప్రముఖ పక్షాలన్నీ నినాదాలతో గట్టెక్కాలని చూస్తున్న తరుణంలో దీనదయాళ్‌జీ 1965లో ఏకాత్మ మానవ దర్శనాన్ని భారతీయుల ముందుంచారు.

విశ్వకళ్యాణ కారకమైన ఈ మార్గంలో ప్రపంచాన్ని నడిపించవలసిన బాధ్యత భారతజాతిదని ఆయన పేర్కొన్నారు. దీనదయాళ్‌జీ చూపిన బాటను మౌలిక సిద్ధాంతంగా స్వీకరించిన బిజెపిని ఆదరించి, భారత ప్రజలు ఏకాత్మ మానవ దర్శనానికి పట్టం కట్టారు. దీనదయాళ్జీ సూచించిన అంత్యోదయ స్ఫూర్తితో అభివృద్ధి ఫలాలను అందరికీ అందించే కృషి సాగుతోంది.

ఆర్థికాధారిత పరిష్కారాలు విశ్వమానవాళి సంక్షేమానికి, శాంతి సాధనకు చాలవని బ్లూవేల్ ప్రేరేపిత ఆత్మహత్యలు, అమెరికాలోని లాస్‌వేగాస్ తరహా ఉన్మాద హత్యలు హెచ్చరిస్తున్నాయి. దీనదయాళ్‌జీ అందించిన ఏకాత్మ మానవ దర్శనం ఒకటే మనకు మిగిలిన పరిష్కార మార్గం. విశ్వకళ్యాణ కారకమైన ఈ మార్గాన్ని ప్రపంచానికి అందజేయడానికి నాయకత్వం వహించడం భారత్ కర్తవ్యమని భారతీయులు భావించాలి, ఆ దిశగా భారత ప్రభుత్వాన్ని బలోపేతం చేయాలి!



సంస్మరణ

# 'స్వచ్ఛతే సేవ'తో మహాత్ముడికి నివాళి

అక్టోబర్ 2 గాంధీ జయంతి పురస్కరించు కొని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు బిజెపి తెలంగాణ నేతలు 'స్వచ్ఛతే సేవ' కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నారు. చీపురు, పార పట్టుకొని పరిసరాలను శుభ్రం చేశారు. మాజీ కేంద్ర మంత్రి, ఎంపీ బండారు దత్తాత్రేయ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని సనత్‌నగర్ నియోజక వర్గం బి.కె.గూడా, దాసారం బస్తీలో "స్వచ్ఛతే సేవ" కార్యక్రమం చేపట్టి పరిసర ప్రాంతంలో పేరుకుపోయిన చెత్త, మట్టి కుప్పలను తొలగించారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ దేశాన్ని స్వచ్ఛ భారత్‌గా మార్చాలన్న సంకల్పంతో నరేంద్ర మోదీ ప్రభుత్వం 2014లో కార్యాచరణ ప్రారంభించిందని, దేశంలోని అన్ని గ్రామాలలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. ఈ కార్యాచరణతో నేటి వరకు వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం గ్రామీణ ప్రాంతాల్లో 56.21 శాతానికి చేరిందని, 2019 వరకు దేశంలో 100 శాతం వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మిచడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దడమే మహాత్మా గాంధీకి నివాళి అని, పారిశుద్ధ కార్మికులు గాంధీ భక్తులని అన్నారు. మహాత్మా గాంధీ కూడా మరుగుదొడ్లను శుభ్ర పరిచారని, ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు.







బిజెపి రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మణ్, బిజెపి శాసనసభా పక్షనేత జి.కిషన్ రెడ్డి తదితరులు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంతకుముందు లక్ష్మణ్ ముషీరాబాద్ నియోజకవర్గంలో 'స్వచ్ఛతే సేవ' కార్యక్రమంలో భాగంగా పరిసరాలు శుభ్రపరిచారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులు, ప్రజలతో స్వచ్ఛతా ప్రమాణం చేయించారు. బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యుడు పేరాల శేఖర్ రావు సినీనటుడు ప్రభాస్ అభిమానులతో మల్కాజ్‌గిరిలోని పలు కాలనీల్లో 'స్వచ్ఛతే సేవ' కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రతా కార్యక్రమాలు చేపట్టారు. గాంధీ జయంతి సందర్భంగా బిజెపి నేతలు, కార్యకర్తలు స్వచ్ఛతా కార్యక్రమాల్లో పాల్గొని మహాత్మునికి నివాళి అర్పించారు.

–జనసందేశ్ ప్రతినిధి




# తెలంగాణలోనూ బిజెపికి మంచి అవకాశాలు

బిజెపి జాతీయ సంఘటనా ప్రధాన కార్యదర్శి రామ్‌లాల్‌జీ మూడు రోజుల తెలంగాణ పర్యటన ఫలవంతంగా సాగింది. అక్టోబర్ 1 నుంచి 3 వరకు సాగిన ఈ పర్యటనలో బూత్ కమిటీ నుంచి రాష్ట్ర కమిటీ వరకు వివిధ సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. మొదటి రోజు వికారాబాద్ జిల్లా కులకచర్లలో బూత్ కమిటీ సమావేశంలో శ్రేణులకు మార్గరదర్శనం చేశారు. అదేరోజు మాజీ శాసనసభ్యులతో సమావేశమయ్యారు. రెండవ రోజు రాష్ట్ర కార్యాలయంలో వరుస సమావేశాల్లో పాల్గొన్నారు. విడివిడిగా జరిగిన కిసాన్ మోర్చా రాష్ట్ర పదాధికారులు, జిల్లా అధ్యక్షుల సమావేశం, రాష్ట్రస్థాయిలో వివిధ ప్రాజెక్టులు, డిపార్ట్‌మెంట్ కమిటీలతో సమావేశం, బిజెపి రాష్ట్ర పదాధికారులు, జిల్లా అధ్యక్షులు, ఇంచార్జ్‌ల సమావేశం, ఎంఎల్‌సి, ఎంఎల్‌ఎలతో సమావేశం, రాష్ట్ర కోర్ కమిటీ సమావేశంలో పాల్గొని రాష్ట్రంలో రాజకీయ వరిణామాలపై చర్చించారు. ఈ సమావేశాల్లో పార్టీ వివిధ విభాగాలు పనిచేస్తున్న తీరును, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా చేపట్టిన ఉద్యమాలను, బిజెపి నాయకులు ప్రజలకు చేరువవుతున్న విషయాలను, రాష్ట్రంలో ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్న తీరును తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. నాయకులకు పలు సూచనలు చేశారు. సలహాలు ఇచ్చారు. 2019లో రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి రావడానికి చేపట్టాల్సిన అనేక విషయాలపై మార్గదర్శనం చేశారు.

రాష్ట్రంలో అధికారంలో రావడానికి పార్టీకి మంచి అవకాశాలున్నాయంటూ కొన్ని ఉదాహరణలు ఇచ్చారు. అస్సాం, హర్యానాలలో బిజెపి చాలా బలహీనంగా ఉన్నప్పటికీ ఎన్నికల సంవత్సరం ముందు నుండి అక్కడి ప్రచార కార్యక్రమాలు, ముఖ్యంగా నరేంద్ర మోదీ పథకాలు- రైతులు, యువకులు, మహిళలు, కార్మికులు తదితర వర్గాలపై దృష్టి పెట్టిన విషయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లారన్నారు. అస్సాం, హర్యానాల కన్నా తెలంగాణలో సంస్థాగతంగా మంచి స్థితిలో ఉన్నామని, ఇక్కడ కొంత కష్టపడితే విజయం బిజెపిదేనని స్పష్టం చేశారు.

రాజకీయ పండితులు యూపీలో బిజెపి అధికారంలోకి రాదని చెప్పినప్పటికీ 'సైలెంట్ ఓటర్లు' అక్కడి ప్రాంతీయ పార్టీని, సమాజ్‌వాది పార్టీని చిత్తుగా ఓడించారని, ఇదే స్థితి తెలంగాణలో రాబోతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అవినీతికి ప్రత్యామ్నాయంగా గొర్రె, బర్రె, మేక ఏవీ పనిచేయవని, ప్రజలు అన్నీ గమనిస్తుంటారన్నారు. తెలంగాణలో బిజెపి అధికారంలోకి రావడానికి టీఆర్‌ఎస్ అవినీతి, అసమర్థత, కుటుంబ పాలన దోహద పడతాయని అన్నారు. నరేంద్ర మోదీ అవినీతిరహిత పాలన, సమర్థత, ప్రపంచంలోనే భారత్‌కు గుర్తింపు తెచ్చిపెట్టిన విషయాన్ని తెలంగాణ ప్రజలు గుర్తించారన్నారు.

ఇక్కడ నుండి అరబ్ దేశాలకు వెళ్లిన కార్మికులు, ఉద్యోగస్తులను కేంద్ర ప్రభుత్వం తిరిగి రప్పించిన విషయాన్ని, కేంద్రమంత్రి సుష్మా స్వరాజ్ చొరవను తెలంగాణలోని అనేక జిల్లాల్లో ప్రజలు గుర్తిస్తున్నారన్నారు. మహారాష్ట్రలో ఎన్ని ఓట్ల జిమ్మిక్కులు చేసినప్పటికీ కాంగ్రెస్ చిత్తుగా ఓడిపోయిందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్-టీఆర్‌ఎస్‌ల జంట అవినీతిని ప్రజలు మర్చిపోరని, 2019లో వీరికి ఓటమి ఖాయమని స్పష్టం చేశారు. మూడో రోజులో శంషాబాద్‌లో జరిగిన పూర్తి సమయ విస్తారకుల సమావేశంలో ప్రసంగించారు. అదేరోజు నాగర్ కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండల కమిటీ సమావేశం, వనపర్తి జిల్లా శక్తి కేంద్రాల ఇంచార్జ్‌ల సమావేశంలో పాల్గొని దిశానిర్దేశం చేశారు.

ఈ సమావేశాల్లో రామ్‌లాల్‌జీతో పాటు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మణ్, జాతీయ ప్రధాన కార్యదర్శి పి.మురళీధర్ రావు, శాసనసభా పక్షనేత జి.కిషన్ రెడ్డి, శాసనసమండలి పక్షనేత ఎన్.రాంచందర్ రావు తదితర రాష్ట్ర నేతలు పాల్గొన్నారు.

**-జనసందేశ్ ప్రతినిధి**



వర్తమానం

# మానవ తప్పిందం వల్లే కాళేశ్వరం ప్రమాదం



కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా 10వ ప్యాకేజీలో జరుగుతున్న తిప్పాపూర్ టన్నెల్ పనుల్లో ప్రమాదం జరిగిన ఘటనా స్థలాన్ని సెప్టెంబర్ 21న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మణ్ నేతృత్వంలో బిజెపి బృందం సందర్శించింది. ఈ సందర్భంగా బిజెపి బృందం టన్నెల్లోని ప్రమాద స్థలాన్ని నేరుగా పరిశీలించి, అక్కడి అధికారులను ఘటనా వివరాలు అడిగి తెలుసుకుంది.

అనంతరం డా॥ లక్ష్మణ్ పాత్రికేయులతో మాట్లాడుతూ... మానవ తప్పిదం వల్లనే ఈ దుర్ఘటన జరిగిందని, నియమ నిబంధనలను తుంగలో తొక్కి పనులు నిర్వహిస్తున్నారని విమర్శించారు. హెచ్‌సిసి కంపెనీ ఎత్తిపోతల పథకం పనులు చేపడుతుందని, సబ్ కాంట్రాక్టర్లకు ఇచ్చి పనులు చేయించడంతో వారు కనీస భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లనే ఈ సంఘటన జరిగిందని మండిపడ్డారు. ఈ పనుల విషయంలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో ఒకవైపు వ్యాజ్యాలు కొనసాగుతుండగానే హడావుడిగా పనులు చేపడుతున్నారని అన్నారు. టన్నెల్ పనులకు, భూగర్భ పనులకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్‌సేఫ్టీ నుండి విధిగా పర్మిషన్ తీసుకోవాల్సి ఉంటుందని, సరైన పని స్థలాలను పర్యవేక్షించకుండా పనులు చేయడం వల్లనే ఈ ప్రమాదం జరిగినట్లుగా భావించారు. అధికారుల పర్యవేక్షణలో టన్నెల్‌లో పనులు నిర్వహించాల్సి ఉండగా, కార్మికులతోనే పనులు కొనసాగిస్తున్నారని, అందువల్లనే ఈ ప్రమాదం చోటుచేసుకొని ఏడుగురి కార్మికుల ప్రాణాలు గాల్లో కలిసిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యతారహితంగా వ్యవహరించిన వారందరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డా॥ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. అదేవిధంగా మైనింగ్ ఒకేషనల్ ట్రైనింగ్‌లో శిక్షణ పొందిన కార్మికులనే ఇలాంటి పనుల్లో వినియోగించాలన్నారు. గతంలో అనుభవం ఉందనే ఒకే ఒక్క కారణంతో ఒడిషా, ఛత్తీస్‌గడ్, ఝార్ఖండ్ రాష్ట్రాల నుండి వలస కార్మికులను పనులకు వినియోగిస్తున్నారని విమర్శించారు.



ఈ ప్రమాదపై డిజిఎంఎఫ్ నేతృత్వంలో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కేంద్ర కార్మిక శాఖ పరిధిలోని కోర్ట్ ఆఫ్ ఎంక్వైరీని నియమించాలని కోరుతామని డా॥ లక్ష్మణ్ తెలిపారు. మృతుల కుటుంబాలకు ఇన్సూరెన్స్ పథకం కింద వచ్చే రూ.15 లక్షలు, కంపెనీ రూ.5 లక్షలు ఇస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని, కానీ ప్రభుత్వ ఎక్స్‌గ్రేషియా ఇందులో లేదని మండిపడ్డారు. మైనింగ్ యాక్సిడెంట్లలో వర్తించే అన్ని సదుపాయాలను, నష్టపరిహారాలను మృతుల కుటుంబాలకు చెల్లించాలని డా॥ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. మొత్తంగా సాగునీటి ప్రాజెక్టులలో అనేక అవినీతి ఆరోపణలు వెల్లువెత్తిన దరిమిలా సమగ్రమైన విచారణ జరిపించాలన్నారు. తిప్పాపూర్‌లో జరిగిన ప్రమాదానికి కారకులైన కాంట్రాక్టర్లపై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని స్పష్టం చేశారు. దేశంలో అనేక ప్రాజెక్టులు కట్టారని, కానీ ఇంత పెద్ద ప్రమాదం ఎక్కడా జరగలేదని అన్నారు. 1986లో శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణ దశలో జరిగిన ప్రమాదంలో ఐదుగురు మరణించారని, ఆ తర్వాత ఇదే పెద్ద ప్రమాదమని తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ప్రాజెక్టుల రీడిజైనింగ్ పేరుతో రోజురోజుకు అంచనాలు పెంచుతూ, వేల కోట్ల రూపాయలు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని డా॥లక్ష్మణ్ ప్రభుత్వం నిప్పులు చెరిగారు.

పోలీసులు రాష్ట్ర అధ్యక్షునితో సహా మీడియాను ఘటనా స్థలానికి వెళ్లకుండా నియంత్రించడంతో కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మీడియా, ప్రతిపక్ష నాయకుల గొంతునొక్కే ప్రయత్నాన్ని డా॥ లక్ష్మణ్ ఖండించారు. బిజెపి బృందంలో డా॥ లక్ష్మణ్‌తో పాటు బిజెపి రాష్ట్ర కార్యదర్శి ఎస్.కుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధులు రఘునందన్ రావు, ఎన్.వి.సుభాష్, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ప్రతాప్ రామకృష్ణా, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కొత్త శ్రీనివాస రెడ్డి, సిద్ధిపేట జిల్లా అధ్యక్షుడు ఎన్.నరోత్తమ్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

–జనసందేశ్ ప్రతినిధి



ప్రభుత్వం ఏ పార్టీదైనా ప్రజల సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించాలి. – దీన్‌దయాళ్జీ



ముఖచిత్ర కథనం

# నవభారత నిర్మాణానికి ఏకమవుదాం!

## బిజెపి జాతీయ కార్యవర్గ సమావేశంలో అమిత్‌షా పిలుపు

• భువన

**నవ భారత నిర్మాణానికి అంతా ఏకం కావాలని పండిట్ దీన్‌దయాళ్ 101వ జయంతి సాక్షిగా బిజెపి విస్తృత స్థాయి జాతీయ కార్యవర్గ సమావేశం సందేశమిచ్చింది. ఢిల్లీలోని తాల్‌కతోరా స్టేడియంలో సెప్టెంబరు 24, 25 తేదీల్లో రెండు రోజుల పాటు బిజెపి విస్తృత స్థాయి జాతీయ కార్యవర్గ సమావేశం, ప్రజాప్రతినిధుల సమ్మేళనం స్ఫూర్తిదాయకంగా సాగింది. ఈ సమావేశాల్లో ప్రసంగించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బిజెపి జాతీయాధ్యక్షుడు అమిత్ షా బిజెపి శ్రేణులకు సరికొత్త దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశాల్లో అగ్ర నేతలు లాల్‌కృష్ణ అద్వానీ, మురళీ మనోహర్ జోషితో పాటు 13 రాష్ట్రాల బిజెపి ముఖ్యమంత్రులు, ఆరుగురు ఉపముఖ్యమంత్రులు, 60 మంది కేంద్ర మంత్రులు, బిజెపి ఎంపీలు, ఎమ్మెల్యేలు సహా 2 వేల మంది ప్రతినిధులు పాల్గొన్నారు.**

**రాజకీయాలను ఎన్నికలు, గెలుపు ఓటములకే పరిమితం చేయకుండా... ప్రజల జీవన ప్రమాణాలను పెంచే పనిముట్టుగా బిజెపిని మలచాలని మోదీ బిజెపి నేతలకు పిలుపునిచ్చారు. 2022 నాటికి నవ భారతాన్ని నిర్మించాలన్న ప్రధాని నరేంద్రమోదీ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు పార్టీ కార్యకర్తలంతా ఐక్యతతో పనిచేయాలని బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్ షా కోరారు. ఈ సమావేశాల్లో భాగంగా అమిత్ షా బిజెపి రాష్ట్ర అధ్యక్షులతో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో టీఆర్‌ఎస్ అవినీతి, బిజెపి విస్తృతి, సమకాలీన రాజకీయాంశాలను అమిత్ షా దృష్టికి బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మన్ తీసుకెళ్లారు. పండిట్ దీన్‌దయాళ్ శతజయంతి ముగింపు ఉత్సవాల సందర్భంగా జరిగిన ఈ సమావేశాలు దేశవ్యాప్తంగా ఉన్న బిజెపి శ్రేణులకు కొత్త ఉత్సాహాన్ని నింపాయి.**

**సెప్టెంబర్ 25న విస్తృతస్థాయి జాతీయ కార్యవర్గ సమావేశంలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు నివాళులు అర్పించిన అనంతరం బిజెపి జాతీయాధ్యక్షుడు అమిత్ షా ప్రసంగించారు. అమిత్ షా అధ్యక్షోపన్యాసాన్ని వారి మాటల్లోనూ చూద్దాం.**

కోజికోడ్‌లో గతేడాది జరిగిన జాతీయ కార్యవర్గ సమావేశంలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ శతజయంతి సంవత్సరాన్ని పేదల సంక్షేమ సంవత్సరంగా జరపాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చి ఆ దిశగా ప్రభుత్వాన్ని నడిపారు. సిద్ధాంతం, జాతీయవాదం ఆధారంగా నడిచేలా దీన్‌దయాళ్ మనకు ప్రేరణ ఇచ్చారు. ఆచరణలో విజయవంతం చేయడం ద్వారా మన సిద్ధాంతాలను విశ్వవ్యాప్తం చేయడమే మన లక్ష్యం. పార్టీని



విస్తరించాలనీ గత కౌన్సిల్ సమావేశం నిర్ణయించింది. ప్రధాని పిలుపు మేరకు 4 లక్షల మంది కార్యకర్తలు పార్టీని బలపర్చేందుకు ముందుకొచ్చారు. 15 రోజులు, 6 నెలలు, ఏడాది పాటు తమ సమయం వెచ్చించేందుకు కేటాయించారు. పండిట్ దీన్‌దయాళ్ శతజయంతి ప్రచారకులు మోదీ ప్రభుత్వం సాధించిన విజయాలను, పార్టీ భావజాలాన్ని పోలింగ్ కేంద్ర స్థాయి వరకూ చేర్చేందుకు అలుపెరుగని కృషి చేస్తున్నారు. మొత్తం 3,92,802 మంది శాశ్వత ప్రచారకులు 9,69,000 పోలింగ్ కేంద్రాలలో ప్రజలతో

మమేకం అయ్యేందుకు బయలుదేరారు. 6,13,947 పోలింగ్ కేంద్రాలలో ఈ కార్యక్రమం పూర్తయింది. సుమారు లక్షన్నర బూత్‌లలో కార్యక్రమం జరుగుతోంది. కొద్ది రోజుల్లోనే మొత్తం 7,63,947 బూత్‌లలో జనాల్ని కలిసే కార్యక్రమం పూర్తవుతుంది. 1198 శిక్షణ శిబిరాలు నిర్వహించి అందులో నాలుగున్న లక్షల మంది కార్యకర్తలకు శిక్షణ ఇచ్చాం. వీరిలో 4,682 మంది ప్రచారకులు ఆరు నెలలు, ఒక ఏడాది కోసం పార్టీ భావజాలాన్ని ప్రచారం చేయడానికి వెళ్లారు.

విస్తృత స్థాయి పర్యటనలో భాగంగా 25 రాష్ట్రాల్లోని పోలింగ్ కేంద్రాల్లో విడిది చేశాను. కుటుంబానికి దూరంగా ఉంటూ వివిధ ప్రాంతాల్లో కార్యకర్తలు చేస్తున్న ప్రచారం ప్రశంసించదగినది. పుదుచ్చేరికి చెందిన లక్ష్మీ అనే కార్యకర్త తన భర్త, బిడ్డకు దూరంగా హాస్టల్‌లో ఉంటూ పార్టీ కోసం ప్రచారం చేయడం కార్యకర్తల నిబద్ధత, శ్రమను తెలియచేస్తోంది. ఒకప్పుడు పది మంది సభ్యులతో ప్రారంభమైన బిజెపి నేడు 11 కోట్ల మంది సభ్యులతో ప్రపంచంలోనే అతి పెద్ద రాజకీయ పార్టీగా అవతరించింది. నేడు మన పార్టీ కేంద్రంలో సంపూర్ణ మెజారిటీతో అధికారంలో ఉంది. 1387 మంది శాసనసభ్యులు, 325 మంది ఎంపీలున్నారు. 13 రాష్ట్రాల్లో అధికారంలో ఉండగా, 5 రాష్ట్రాల్లో భాగస్వాములుగా ఉన్నాం. కేరళ, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, ఒడిషా, త్రిపుర, తెలంగాణ సహా ఈశాన్యంలో సుదూరంగా ఉన్న రాష్ట్రాల్లోని ప్రతి బూత్ వరకూ పార్టీని భావజాలాన్ని చేర్చడమే మన అంతిమ లక్ష్యం. బిజెపి ప్రభుత్వం అందరిదీ అని అధికారం చేపట్టినరోజు చేసిన తొలి ప్రసంగంలో ప్రధాని పేర్కొన్నారు. దానిని రుజువు చేస్తూ మూడేళ్లుగా అన్ని వర్గాలకు లబ్ధిని చేకూర్చారు. స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లయినా 60 కోట్ల మందికి బ్యాంకు ఖాతాల్లేవు. గడచిన మూడేళ్లలో 29 కోట్ల బ్యాంకు ఖాతాలు తెరిచి వారిని ప్రధాన స్రవంతిలో కలిపారు.

20 కోట్ల మంది మహిళలకు గ్యాస్ సిలిండర్లు ఇచ్చి వారికి ఆరోగ్యంగా జీవించే పరిస్థితిని కల్పించాం. 15 కోట్ల మంది కన్నా ఎక్కువ మందికి బీమా పథకాల ద్వారా సామాజిక భద్రత అందించాం. 7 కోట్ల మందికి ముద్ర బ్యాంకు ద్వారా హామీ లేకుండా రుణ సదుపాయం కల్పించి స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపరిచాం. 1947 నుంచి 2014 వరకు 600 కి.మీ.ఆప్టికల్ ఫైబర్ లైన్లు వేయగా, 2014 నుంచి ఇప్పటి వరకు లక్ష కి.మీ.వరకు లైన్లు వేశాం. 2014 నాటికి దేశంలోని 19 వేల గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం లేదు. ఈ మూడేళ్లలో 14 వేల గ్రామాలను విద్యుదీకరించాం. మే 2018 నాటికి అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా అందిస్తాం. గత మూడేళ్లలో నాలుగున్నర కోట్ల మరుగుదొడ్ల నిర్మాణం పూర్తిచేసి మహిళల ఆత్మాభిమానాన్ని కాపాడాం. రైతుల ఆదాయం రెట్టింపు చేసేందుకు మోదీ ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టింది. పంట నష్టపరిహారం పెంచాం. వేపపూత పూసిన యూరియా అందిస్తూ, యూరియా అక్రమరవాణాను అరికట్టాం. ఎరువులను పుష్కలంగా అందిస్తున్నాం. భూసార ఆరోగ్య కార్డులను జారీ చేసి నేల నాణ్యతను పెంచుతున్నాం. ప్రధానమంత్రి నీటిపారుదల పథకం, ఈనామ్, పంటల బీమా పథకం, నీలి విప్లవం ద్వారా రైతుల కోసం ఒక ప్రణాళిక తయారు చేశాం. దేశాభివృద్ధికి, ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలు పార్టీ పట్ల ప్రజలకు నమ్మకం, విశ్వాసం పెంచాయి. ఇటీవల నర్మదానది ఆనకట్ట ప్రారంభం, జపాన్ సహకారంతో బుల్లెట్ ట్రైన్ ఏర్పాటుకు పునాది వేయడం వంటివి నిర్మాణరంగంలోనూ ఈ ప్రభుత్వం సాధిస్తున్న ప్రగతికి కొన్ని ఉదాహరణలు. ఉడాన్ పథకం ద్వారా పేదలు కూడా విమానయానం చేసే అవకాశం కల్పించాం. జెనరిక్ ఔషధాలు, స్టెంట్లు, మోకీళ్ల మార్పిడి పరికరాల ధరలను తగ్గించి పేదలకు ఉపశమనం కల్పించాం.

కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం బుజ్జగింపులు, వారసత్వ రాజకీయాలు, ఆశ్రిత పక్షపాత రాజకీయాలు చేసింది. రూ.12 లక్షల కోట్ల కుంభకోణాలకు పాల్పడి అవినీతి ఊబిలో కూరుకుపోయింది. నేడు దేశాన్ని పాలిస్తోన్న బిజెపి ప్రభుత్వం రాజకీయాల్లో పనితీరునే నమ్ముకుంది. మూడేళ్లుగా అభివృద్ధే లక్ష్యంగా, అవినీతి రహితంగా పారదర్శకపాలనను అందిస్తోంది. రాహుల్‌గాంధీకి ఇవేమీ కనిపించవు. ఆయన విదేశాలకు వెళ్లి అక్కడి నుంచి బిజెపి ప్రభుత్వం ఏం చేసిందని ప్రశ్నిస్తుంటారు. నల్లధనానికి వ్యతిరేకంగా కఠిన చర్యలు తీసుకున్నాం. బినామీ ఆస్తుల చట్టం చేసి నల్లధనంపై ఉచ్చుబిగించాం. సింగపూర్, మారిషస్, సైప్రస్‌లతో చేపట్టే నల్లధన వ్యాపారాన్ని మూసివేయించాం. పెద్దనోట్ల రద్దు ద్వారా నల్లధనంపై ఉక్కుపాదం మోపాం. రెండున్నర లక్షల కన్నా ఎక్కువగా ఉన్న డొల్లకంపెనీలను మూసివేయించాం. ఇంకా ఎన్నికల నగదు చందాను రూ.2 వేలకు పరిమితం చేశాం. కేవలం డీబీటీ (ప్రత్యక్ష నగదు బదిలీ) పథకం ద్వారానే రూ.59 వేల కోట్లను వెలికితీయగలిగాం. ఐదేళ్లలో కేవలం డీబీటీ ద్వారానే దాదాపు రూ.3 లక్షల కోట్లు ఆదా అవుతోంది. ఈ మొత్తాన్ని పేదల సంక్షేమ కార్యక్రమానికి వెచ్చిస్తాం. ఆర్థిక పరివర్తనా ఉద్యమంలో మోదీ ప్రభుత్వం అంచనాలకు మించిన విజయం సాధించింది. 2013-14లో దేశ వృద్ధి రేటు 4.7 శాతంగా ఉండేది. గడిచిన మూడేళ్లలో దీనిని 7 శాతం కన్నా పైకి తీసుకెళ్లడంలో విజయం సాధించాం. వడ్డీ రేటును 8 శాతం నుంచి 12 శాతానికి తీసుకెళ్లే బదులు 6 శాతానికి తగ్గించగలిగాం. ధరల పెరుగుదలను 9 శాతం నుంచి 4.5 శాతానికి తగ్గించాం. కరెంట్ అకౌంట్ డెఫిసిట్ కూడా బాగా తగ్గింది. ఫోరెక్స్ రిజర్వ్ కూడా తొలిసారి 400 బిలియన్ డాలర్లను దాటింది. విదేశీ సంస్థాగత పెట్టుబడుల్లోనూ రికార్డుస్థాయి దూకుడు వచ్చింది. ఇంకా షేర్ మార్కెట్ కూడా మెరుగైన పనితనాన్ని చూపిస్తోంది. గడచిన మూడేళ్లలో పన్ను చెల్లింపుదార్లు 3 కోట్లను దాటి 6.3 కోట్లకు చేరారు. నల్లధనంపై మనం ఎంత కఠినంగా వ్యవహరించామనడానికి ఇదే సాక్ష్యం.

కేరళలో వామపక్షాల కూటమి ప్రభుత్వాలు రాజకీయాలను, రాజకీయంగా కాక ప్రతీకారధోరణికి పాల్పడుతున్నాయి. పార్టీల్లో సిద్ధాంతపరంగా వైరుధ్యాలుండటం సహజం. ఈ వైరుధ్యాలను ద్వేషించి పగ, ప్రతీకారాలతో హింసకు పాల్పడుతున్నాయి. ప్రభుత్వ అవినీతిపై ప్రశ్నించిన బిజెపి కార్యకర్తలపై వామపక్ష ప్రభుత్వాలు దాడులు, హత్యలకు పాల్పడ్డాయి. ఈ ప్రభుత్వాలు ఏర్పడ్డ ఆరునెలల్లో



నేను, నా దేశం - ఈ రెంటిలో నా దేశమే నాకు ముఖ్యమైనది. - డా॥ బి.ఆర్.అంబేద్కర్

మన కార్యకర్తలు 13 మందిని హత్యచేశారు. పశ్చిమ బెంగాల్లో 300 చోట్ల మన ప్రచారకులను జైలుపాలు చేశారు. వందలాది బిజెపి కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారు. హింసిస్తున్నారు. ప్రజాస్వామ్యం గొంతునొక్కే ఇలాంటి అనాగరిక చర్యలు స్వాతంత్ర్యం తర్వాత కేరళ, పశ్చిమబెంగాల్లో జరిగినంతగా మరే రాష్ట్రంలోనూ జరగలేదు. ఈ హింసా రాజకీయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా వారిలో చైతన్యాన్ని తీసుకురావడానికి పార్టీ నిర్ణయించింది. అందులో భాగంగానే అక్టోబరు 3 నుంచి 17 వరకు కేరళలో పాదయాత్రలు జరుపనున్నాం. హింస ద్వారా బిజెపి అభివృద్ధిని అడ్డుకోగలమని భావిస్తే అది వారి అపోహ మాత్రమే. హింస అనే బురదను బిజెపిపై జల్లితే అంతే వేగంగా కమలం వికసిస్తుంది. ఇలాంటి పిరికి చర్యలతో బిజెపిని లొంగదీసుకోలేరు. మేము అత్యవసర పరిస్థితుల్లో కూడా ఘర్షణలు ఎదుర్కొన్నాం. ఇంకా మేము ఘర్షణలు, త్యాగాలతో జ్వలించి వచ్చాం. వామపక్షాల రాజకీయ హింసను దేశ ప్రజల ముందు బట్టబయలు చేయాలి.

ఉగ్రవాదానికి, వేర్పాటువాదాన్ని సమర్థంగా అదుపుచేయగలిగాం. గత మూడేళ్లుగా జమ్ము కశ్మీర్‌లో ఉగ్రవాదం, వేర్పాటువాదం స్థితిని పరిశీలిస్తే, అక్కడి అలజడిని తగ్గించడంలో ప్రభుత్వం సఫలమైంది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జీరో టాలరెన్స్ విధానాన్ని అవలంబించిన ప్రభుత్వం ఆందోళనకర పరిస్థితులు చాలా వరకు తగ్గించింది. ఉగ్రవాదులకు పాకిస్థాన్ ద్వారా వస్తున్న ఆర్థిక సహాయాన్ని మన పరిశోధక సంస్థలు నివారించగలిగాయి. అలాగే బ్రిక్స్ విశ్వ వేదికపై పాకిస్థాన్ నుంచి వెలువడుతోన్న ఉగ్రవాద భూతాన్ని బట్టబయలు చేయగలిగాం. ఐక్యరాజ్యసమితి ఫోరంలో పాకిస్థాన్ బండారాన్ని విదేశాంగశాఖ మంత్రి సుష్మా స్వరాజ్ బట్టబయలు చేశారు. ప్రధాని తీసుకున్న నిర్ణయాలు ప్రపంచంలో భారత్‌కు విశిష్టస్థానం తెచ్చిపెట్టాయి. ప్రధాని నరేంద్రమోదీ తీసుకున్న సాహసోపేత నిర్ణయాల వల్ల విదేశాంగ విధానం విజయవంతమైంది.

కేంద్రంలోని బిజెపి రాజకీయ ఇచ్ఛా శక్తిని, సాహసాన్ని ప్రదర్శించింది. మహిళలకు సమాన అధికారాన్ని, ముమ్మారు తలాక్ పీడితులైన మహిళలకు న్యాయం కల్పించడంలో ముందడుగు వేసింది. దీనికి న్యాయ వ్యవస్థ కూడా అనుకూలంగా స్పందించింది. న్యాయం కోసం పోరాడుతున్న పీడిత మహిళలకు ఈ సందర్భంగా అభినందనలు. వెనుకబడిన వర్గాల కమిషన్లకు రాజ్యాంగబద్ధత కల్పించాలనే డిమాండ్ 1955 నుంచి బలంగా ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వాలు దానిని అమలుచేయలేదు. నరేంద్ర మోదీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం బీసీలకు రాజ్యాంగ బద్ధత కల్పించే బిల్లును తీసుకొచ్చింది. లోక్‌సభలో ప్రవేశపెట్టి పాస్ చేయించింది. కాని ఈ బిల్లును రాజ్యసభలో కాంగ్రెస్ ఓడించి బీసీల పట్ల తమ వ్యతిరేక నైజాన్ని తెలియచేసింది. వారికి రాజ్యాంగ గుర్తింపు ద్వారా 2019లోపే అధికారాన్ని ఇప్పించేలా తీవ్ర ప్రయత్నం చేస్తున్నాం. వెనుకబడిన వర్గాల కమిషన్‌కు రాజ్యాంగబద్ధత కల్పించేందుకు ఈ బిల్లును తీసుకొచ్చినందుకు గాను ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర ప్రభుత్వాన్ని హృదయపూర్వకంగా అభినందిస్తున్నా. ఎర్రబుగ్గ కార్లను నిషేధించడం ద్వారా అందరూ సమానులే అనే భావనను మోదీ తీసుకువచ్చారు.

డోక్లామ్ వివాదం ఎలా పరిష్కరించాలన్న విషయంపై చాలా ఊహాగానాలొచ్చాయి. ప్రధాని మోదీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం స్థిరచిత్తంతో దౌత్య మార్గం ద్వారా డోక్లామ్ సమస్యను శాంతియుతంగా పరిష్కరించింది. ఇది ఈ ప్రభుత్వ దౌత్యనీతిని, రీతిని ప్రపంచానికి తెలియచేసింది. భూటాన్‌తో కూడా పొరుగుదేశం బాధ్యతను సక్రమంగా నిర్వహించాం. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాద చర్యలు, ఆ దేశం ప్రోత్సహిస్తోన్న ఉగ్రవాద సంస్థలను బ్రిక్స్ దేశాల సమ్మేళనంలో ప్రకటన పత్రంలో చేర్చి, హెచ్చరించడం ద్వారా బ్రెజిల్, రష్యా, దక్షిణాఫ్రికాల మద్దతును కూడ గట్టగలిగాం. చైనాను కూడా తప్పనిసరి పరిస్థితుల్లో ప్రకటన పత్రాన్ని అంగీకరించేలా చేసి దౌత్యపరంగా విజయం సాధించగలిగాం. పాకిస్థాన్‌కు గట్టి హెచ్చరిక ఇవ్వగలిగాం. బ్రిక్స్ సమ్మేళనం విజయంతో భారత్, చైనా, రష్యా, బ్రెజిల్ మధ్య పరస్పర సహకారం పెరుగుతోంది. బ్రిక్స్ ఇతర ప్రధానమంత్రులతో సమానంగా చైనాను కలపడం భారత్, చైనా పరస్పర సంబంధాల కు కూడా బలం చేకూరింది. హిమాచల్‌ప్రదేశ్, గుజరాత్‌ల్లో ఎన్నికలు సమీపిస్తున్నాయి. ఈ రెండు రాష్ట్రాల్లోని బిజెపి కార్యకర్తలు ఈ ఎన్నికల పట్ల ఎంతో ఉత్సాహం కనబరుస్తున్నారు. ఈ ఉత్సాహమే రెండు రాష్ట్రాల్లో పార్టీకి విజయాలను అందిస్తుంది.

కాంగ్రెస్ నిర్వీర్యమైన పార్టీ. ఏ విషయంలోను ఆ పార్టీ మనతో సమానస్థాయిలో లేదు. అభివృద్ధి, దేశ రక్షణ విషయాల్లో వాదించలేదు. మోదీ నిర్ణయాలు, దృష్టికోణంపై ప్రశ్నించలేదు. వారసత్వవాదమే కాంగ్రెస్ స్వభావం. ఇది భారతదేశ స్వభావం మాత్రం కాదు. బిజెపి కుటుంబవాదాన్ని, జాతివాదాన్ని, బుజ్జగింపు రాజకీయాలను అంతంచేసి ఉపయోగపడే రాజకీయాలు ప్రారంభించాం. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, మణిపూర్ శాసనసభ ఎన్నికలే ఇందుకు ఉదాహరణ. కాంగ్రెస్ పాలిత యూపీఏ పదేళ్లలో చేయనంత అభివృద్ధి మూడేళ్లలో మోదీ ప్రభుత్వం చేసింది. కేరళ, పశ్చిమబెంగాల్‌లో మన కార్యకర్తల హత్యలు, అత్యాచారాలు జరిగినప్పుడు, కశ్మీరీ పండితుల ఊచకోత సమయాల్లో వారు అసహనం గురించి మాట్లాడరు. ఎప్పుడైతే ఎన్నికలు సమీపిస్తాయో అప్పుడు 'అసహనం' విషయం ప్రచారం చేస్తారు. అసహనం గురించి ప్రస్తావించంలో కూడా సమానత లేకుంటే ఆ అంశాన్ని ప్రస్తావించే అధికారం కూడా వారికి లేదు.

ప్రధాని మోదీ నవ భారత్ దృక్పథం, విజన్‌ను ప్రజల ముందుంచారు. ఆంగ్లేయులు భారత్‌ను వదలాలని 1942 నుంచి 1947 వరకు ప్రజలంతా డిమాండ్ చేశారు. అదే స్ఫూర్తితో 2022లో మనం 75వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరుపుకుంటాము. నవ భారత్ దృక్పథం దేశంలో 125 కోట్ల మంది ప్రజల నినాదం కావాలి. మనం ఈ దిశగా ప్రయత్నం చేయాలి. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నవ భారత్ కోసం 2022 వరకు ఆరు లక్ష్యాలు పూర్తి చేసేందుకు సంకల్పించారు. అవి అపరిశుభ్రత, పేదరికం, ఉగ్రవాదం, జాత్యహంకారం (కులతత్వం) ఛాందసవాదం( మతతత్వం), అవినీతి. వీటిని రూపుమాపడం ద్వారా లక్ష్యాలను చేరుకోడానికి మనం ఐక్యతతో పనిచేయాలి. ■



# రాజకీయాల్ని ప్రజలకు ఉపయోగపడే పనిముట్టులా మలచాలి

ప్రజల జీవన ప్రమాణాల్ని పెంచే దిశగా బిజెపిని ప్రజల చేతిలో ఒక పనిముట్టుగా మలచాలని ప్రధాని నరేంద్రమోదీ బిజెపి జాతీయ కార్యవర్గ సమావేశంలో పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. ఎన్నికల్లో పోటీకి, గెలుపు-ఓటములకే రాజకీయాలను పరిమితం చేయొద్దని, ఇలాంటి సంప్రదాయ రాజకీయ విధానాల స్థాయి నుంచి పార్టీ ఎదగాలని సూచించారు. ప్రజాస్వామ్యాన్ని ఎన్నికలకు అతీతంగా చూడాలని, ప్రజా ప్రాతినిధ్యాన్ని పెంచాలన్నారు. ఎన్నికల్లో కార్యకర్తలు ఐక్యమత్యంగా కృషి చేసి పార్టీని గెలిపించారంటూ ప్రశంసించారు. ఈ ఐక్యమత్యాన్ని ఎన్నికల్లో గెలిచే యంత్రంలా చూడొద్దంటూ ప్రజలను ప్రభుత్వంతో జోడించే ఒక సాహసకృత్యంగా అభివర్ణించారు. అధికారమంటే పెత్తనం చెలాయించడానికో, అనుభవించడానికో కాదని, ప్రజలకు సేవ చేయడానికి ఒక మాధ్యమంగా లేదా సాధనంగా మాత్రమే చూడాలన్నారు. అధికారంలోకి వచ్చేవరకు మనం పార్టీ కార్యకర్తలమని, అధికారంలోకి వచ్చాక ప్రజల ఆశలకు, ఆకాంక్షలకూ కేంద్ర బిందువులయ్యామని అన్నారు. ప్రజలకు లబ్ధి కలిగించడమే కేంద్రంగా రాజకీయాలు ఉండాలన్నారు. సమస్యల పరిష్కారం, అభివృద్ధి వంటి వాటిలో ప్రజల్ని భాగస్వాముల్ని చేయడానికి ప్రజా ప్రతినిధులు కట్టుబడి ఉండాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతో నిర్మితం కాని ఏ ఉద్యమమైనా విజయవంతం కాబోదని చెప్పారు. ప్రజా భాగస్వామ్యం ఉంటే ఏ కార్యక్రమమైనా ఎలా విజయవంతం అవుతుందో చెప్పడానికి స్వచ్ఛభారత్ ఒక మంచి ఉదాహరణ అన్నారు.

పార్టీ నేతల గురించి మోదీ మాట్లాడుతూ... ప్రజా సమస్యలకు, ప్రభుత్వానికి మధ్య సంధానకర్తలుగా నిలవాలన్నారు. పార్టీ కార్యకర్తలూ, ప్రజా ప్రతినిధులూ ప్రభుత్వ పథకాలను రైతుల వద్దకు తీసుకెళ్ళాలని, గ్రామస్థాయిలో ఉన్న సమస్యల గురించి చర్చించాలని, అప్పుడే సమస్యలు పరిష్కారమై, ప్రజలకు అభిమానపాత్రులు కాగలరని తెలిపారు. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించే క్రమంలో కార్యకర్తలు తమ వంతు పాత్రను తప్పక పోషించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పథకాలు ప్రజల వద్దకు చేర్చడమే కార్యకర్తల ప్రధానవిధిగా అభివర్ణించారు.

అవినీతి వ్యతిరేక యుద్ధంలో ఎటువంటి రాజీ లేదని మోదీ స్పష్టం చేశారు. పట్టుబడిన అవినీతిపరుల్లో ఏ ఒక్కరినీ వదలమని తేల్చి చెప్పారు. ఆర్థిక నేరగాళ్ళను ఉపేక్షించమంటూ అవినీతిని అంతం చేయడమే తన పోరాటం లక్ష్యంగా పేర్కొన్నారు. విదేశాల్లో దాక్కున్న 90 మందిని తీసుకువచ్చామని చెప్పారు. అధికారంలోకి రావడమే బిజెపి పరమావధి కాదని అన్నారు. అధికారం సాధించి ప్రజలకూ, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజల మధ్య ఐక్యమత్యాన్ని పునఃప్రతిష్టించామన్నారు. అధికారంలో ఉన్నా బిజెపి ఐక్యత క్రియాశీలకంగా ఉందని, అంత క్రియాశీలకంగా మరే పక్షమూ లేదని అన్నారు. ప్రజాసమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి, వాటి పరిష్కారానికి పనిచేసి ప్రజలకు దగ్గరవ్వడం ప్రతిపక్షాలు చేయాల్సిన పని అని, కానీ దేశంలో విపక్షాల పనితీరు దీనిని భిన్నంగా ఉందని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం దిశగా కాకుండా ప్రభుత్వంపై ఈర్ష్యా ద్వేషాలు వెళ్లకక్కుతూ ప్రతీకారధోరణి అవలంబిస్తున్నాయన్నారు. మొండిగా వ్యవహరిస్తూ, దుర్భాషలాడుతూ, తప్పుడు ఆరోపణలు చేస్తూ, చిన్న చిన్న విషయాలకు గొడవలు సృష్టిస్తూ ప్రజల దృష్టిలో చులకన అవుతున్నాయన్నారు.



విపక్షాల దృష్టిలో అధికారం అంటే వ్యక్తిగత అధికారం చెలాయించడమే అని స్పష్టం చేశారు. ఈ రీతిగా ఏళ్ల తరబడి అధికారం అనుభవించాయని విమర్శించారు. అధికారం దూరమవడంతో వారికి ముచ్చెమటలు పోస్తున్నాయని, అసహనం ప్రదర్శిస్తూ చిందులేస్తున్నాయని మండిపడ్డారు. ఆ పార్టీలకు ప్రజాసేవ చేయడం, ప్రజాస్వామ్యం అమలు చేయడం వంటి విషయాలు తెలీదన్నారు. అందుకే అధికారంలో ఉన్నప్పుడు ఈ అంశాలు ఏ మాత్రం గుర్తుకురాలేదని తెలిపారు. దేశం అభివృద్ధి చెందకపోవడానికి ఇలాంటి పార్టీలు ప్రభుత్వాలు నడపడమే కారణమని విశ్లేషించారు. విపక్షాలు పరుషమైన భాషను ప్రయోగించినంత మాత్రాన నాపై, ప్రభుత్వంపై చేస్తున్న అసత్య ప్రచారం, అబద్ధపు అభియోగాలు నిజాలు కావని కుండబద్దలు కొట్టారు. ఎన్నికలకే పరిమితం కాకుండా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచే సాధనంగా పార్టీని తీర్చిదిద్దాలని సూచించారు.

2022 నాటికి నవ భారత్‌ను నిర్మించాలనేది ప్రభుత్వ సంకల్పమని, పేదరికం, ఉగ్రవాదం, కులతత్వం, మతతత్వం, అవినీతి, పారిశుద్ధ్య లేమి.... ఈ ఆరు రుగ్మతల నుంచి దేశాన్ని అయిదేళ్లలో బయట పడవేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ రుగ్మతలను తొలగిస్తేనే నవభారత నిర్మాణం సాధ్యం అవుతుందన్నారు. నవభారత నిర్మాణం దేశంలోని ప్రతి పౌరుడి సంకల్పం కావాలన్నారు. ఈ లక్ష్యానికి ప్రజల భాగస్వామ్యం కూడా కలిస్తే విజయం సాధించడం ఏ మాత్రం కష్టకాదని స్పష్టం చేశారు.

పేదల అభివృద్ధి కోసం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలను వారికి దగ్గర చేయాలని సూచించారు. అటు మధ్య తరగతిపై పడే ఆర్థికభారాన్ని తగ్గించాలన్నారు. అప్పుడు మనం పేదరికంతో చేస్తున్న పోరాటంలో గెలవగలమని స్పష్టం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా భారతదేశం పట్ల గౌరవం, విశ్వాసం పెరుగుతున్నాయని తెలిపారు. అలాగే ప్రపంచ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా మనం చేస్తున్న పోరాటాన్ని అన్ని దేశాలు సమర్థిస్తున్నాయన్నారు. మనపై కాలుదువ్విన చైనాకు తగిన



గుణపాఠం చెప్పడం ద్వారా ఆ దేశాన్ని తోకముడిచేలా చేశామని చెప్పారు. డోక్లామ్ వివాదాన్ని శాంతియుతంగా పరిష్కరించుకున్న తీరు చూసి అనేకమంది ఆశ్చర్యపోతున్నారని, ఇప్పుడు మనం ఏదైనా ఒక సంకల్పం చేస్తే దాన్ని పూర్తిచేయగలమనే విశ్వాసంతో ఉన్నామన్నారు. అక్టోబరు 31న సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా పార్టీ 'ఐక్యత కోసం పరుగు' కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని, దీనిని కోట్లాదిమందితో చేపట్టాలని కోరారు. ఎన్నికల్లో సఫలం కావటం కన్నా ఎన్నికల తర్వాత సఫలం కావడమే ముఖ్యమని, అలాగే ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చాలని అన్నారు. ఇంద్రధనుష్ కార్యక్రమాన్ని సఫలం చేస్తే దేశంలోని ప్రతి శిశువూ ఆరోగ్యంగా ఉండి దేశ వికాసంలో తమ వంతు పాత్ర పోషిస్తాడని అన్నారు. ప్రధాన మంత్రి ఉజ్వల పథకం ద్వారా పేదలకు ఉచిత ఎల్పీజీ కనెక్షన్లు ఇచ్చిన మాదిరిగా ప్రధానమంత్రి సౌభాగ్య పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం పేదలకు ఉచితంగా విద్యుత్ కనెక్షన్లు ఇప్పిస్తుందని స్పష్టం చేశారు. ■




సింగరేణి కార్మిక సంఘం ఎన్నికల్లో భారతీయ మజ్దూర్ సంఘ్‌కు మద్దతుగా ప్రచారం చేసిన ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డి

సంస్థాగతం

# 'నవ భారతం' సాకారం చేసుకుందాం!

**సెప్టెంబర్ 25న ఢిల్లీలో జరిగిన బిజెపి జాతీయ కార్యవర్గ సమావేశంలో బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి భూపేందర్ యాదవ్ రాజకీయ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్, బీహార్ ఉపముఖ్యమంత్రి సుశీల్ కుమార్ మోదీ మద్దతు తెలిపారు. జనసందేశ్ పాఠకుల కోసం ఈ సమావేశంలో ఆమోదం పొందిన రాజకీయ తీర్మానం.**



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనుసరిస్తున్న అభివృద్ధికారక విధానాలకు ప్రజల నుంచి అపూర్వమైన మద్దతు లభించడంతో పాటు ఈ కార్యక్రమాల మీద విశ్వాసం పెరుగుతోంది. నరేంద్ర మోదీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వ విధానాలు దూరదృష్టి గలవే కాదు జన సంక్షేమానికి, ఆర్థికాభివృద్ధికి, అంతర్జాతీయంగా భారత ప్రతిష్ఠ పెంచడానికి ఉద్దేశించినవి. తీవ్రవాదం, వేర్పాటువాదం, సామాజిక న్యాయం, విదేశీ వ్యవహారాలు, అవకాశాలు, మహిళల జీవితానికి గౌరవం, అందరికీ వర్తించే ఆర్థిక విధానాలపై ప్రజలకు విశ్వాసం కలిగింది. దేశ సర్వతోముఖాభివృద్ధికి కావాల్సిన విధానాలు అనుసరిస్తున్నందుకు బిజెపి జాతీయ కార్యవర్గం ప్రధానమంత్రిని అభినందిస్తోంది. ఈ విధానాల వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయి. సాధించిన కొన్ని విజయాలను ఈ కింద పేర్కొంటున్నాం:

### 1.పారదర్శక ఆర్థిక విధానానికి పునాది

అవినీతి, నల్లధనానికి సంబంధించిన వాగ్దానాన్ని బిజెపి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేసింది. పెద్ద నోట్ల రద్దుకు ప్రజల నుంచి లభించిన అపారమైన మద్దతును గమనించాలి. ఈ ఒక్క చర్య వల్ల చీకటి వ్యాపారం నడ్డి విరిగింది. నల్లధనం పోగేసే వారికి చావుదెబ్బ తగిలింది. ఇది పారదర్శక ఆర్థిక వ్యవస్థకు పునాదులు వేయడానికి, నిజాయితీపరులకు మద్దతివ్వడానికి ఉపకరించింది. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం, గ్యాస్ సబ్సిడీ, ఉపకార వేతనాలు, పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాల కింద లబ్ధి పొందే వారికి డిజిటల్ పద్ధతిలో డబ్బు బదలాయిస్తున్నందువల్ల పారదర్శకత పెరిగింది. వ్యవస్థలో వచ్చిన ఈ మార్పు వల్ల ఆదాయ పన్ను చెల్లించే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. డిజిటల్ పద్ధతిలో లావాదేవీలు ఇనుమడించాలి. పెద్దనోట్ల చెలామణి గణనీయంగా తగ్గింది. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల నిజాయితీగా ఉండే వారికి ప్రజాజీవనంలో గౌరవం పెరిగింది. ఆర్థిక వ్యవస్థలో దావరికం లేకుండా చేసినందుకు ప్రభుత్వాన్ని అభినందించాల్సిందే.

### 2. జీఎస్టీ: ఒకే దేశం ఒకే పన్ను

పెద్దనోట్ల రద్దు తర్వాత ప్రత్యక్ష పన్నుల విధానంలో తీసుకున్న చరిత్రాత్మకమైన నిర్ణయం జీఎస్టీ అమలు చేయడమే. జీఎస్టీ అమలు వల్ల దేశంలో వ్యాపారం చేయడం సులభమై, వ్యాపార వర్గాల సమస్యలు తీరాయి. వ్యాపారం సరళతరం కావడంతో పాటు రోజువారీ వినియోగ వస్తువులపై పన్నుల భారం తగ్గింది. ఈ పన్నును అమలు చేసినప్పుడు తొలిదశలో ఎదురయ్యే ఇబ్బందులను ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిష్కరిస్తోంది. నిజమైన ఫెడరల్ స్ఫూర్తితో అన్ని రాష్ట్రాల విశ్వాసాన్ని చూరగొనడం చరిత్రాత్మకమైన విజయం. ప్రతి నెలా జరుగుతున్న జీఎస్టీ మండలి సమావేశాలలో ప్రజానుకూలమైన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఈ మహత్తర విజయం సాధించినందుకు బిజెపి జాతీయ కార్యవర్గం ప్రధానమంత్రిని, కేంద్ర ఆర్థిక మంత్రిని అభినందిస్తోంది.

### 3. తీవ్రవాదం, వేర్పాటువాదంపై కఠిన వైఖరి

నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం మొదటి నుంచీ తీవ్రవాదం, వేర్పాటువాదంపై కఠిన వైఖరి అనుసరిస్తోంది. ఈ విధానానికి అనుగుణంగా తీవ్రవాదులు, వారి మద్దతుదార్లపై ప్రభుత్వం ఇటీవల తీసుకున్న చర్యలు, సరిహద్దు పొడవునా తీవ్రవాదులకు వ్యతిరేకంగా తీసుకున్న చర్యలు దేశవాసులందరికీ తెలుసు. గత ఆరు నెలల కాలంలో అనేక మంది తీవ్రవాదులను అంతమొందించారు. దీంతో తీవ్రవాదుల నైతికస్థైర్యం దెబ్బతిన్నది. భద్రతాదళాలు ఈ వ్యవహారంలో అనుసరించిన పద్ధతి అభినందనీయమైంది. ప్రభుత్వం చేస్తున్న పనిని జమ్మూ-కశ్మీర్ ప్రజలు కూడా శ్లాఘించారు. జమ్మూ-కశ్మీర్‌లో వరద బాధితులకు సహాయ, పునరావాస కార్యక్రమాలకు, అభివృద్ధి కార్యకలాపాలకు ప్రధాని మోదీ ప్రాధాన్యం ఇచ్చారు. జమ్మూ-కశ్మీర్‌కు అందజేసిన రూ.80,000 కోట్ల అభివృద్ధి పాకేజీ, రెండు అఖిల భారత వైద్య సంస్థలు, ఐఐఎం, ఐఐటి, అయిదు వైద్య కళాశాలలు, ఒక ఇంజనీరింగ్ కళాశాల మంజూరు చేయడం వల్ల ఆ రాష్ట్రం అభివృద్ధి చెందడానికి దోహదం చేస్తుంది. ఈ పథకాలు జమ్మూ-కశ్మీర్ ప్రజల ఆత్మ స్థైర్యాన్ని పెంచడానికి తోడ్పడ్డాయి.

తీవ్రవాదాన్ని ఏ మాత్రం సహించక పోవడం, సామాన్య ప్రజల కడగండ్లను పట్టించుకోవడం ద్వారా కేంద్ర ప్రభుత్వం మంచి సమతూకం పాటించింది. తీవ్రవాదం వల్ల కలిగే



భూ ప్రపంచం మన మాతృభూమి – సమస్త మానవాళీ మన జాతి. – శ్రీ వీర సావర్కార్

ముప్పు గురించి అంతర్జాతీయ వేదికలపై ప్రధాన మంత్రి పదే పదే ప్రస్తావించడం వల్ల మంచి ఫలితం కనిపిస్తోంది. వేర్పాటువాదులకు సహాయ పడడానికి విదేశాల నుంచి డబ్బు అందకుండా చేయడం, హవాలా వ్యాపారులను కట్టడి చేయడం అభినందనీయం. ఈ ప్రభుత్వం తీవ్రవాదానికి వ్యతిరేకంగా కచ్చితమైన నిర్ణయాలు తీసుకుంటుందన్న నమ్మకం ప్రజలకు కలిగింది. అదే సమయంలో అభివృద్ధి సాధించడానికీ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది. అంతర్జాతీయ వేదికలపై తీవ్రవాద ముప్పును ఎత్తిచూపుతున్నందుకు, పాకిస్థాన్‌ను ఒంటరిని చేయడానికి, హిజ్బుల్ ముజాహిదీన్ ఆగడాలను ప్రపంచం దృష్టికి తీసుకువస్తున్నందుకు మోదీ నాయకత్వంలోని ప్రభుత్వాన్ని అభినందించాలి.



### 4.మహిళల గౌరవప్రద జీవితానికి అవకాశాలు

మహిళల అభ్యున్నతికి నిరంతరం పాటుపడుతున్నందుకు, వారు గౌరవప్రదమైన జీవితం గడపడానికి అవకాశాలు కల్పిస్తున్నందుకు బిజెపి జాతీయ కార్యవర్గం మోదీ ప్రభుత్వాన్ని అభినందిస్తోంది. బేటీ బచావో, బేటీ పఢావో, సుకన్య సమృద్ధి యోజన, ఉజ్వల యోజన వంటి పథకాలు నేరుగా మూడు కోట్ల మంది మహిళలకు ప్రయోజనం కలిగించాయి. దేశంలో పురుషుల, స్త్రీల జనాభాలో సమతూకం ఉండేటట్టు చూడడానికి మోదీ ప్రభుత్వం కృషి చేస్తోంది. మహిళలను చిన్నచూపు చూడకుండా బాలికలకు విద్య గరపడానికి ప్రభుత్వం చేస్తున్న పని అభినందనీయం. మహిళలు అనుకూలమైన వాతావరణంలో పనిచేసే అవకాశం కల్పించడానికి ఈ ప్రభుత్వం చట్టాలను సవరించింది. వారి భద్రత మెరుగుపడేట్టు చేసింది.

ముద్రా పథకం కూడా మహిళలకు బాగా ఉపకరించింది. మూడు సార్లు తలాక్ అని ముస్లిం మహిళలకు విడాకులు ఇచ్చే అంశంపై సుప్రీం కోర్టు ఎదుట ప్రభుత్వం పురోగామి వైఖరి అనుసరించినందుకు జాతీయ కార్యవర్గం అభినందిస్తోంది. మూడుసార్లు తలాక్ అని ముస్లిం మహిళలకు విడాకులు ఇచ్చే విధానం మహిళలకు అన్యాయం చేయడానికి ఉద్దేశించింది. ఇది రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులకు భంగం కలిగించేది. సమానత్వం రాజ్యాంగ మౌలిక స్వరూపం అని ప్రభుత్వం తేల్చి చెప్పింది. అందువల్ల దీన్ని ఉల్లంఘించకూడదని వాదించింది. ముస్లిం మహిళలతో సహా అన్ని వర్గాల మహిళలు ఈ నిర్ణయాన్ని మెచ్చుకున్నారు. మహిళలు గౌరవప్రదమైన జీవితం గడపడానికి ఉద్దేశించిన ఈ వైఖరి ఈ దేశంలోని కోట్లాది మహిళల తరఫున జాతీయ కార్యవర్గం ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలియజేస్తోంది.

### 5. రైతుల సంక్షేమానికి ప్రభుత్వ చర్యలు

అట్టడుగుస్థాయి వరకు రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడానికి కట్టుబడి ఉన్నామని ఈ ప్రభుత్వం కచ్చితమైన సందేశం పంపింది. సామాజిక ఆరోగ్య కార్డులు, పంటల బీమా వల్ల పంట దిగుబడి పెరిగి, వ్యవసాయరంగంలో అంతర్నిహితంగా ఉండే అనిశ్చిత పరిస్థితి తొలిగిపోయాయి. విపత్కర పరిస్థితి ఎదుర్కుంటున్న రైతులందరినీ ఆదుకునే బీమా కోసం చెల్లించవలసిన మొత్తాన్ని చాలా తక్కువగా నిర్ణయించారు. అనావృష్టి పీడిత ప్రాంతాల వారికి కూడా ఈ బీమా వర్తిస్తుంది. 2015లో ప్రారంభమైన ప్రధానమంత్రి సాగునీటి పథకం కోసం అయిదేళ్ల కాలంలో 50 కోట్ల రూపాయలు వెచ్చించనున్నారు. గ్రామీణ ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు కల్పించినందువల్ల రైతుల జీవితాలు మెరుగయ్యాయి. రైతుల ఆదాయం రెట్టింపు చేయడానికి నిబద్ధమై ఉన్నందుకు జాతీయ కార్యవర్గం కృతజ్ఞతలు తెలియజేస్తోంది.

### 6. జాతి నిర్మాణానికి యువజనాభివృద్ధి

స్వామీ వివేకానంద షికాగోలో ప్రసంగించి 125 ఏళ్లు అయిన సందర్భంగా ఈ ఏడాది యువజనులకు స్ఫూర్తి కలిగించాలని జాతీయ కార్యవర్గం భావిస్తోంది. జాతి నిర్మాణంలో యువజనులు భాగస్వాములు కావడానికి ప్రభుత్వం నూతన విద్యావిధానంపై సమగ్ర చర్చ ప్రారంభించడమే కాక స్వయం ఉపాధి కోసం అవకాశాలను కూడా అన్వేషిస్తోంది. జాతీయ నైపుణ్యాభివృద్ధి పథకం, పరిశ్రమలు నెలకొల్పడం, ప్రధానమంత్రి నైపుణ్యాభివృద్ధి పథకం మొదలైనవి యువజనుల సమగ్రాభివృద్ధి కోసం ప్రారంభించారు. ముద్ర పథకంతో పాటు, స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా వంటివి యువజనులకు రుణాలు ఇవ్వడానికి, 125 బ్యాంకు శాఖల ద్వారా ఉపాధి అవకాశాలు పెంపొందింప చేయడానికి ఉపకరిస్తున్నాయి. దీని వల్ల కనీసం ఒక ఎస్సీకి, ఒక ఎస్టీకి, ఒక మహిళకు పారిశ్రామికవేత్తలు కావడానికి ప్రయోజనం కలుగుతుంది. యువజనుల సమగ్రాభివృద్ధికి ఉపకరించే పథకాలు ప్రారంభించినందుకు జాతీయ కార్యవర్గం ప్రభుత్వాన్ని అభినందిస్తోంది.

### 7.శాంతియుతంగా డోక్లాం సమస్య పరిష్కారం

డోక్లాం ప్రతిష్టంభనను ప్రశాంతంగా పరిష్కరించినందుకు జాతీయ కార్యవర్గం ప్రభుత్వాన్ని అభినందిస్తోంది. ఈ సమస్య వల్ల భారత–చైనా దేశాల మధ్య ప్రతిష్టంభన ఏర్పడింది. ఈ సమస్యను పరిష్కరించడం ప్రభుత్వ పరిణిత వైఖరికి, దౌత్యపరమైన విజయానికి తార్కాణం. డోక్లాం ప్రతిష్టంభనను పరిష్కరించడంలో ప్రభుత్వం నైపుణ్యాన్ని, దృఢ వైఖరిని ప్రదర్శించడం వల్ల భారత భద్రతకు

## నూతన భారత్‌కు ఆరు ప్రతిజ్ఞలు

**పేదరికంలేని భారత్**

నవ భారత్ దీక్షలో భాగంగా 2022 నాటికి భారత్‌ను పేదరికం లేని దేశంగా మలచాలని దీక్షబూనాం. అప్పటివరకు అందరికీ ఇల్లు, తగిన ఆరోగ్య సదుపాయాలు, అందరికీ స్వయం ఉపాధికి అవకాశాలు సమకూరతాయి. "అంత్యోదయ" లక్ష్యాన్ని సాధించడానికి కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు ప్రారంభించింది.

**స్వచ్ఛ భారత్**

మంచి సమాజానికి, వికాసవంతమైన దేశానికి పరిశుభ్రత సంకేతం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వచ్ఛ భారత్ అభియాన్‌ను ఓ ప్రజోద్యమంగా మలిచారు. ఇది ప్రతి పౌరుడి నైతిక బాధ్యతగా చేశారు. పరిశుభ్రమైన సమాజం, స్వచ్ఛ భారత్ కోసం దీక్షబూనుతున్నాం.

**తీవ్రవాద రహిత భారత్**

తీవ్రవాదం మొత్తం ప్రపంచానికే ముప్పు. అన్ని స్థాయిల్లోనూ కేంద్ర ప్రభుత్వం తీవ్రవాదం విషయంలో కఠినంగా వ్యవహరిస్తోంది. నూతన భారత్ కార్యక్రమంలో భాగంగా భారత్‌ను తీవ్రవాద రహిత దేశంగా మలచాలని ప్రతిన బూనుతున్నాం.

**కులతత్వ రహిత భారత్**

నవ భారతంలో సామాజిక అసమానతలు లేకుండా చేయడం కోసం ప్రధాని మోదీ సామాజిక న్యాయం లక్ష్య సాధన కోసం కృషి చేస్తున్నారు. సమాజంలో సమానత్వం ఉంటే 2022 నాటికి మెరుగైన దేశాన్ని, పటిష్టమైన దేశాన్ని నిర్మించడం సాధ్యం అవుతుంది.

**మతతత్వ రహిత భారత్**

నవ భారత్ నిర్మాణం కోసం సమాజంలో మత సామరస్యం నెలకొల్పడానికి ప్రతినబూనుతున్నాం.

**అవినీతి రహిత భారత్**

అవినీతిని అంతమొందించడానికి ప్రధానమంత్రి వివిధ నూతన శకాన్ని నిర్మించే నిర్ణయాలు తీసుకున్నారు. 2022 నాటికి భారత్‌ను అవినీతి రహిత దేశంగా తయారు చేయడానికి ప్రతినబూనుతున్నాం.

నవ భారత్ నిర్మించడానికి "సంకల్పంతో సిద్ధి" కార్యక్రమం రూపొందించినందుకు ప్రధానిని అభినందిస్తోంది. ప్రధానమంత్రి మోదీతో చేతులు కలిపి నవ భారత్ నిర్మాణ లక్ష్యాన్ని సాధించడంలో సహకరించాలని బిజెపి జాతీయ కార్యవర్గం 125 కోట్ల మంది భారతీయులకు విజ్ఞప్తి చేస్తోంది.

మేలు కలగడమే కాక ప్రపంచంలో భారత ప్రతిష్ఠ పెరిగింది. డోక్లాం వివాదం కొనసాగి నప్పుడు ప్రభుత్వం నిరంతరం భూటాన్‌తో సంప్రదించి మిత్ర దేశాల ప్రయోజనాలను కాపాడడానికి ప్రయత్నించింది. పొరుగు దేశాలు ప్రధానం అన్న వైఖరి అనుసరించింది.

### 8. బ్రిక్స్‌లో పటిష్ట భారత్

ప్రపంచానికి ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కోవడానికి బ్రిక్స్ సమావేశంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రతిపాదించిన 10 అంశాల పథకం నిర్మాణాత్మకమైంది. అభివృద్ధి దిశగా ఇది మంచి ప్రతిపాదన అని యావత్ ప్రపంచం కొనియాడింది. చైనాలోని జియామెన్ లో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో చైనా అధినేత జింపింగ్‌తో మోదీ ఫలవంతమైన చర్చలు జరిపినందుకు జాతీయ కార్యవర్గం అభినందిస్తోంది. ప్రపంచ శాంతిని కాపాడడాని కి భారత-చైనా దేశాల మధ్య సత్సంబంధాలు అవసరమై కజకిస్థాన్‌లోని అస్తానాలో వ్యక్తం చేసిన అభిప్రాయాన్ని ఇద్దరు నాయకులు పునరుద్ఘాటించారు. మన ప్రభుత్వ విదేశాంగ విధానం సవ్యంగా ఉన్నందువల్లే 2017 బ్రిక్స్ శిఖరాగ్ర సభ ఆమోదించిన తీర్మానంలో తీవ్రవాదం ప్రముఖంగా ప్రస్తావనకు వచ్చింది. లష్కర్-ఎ-తయ్యిబా, జైషే మహమ్మద్, తాలిబాన్, హక్కానీ వంటి తీవ్రవాద సంస్థలు మన పొరుగున పాల్పడుతున్న తీవ్రవాద కార్యకలాపాలను బ్రిక్స్ చర్చల్లో ప్రస్తావించ గలిగాం.

### 9. దౌత్యంలో వివేకం

మానవీయ, వివేకవంతమైన వైఖరి అవలంబించడం వల్ల బిజెపి ప్రభుత్వం ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరచ గలిగింది. నేపాల్‌లో భూకంపం, మాల్దీవుల్లో నీటి సంక్షోభం, శ్రీలంకలో వరదలు, మైన్మార్‌లో స్వైన్ ఫ్లూ సందర్భంలో భారత్ పొరుగు దేశాలకు సహాయం చేయడానికి వెంటనే రంగంలోకి దిగింది. రొహింగ్యా శరణార్థుల అంశం ఎదురైనప్పుడు మన దేశ అంతర్గత భద్రతపై రాజీ పడకుండానే మానవతావాదంతో బంగ్లాదేశ్‌కు సహాయం అందించింది. యెమెన్‌లో చిక్కుకుపోయిన భారత పౌరులను రక్షించడానికి, పశ్చిమాసియా నుంచి కేరళ నర్సులను రప్పించడానికి, అఫ్ఘనిస్తాన్ నుంచి ఫాదర్ అలెక్స్ ప్రేం కుమార్, ఫాదర్ టాంను యెమెన్ నుంచి రప్పించడానికి, కాబూల్‌లో కోల్‌కతాకు చెందిన జుదిత్ డిసౌజాను ఆపదల నుంచి విడిపించడానికి భారత్ గణనీయమైన దౌత్య కౌశలం ప్రదర్శించింది.

### 10.మౌలిక సదుపాయాల అభివృద్ధిని పరిపుష్టం చేయడం

దేశంలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేసి పాత పథకాలను పూర్తి చేసినందుకు కేంద్ర ప్రభుత్వాన్ని జాతీయ కార్యవర్గం అభినందిస్తోంది. ఈ క్రమంలోనే నర్మదా నదిపై సర్దార్ సరోవర్ ఆనకట్ట పూర్తి అయింది. జపాన్‌తో కలిసి మనదేశంలో బుల్లెట్ ట్రైన్‌కు శ్రీకారం చుట్టినందుకు జాతీయ కార్యవర్గం ప్రధానమంత్రి మోదీని అభినందిస్తోంది.

### 11.రాజకీయ హింస ప్రజాస్వామ్యానికి శాపం

సిద్ధాంతం కోసం హింసకు పాల్పడడం, సంకుచిత స్వభావాన్ని అరికడతామని ప్రధాని మోదీ హామీ ఇచ్చినందుకు జాతీయ కార్యవర్గం అభినందిస్తోంది. త్రిపుర, కేరళ, పశ్చిమ బెంగాల్‌లో బిజెపి కార్యకర్తలపై కొనసాగుతున్న హింసాకాండ హృదయవిదారకంగా ఉండడమే కాక ప్రజాస్వామ్యభావనకే విఘాతం కలిగిస్తోంది. గత 14 నెలల కాలంలో కేరళలో 14 మంది మన కార్యకర్తలను కిరాతకంగా హత్య చేశారు. ప్రజాస్వామ్యదేశం భారత్‌లో పత్రికా రచయితలను హత్య చేయడాన్ని జాతీయ కార్యవర్గం తీవ్రంగా ఖండిస్తోంది.




### 12.వెనుకబడిన తరగతుల రాజ్యాంగ హక్కులపట్ల నిబద్ధత

సబ్‌కా సాథ్-సబ్‌కా వికాస్ లక్ష్యాన్ని సాధించడానికి బిజెపి ప్రభుత్వం కట్టుబడి ఉంది. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వారికి రాజ్యాంగ గుర్తింపు ఉండాలన్న డిమాండు చాలాకాలంగా ఉంది. ఈ అంశాన్ని ప్రధానమంత్రి మోదీ పట్టించుకుని ఓ.బి.సి. కమిషన్‌కు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించారు. దీనికి సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లు లోకసభ ఆమోదం పొందింది కాని కాంగ్రెస్ అడ్డుతగిలే విధానాలు అనుసరిస్తున్నందువల్ల రాజ్యసభలో ఆమోదం పొందలేదు. ఓ.బి.సి.కమిషన్‌కు రాజ్యాంగ భద్రత కల్పించడానికి బిజెపి నిబద్ధమై ఉంది. రాజ్యసభలో కాంగ్రెస్ ఓ.బి.సి. వ్యతిరేక వైఖరి అనుసరించాడాన్ని ఖండిస్తోంది.

### 13. పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ శత జయంతి సంవత్సరం

2016 సెప్టెంబర్ 25 నుంచి 2017 సెప్టెంబర్ 25 వరకు బిజెపి పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ శతజయంతి నిర్వహించింది. ఈ సంవత్సరాన్ని అణగారిన వర్గాల అభ్యున్నతి సంవత్సరంగా పాటించారు. దోపిడీకి గురి అవుతున్న, బలహీన వర్గాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేసి అణగారిన వర్గాల సంక్షేమం కోసం పాటుపడింది. దీన్‌దయాళ్ శత జయంతి సందర్భంగా వ్యవస్థాపరంగా పోలింగ్ కేంద్ర స్థాయి నుంచి పార్టీని పటిష్టం చేయడానికి బిజెపి అధ్యక్షుడు అమిత్ షా దేశవ్యాప్తంగా పర్యటించారు. బిజెపి సైద్ధాంతిక పునాదిని బలోపేతం చేయడానికి, పార్టీ కార్యకలాపాలు గుణాత్మకంగా విస్తరించడానికి ఈ యాత్ర ఉపకరించింది. పార్టీ పునాదిని పటిష్టం చేయడం కోసం అమిత్ షా బెంగాల్‌లోని నక్సల్‌బరి నుంచి విస్తారక్ యోజన ప్రారంభించారు. పార్టీ పునాదిని బలోపేతం చేయడానికి లడాఖ్ నుంచి లక్షద్వీప్ వరకు 4 లక్షల మంది స్వల్ప కాలిక విస్తారకులను పంపించడం, 4 వేల మంది దీర్ఘకాలిక విస్తారకులను వినియోగించడం గర్వకారణం. పోలింగ్ కేంద్ర స్థాయి నుంచి జనాలు బిజెపిలో చేరేట్టు ప్రోత్సహించడానికి ఈ విస్తారకులను నియమించారు. పోలింగ్ కేంద్ర స్థాయి కమిటీలను ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్ర స్థాయిలో 6 కార్యకలాపాలను శాశ్వత వ్యవహారంగా మార్చారు. ఈ కార్యక్రమం "సశక్త్ బిజెపి-సమర్థ బిజెపి" అన్న నినాదం వాస్తవం కావడానికి ఉపయోగపడుతుంది.

బిజెపి అధ్యక్షుడు దేశవ్యాప్తంగా పర్యటించినందువల్ల, పార్టీ కార్యాలయాల ఏర్పాటు, మేధావులతో సంప్రదింపులు, కీలక సంఘాల నిర్ణయాలు తీసుకునే విధానం, వివిధ బిజెపి ప్రభుత్వాలకు మార్గదర్శనం, మునుపటి జనసంఘ్‌కు చెందిన వారిని సత్కరిండం మొదలైనవి సాధ్యమయ్యాయి. ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు సైద్ధాంతిక శిక్షణ ఇవ్వడానికి, వారు నిర్వర్తించవలసిన బాధ్యతలు తెలియ జెప్పడానికి అమిత్ షా యాత్ర దోహదం చేసింది. ఈ యాత్ర సంస్థాగత నిర్మాణంలో, పార్టీని గుణాత్మకంగా బలోపేతం చేయడంలో ఒక మైలు రాయి.

### 14.నవ భారతం – సంకల్పంతో సిద్ధి

2022 నాటికి నవ భారత్ నిర్మించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దీక్షబూనారు. అప్పటికి భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి అవుతాయి. సంకల్పంతో సిద్ధి కార్యక్రమం దేశాన్ని 2022 నాటికి నూతన భారత్ అవతరించడానికి ఉపయోగపడుతుంది. దేశంలోని 125 కోట్ల మంది ప్రజలు ఈ దీక్షబట్టేలా చేస్తే నవ భారత్ అవతరణను ఎవరూ ఆపలేరు.

**–జనసందేశ్ ప్రతినిధి**

## అక్టోబర్ 21, 22న రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు

అక్టోబర్ 21, 22 తేదీలలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు కరీంనగర్‌లో నిర్వహించనున్నట్లు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మన్ వెల్లడించారు. ఈ నెల 21న జాతీయ సహ సంఘటనా ప్రధాన కార్యదర్శి సౌదాన్ సింగ్ హైదరాబాద్ రానున్నారని తెలిపారు. అక్టోబర్ 14, 15 తేదీలలో ఆదిలాబాద్, నిజామాబాద్ పార్లమెంట్ సమావేశాల్లో బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి వి.రాంమాధవ్ పాల్గొననున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమాలను ఉధృతం చేయనున్నట్లు వివరించారు. ఇందులో భాగంగా వచ్చే జనవరి లేదా ఫిబ్రవరిలో హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. లక్ష బైకులపై బిజెపి కార్యకర్తలు, నాయకులు ఈ సభకు వచ్చేలా ప్రణాళిక రూపొందిస్తామన్నారు.■

మనమాట

# నవ భారతానికి ఆర్థిక పునాదులు



**జయంత్ సిన్హా**
కేంద్ర పౌర విమానయాన సహాయ మంత్రి

భారత ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్ళపై ఇటీవల కాలంలో అనేక వ్యాసాలు వచ్చాయి. ఇవన్నీ కొన్ని అర్థ సత్యాల ఆధారంగా అసంబద్ధ నిర్ధారణలకు వచ్చి ఆర్థిక వ్యవస్థ స్వరూప స్వభావాలను సంపూర్ణంగా మార్చివేస్తున్న మౌలిక వ్యవస్థాగత సంస్కరణలను విస్మరించడం దురదృష్టకరం. అదీగాక ప్రస్తుతం అమలు జరుగుతున్న వ్యవస్థాగత సంస్కరణల దీర్ఘకాలిక ప్రభావాన్ని అంచనా వేయడానికి ఒకటి రెండు త్రైమాసికాల స్థూల జాతీయోత్పత్తి(జిడిపి) వృద్ధి రేటు, ఇతర స్థూల ఆర్థిక గణాంకాలు సరిపోవు. నవ భారత నిర్మానికి, కోట్ల మంది భారతీయులకు మంచి ఉద్యోగాలు సృష్టించడానికి ఈ వ్యవస్థాగత సంస్కరణలు అత్యంత అవసరం. ఈ సంస్కరణలు నిర్మిస్తున్న కొత్త ఆర్థిక వ్యవస్థ మరింత పారదర్శకంగా, సమర్థంగా ఉంటుంది. నవకల్పనలే దాన్ని నడిపిస్తాయి. అంతకంటే ముఖ్యంగా ఈ కొత్త వ్యవస్థ సమానత్వానికి, న్యాయానికి పెద్దపీట వేసి, దేశ ప్రజలందరికీ మెరుగైన జీవితాలను అందిస్తుంది.

వస్తు, సేవల పన్ను (జీఎస్టీ), పెద్ద నోట్ల రద్దు, డిజిటల్ చెల్లింపులు భారత ఆర్థిక వ్యవస్థలో అనధికార కార్యకలాపాలను తగ్గించే దిశలో తీసుకున్న కీలక చర్యలు. పన్నుల పరిధిలోకి రాకుండా, సమాంతర ఆర్థిక వ్యవస్థలో చోటుచేసుకుంటున్న కార్యకలాపాలను ఇప్పుడు ప్రధాన స్రవంతి ఆర్థిక వ్యవస్థ పరిధిలోకి తీసుకు వస్తున్నాం. దీర్ఘకాలంలో దీనివల్ల (ఎ) పన్ను వసూళ్లు పెరిగి ప్రభుత్వానికి మరిన్ని ఆర్థిక వనరులు అందుబాటులోకి వస్తాయి, (బి) ఆర్థిక వ్యవస్థలో వైరుధ్యాలు తగ్గి జిడిపి వృద్ధి రేటు పెరుగుతుంది, (సి) అన్ని లావాదేవీలు డిజిటైజ్ అవుతాయి గనుక పౌరుల ఆర్థిక పరపతి పెరుగుతుంది.

మంత్రిత్వ శాఖల్లో విధానాల రూపకల్పన అమల్లో ఉన్న విధివిధానాల ప్రకారమే జరుగుతుంది తప్ప ఎవరి ఇష్టాయిష్టాల ప్రకారం కాదు. ప్రకృతి వనరులు, లైసెన్సులు, ఉదాహరణకు బొగ్గు, టెలికాం స్పెక్ట్రం, ఉడాన్ రూట్లు.. ఇవన్నీ పూర్తిగా పారదర్శకమైన వేలం పద్ధతిలోనే కేటాయింపులు జరుగుతున్నాయి. కొత్తగా తెచ్చిన దివాలా స్మృతి (నిబంధనావళి) అప్పుల్లో ఉన్న సంస్థల ఆస్తులను వేలం వేసి మొండి బాకీలకు జమ చేయడానికి బ్యాంకులకు వీలు కల్పిస్తుంది. సవరించిన, నిబంధనల ఆధారిత ప్రత్యక్ష విదేశీ పెట్టుబడుల (ఎఫ్‌డిఐ) విధానం విదేశీ పెట్టుబడిదారుల్లో నమ్మకాన్ని పెంచింది. ఫలితంగా 2014 లో 3600 కోట్ల డాలర్లుగా ఉన్న విదేశీ పెట్టుబడులు 2017

> **జన్‌ధన్-ఆధార్-మొబైల్ (జామ్) పథకాల లబ్ధిదారులకు నేరుగా నగదు జమ చేసే విధానాన్ని సరళం చేసి వృథావ్యయాలను అరికడుతోంది. గత మూడేళ్ళలో లక్షా 75 వేల కోట్ల రూపాయల సబ్సిడీ డబ్బు నేరుగా లబ్ధిదారులకు నగదు రూపంలో బదిలీ అయ్యింది. 'జామ్' పుణ్యమాని బినామీ లబ్ధిదారులు, నకిలీలు, దళారుల బెడద పోయింది. మౌలిక సదుపాయాల భారీ విస్తరణ ఆర్థిక వ్యవస్థ అంతటా వ్యయాలను తగ్గిస్తోంది.**

ఆర్థిక సంవత్సరానికి 6,000 కోట్ల డాలర్లకు పెరిగాయి. విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహక మండలిని రద్దు చేయడం వల్ల ఆర్థిక వ్యవస్థ మరింత పారదర్శకమవుతుంది.

జన్‌ధన్-ఆధార్-మొబైల్ (జామ్) పథకాల లబ్ధిదారులకు నేరుగా నగదు జమ చేసే విధానాన్ని సరళం చేసి వృథావ్యయాలను అరికడుతోంది. గత మూడేళ్ళలో లక్షా 75 వేల కోట్ల రూపాయల సబ్సిడీ డబ్బు నేరుగా లబ్ధిదారులకు నగదు రూపంలో బదిలీ అయ్యింది. 'జామ్' పుణ్యమాని బినామీ లబ్ధిదారులు, నకిలీలు, దళారుల బెడద పోయింది. మౌలిక సదుపాయాల భారీ విస్తరణ ఆర్థిక వ్యవస్థ అంతటా వ్యయాలను తగ్గిస్తోంది. రైల్వేలు, గ్రామీణ విద్యుదీకరణ, జాతీయ రహదారులు, గ్రామీణ రహదారులు గృహనిర్మాణం, విమానయాన రంగాల్లో పెద్దఎత్తున విస్తరణ చోటుచేసుకుంటోంది. ఇతర దీర్ఘకాలిక అంతర్జాతీయ పెట్టుబడి సంస్థలతో కలిసి ప్రపంచస్థాయి వాణిజ్య మౌలిక సదుపాయాల కల్పనకు ఆర్థిక అండదండలు అందించేందుకు ప్రభుత్వం జాతీయ మదుపు, మౌలిక సదుపాయాల నిధిని ఏర్పాటు చేసింది. తక్కువ వ్యయాలతో కూడిన ఆర్థిక వ్యవస్థ ఉత్పత్తిని, వృద్ధి రేటును పెంచుతుంది.

భారత్ 2018లో నూటికి నూరుశాతం విద్యుదీకరణ లక్ష్యాన్ని సాధించబోతోంది. విద్యుత్ సదుపాయం కల్పించాల్సిన గ్రామాల సంఖ్య 2014లో 18,452 నుంచి 2017 నాటికి 4,941కి తగ్గిపోయింది. గ్రామీణ రహదారుల నిర్మాణం రోజుకు 133 కిలోమీటర్ల చొప్పున సాగుతోంది. 2014లో ఇది రోజుకు 69 కిమీ మాత్రమే. అలాగే పేద, మధ్యతరగతి వర్గాలకు ఆర్థికంగా అందుబాటులో ఉండే గృహాల నిర్మాణం ఊపందుకుంది. 2004-14 మధ్య 13 కోట్ల గృహాలను మంజూరు చేయగా ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ మూడేళ్ళ కాలంలోనే 17.7 కోట్ల ఇళ్ళను మంజూరు చేసింది.

విమానయాన సౌకర్యాలు గణనీయంగా అభివృద్ధి చెందాయి: 2014 ఆర్థిక సంవత్సరంలో పది కోట్ల మంది విమానాల్లో ప్రయాణించగా 2017లో 16 కోట్ల మంది విమాన ప్రయాణం చేశారు. దూర ప్రాంతాలకు విమాన ప్రయాణ ఖర్చులు భారీగా తగ్గడమే దీనికి కారణం. సగటున కిలోమీటరుకు విమాన ప్రయాణ ఖర్చు రూ.5కు చేరుకుంది, అంటే ఆటోరిక్షా చార్జీ కంటే తక్కువన్న మాట.

వృద్ధిరేటును నిలబెట్టుకోవాలంటే భారత్ నవకల్పనల కేంద్రంగా, ప్రపంచంలోని పారిశ్రామిక శక్తులలో ఒకటిగా మారాలి. 2000 దశకంలో ఐటీ, బీపీఓ, టెలికాం, బీమా రంగాల మాదిరిగా పూర్తిగా సరికొత్త రంగాల ద్వారానే పెద్ద సంఖ్యలో ఉద్యోగాల కల్పన,



ప్రభుత్వం ఏ పార్టీదైనా ప్రజల సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించాలి. - దీన్‌దయాళ్జీ

వేగవంతమైన వృద్ధిరేట్లు సాధ్యమని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. నవలక్పనలు, సూక్ష్మస్థాయి పారిశ్రామికతత్వం, స్టార్టప్‌లకు ప్రాధ్యాన్యం ఇస్తూ మౌలిక సంస్కరణలకు ఎన్‌డిఏ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వెయ్యికి పైగా బడులలో వ్యాపారతత్వాన్ని పెంపొందించే ప్రయోగ శాలలను ఏర్పాటు చేయడం, కొత్త ఇంక్యుబేషన్ సెంటర్లకు వీలు కల్పించడం, ఇప్పటికే ఉన్నవాటి స్థాయిని పెంచడం ద్వారా అటల్ ఇన్నోవేషన్ మిషన్ (అటల్ నవలకల్పన కార్యక్రమం) దేశంలో వ్యాపార సంస్కృతిని సృష్టిస్తోంది. నవకల్పనలను ప్రోత్సహించేందుకు ప్రతి అటల్ ఇన్నోవేషన్ సెంటర్‌కు రూ. 10 కోట్ల చొప్పున ప్రభుత్వం గ్రాంటు ఇస్తోంది. ముద్ర కార్యక్రమం, ఇండియా యాస్పిరేషన్ ఫండ్‌లు స్టార్టప్‌లు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా వ్యాపార సంస్థల్లోకి వేల కోట్ల రూపాయల పెట్టుబడులను ప్రవహింపజేసి కోట్ల మందికి ఉద్యోగావకాశాలు సృష్టిస్తాయి.

పునరుత్పాదక ఇంధన వనరులు, విద్యుత్ వాహనాలు, ఆర్థిక సేవల వంటి అనేక కొత్త టెక్నాలజీల అభివృద్ధిలోను, వాటిలో కొత్త ప్రమాణాలను సాధించడంలోనూ భారత్ మొదటిస్థానంలో నిలుస్తోంది. వైమానిక రంగానికి సంబంధించి ప్రపంచ స్థాయి డ్రోన్ విధానాన్ని భారత్ రూపొందించింది. ఐఐటి క్యాంపస్‌లలో స్టార్టప్ ఇండియా కార్యక్రమం సాధించిన విజయాలు కళ్ళకు కడుతున్నాయి. విద్యార్థుల హాస్టల్ గదుల చిరునామాలతో ఇప్పటికే 400కు పైగా స్టార్టప్‌లు ప్రారంభమయ్యాయి. దివాళా స్మృతి,


**నరేంద్ర మోదీ ప్రభుత్వం 2014 నుంచి ప్రవేశపెట్టిన వ్యవస్థాగత సంస్కరణలు మూడో తరం సంస్కరణలు. 1991లో ప్రారంభించినవి మొదటితరం సంస్కరణలు కాగా 1999-2004 వరకు అటల్ బిహారి వాజపేయి ప్రభుత్వం అమలు చేసినవి రెండోతరం సంస్కరణలు. ఈ మూడో విడత సంస్కరణలు భారతీయులందరికీ సుఖమయమైన జీవితాన్ని అందించవలసిన ఆవశ్యకత, 21వ శతాబ్దపు అధునాతన ఆర్థిక వ్యవస్థ అవసరాల మధ్య సమతూకాన్ని సాధిస్తున్నాయి.**


ప్రత్యామ్నాయ ఆస్తుల పరిశ్రమల మేలు కలయిక కారణంగా ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడులు అనుత్పాదక, గిట్టుబాటుకాని పరిశ్రమల నుంచి కొత్త, వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాలకు మళ్ళుతోంది.

ఒక్క మాటలో చెప్పాలంటే నరేంద్ర మోదీ ప్రభుత్వం 2014 నుంచి ప్రవేశపెట్టిన వ్యవస్థాగత సంస్కరణలు మూడో తరం సంస్కరణలు. 1991లో ప్రారంభించినవి మొదటితరం సంస్కరణలు కాగా 1999-2004 వరకు అటల్ బిహారి వాజపేయి ప్రభుత్వం అమలు చేసినవి రెండోతరం సంస్కరణలు. మొదటి రెండు విడతల సంస్కరణలకు భిన్నంగా ఈ మూడో విడత సంస్కరణలు భారతీయులందరికీ సుఖమయమైన జీవితాన్ని అందించవలసిన ఆవశ్యకత, 21వ శతాబ్దపు అధునాతన ఆర్థిక వ్యవస్థ అవసరాల మధ్య సమతూకాన్ని సాధిస్తున్నాయి.

ఈనాడు దాదాపు ప్రతి భారతీయుడికీ ఆహారం, విద్యుత్, పని, ఇల్లు, బ్యాంకు ఖాతా, మరుగుదొడ్లు, వంటగ్యాసు, బీమా సదుపాయం, సూక్ష్మ రుణాలు, అన్నికాలాల్లో ఉపయోగపడే రోడ్డు వంటి కనీస సౌకర్యాలతో కూడిన సామాజిక భద్రత లభిస్తుంది. మరోవైపు, చిన్న, పెద్ద వ్యాపార సంస్థలు పారదర్శకమైన, నిబంధనల ఆధారిత వాతావరణంలో వర్ధిల్లడానికి అనువైన పరిస్థితులు నెలకొన్నాయి. వాటికి అవసరమైన సౌకర్యాలు, ఆర్థిక అండదండలు సమకూరుతున్నాయి. 'నవ భారతం'లో దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధికి, ఉద్యోగాల కల్పనకు దోహదం చేసే ఒక బలమైన కొత్త ఆర్థిక వ్యవస్థను నిర్మిస్తున్నాం. ■



సింగరేణి కార్మిక సంఘం ఎన్నికల్లో భారతీయ మజ్దూర్ సంఘ్‌కు మద్దతుగా ప్రచారం చేసిన బిజెపి శాసనసభా పక్షనేత జి.కిషన్ రెడ్డి



సింగరేణి కార్మిక సంఘం ఎన్నికల్లో భారతీయ మజ్దూర్ సంఘ్‌కు మద్దతుగా ప్రచారం చేసిన బిజెపి శాసనమండలి పక్షనేత ఎన్.రాంచందర్ రావు

సిద్ధాంతాల పట్ల నమ్మకం ఎంత అవసరమో, వాటిని ఆచరణలో పెట్టడంలో క్రమశిక్షణ అంతే అవసరం. - దీన్‌దయాళ్జీ

# విమర్శలు అర్థరహితం.. ఆర్థికరంగం పురోగమిస్తూనే ఉంది




పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ వల్ల జీడీపీ వృద్ధి రేటు తగ్గిపోయిందంటూ వస్తున్న విమర్శలను ప్రధాని నరేంద్ర మోదీ కొట్టిపారేశారు. తమ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాలను విమర్శిస్తున్న వారిపై గణాంకాల సాక్షిగా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రస్తుత లాభాల కోసం దేశ భవిష్యత్తును తానెన్నడూ పణంగా పెట్టబోనని.. ఆర్థిక సంస్కరణలను కొనసాగించి తీరుతామని తేల్చిచెప్పారు. జీడీపీ వృద్ధి రేటు తగ్గడం దేశంలో ఇదే మొదటిసారి కాదని.. యూపీఏ ప్రభుత్వ హయాంలో ఆరేళ్ల వ్యవధిలో 8 సార్లు జీడీపీ 5.7 శాతం కంటే తక్కువకు చేరిందని గుర్తుచేశారు. భారత ఆర్థిక రంగం నిలకడగా పురోగమిస్తూనే ఉందంటూ విపక్షాల విమర్శల్ని తిప్పికొట్టారు.


అక్టోబర్ 4న ఢిల్లీలో 'భారత కంపెనీ సెక్రటరీల సంస్థ' (ఐసిఎస్ఐ) స్వర్ణోత్సవాలను ఉద్దేశించి దాదాపు గంటసేపు మోదీ ప్రసంగించారు. గత యూపీఏ ప్రభుత్వంతో పోలిస్తే ఎన్డీఏ ఏ విధంగా భిన్నమైనదో విడమరిచి చెప్పారు. తమ ప్రభుత్వం సంస్కరణల్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) పరంగా గత రెండు త్రైమాసికాల్లో నెలకొన్న మందగమన పరిస్థితుల్ని మార్చే నిర్ణయం తీసుకోవడానికి సంకోచించేది లేదనీ, ప్రభుత్వానికి ఆ సత్తా ఉందనీ చెప్పారు. కీలక నిర్ణయాలు తీసుకునేందుకు ప్రభుత్వం సన్నద్ధతతో ఉందని తెలిపారు. ప్రభుత్వం తీసుకోబోయే నిర్ణయాలు భారతదేశాన్ని సరికొత్త ప్రగతి పథంలో దూసుకుపోయేలా చేస్తాయన్నారు.


'ఒకానొక సమయంలో ఆర్థికంగా అత్యంత సున్నితమైన అయిదు దేశాల్లో భారత్ ఒకటిగా పరిగణించేవారు. బిజెపి ప్రభుత్వం వచ్చాక దేశాన్ని ఆ పరిస్థితి నుంచి బయటకు తీసుకువచ్చింది. మా మూడేళ్ల పాలన కాలంలో ఎక్కువ సమయం మన దేశం ఆర్థికంగా వేగవంతమైన వృద్ధితో పరుగుపెట్టేలా చేయగలిగాం. వృద్ధి నెమ్మదించిందన్న విషయం ప్రభుత్వానికి తెలుసు. అందుకే దానిని మెరుగుపరిచే చర్యలు తీసుకుంటున్నాం' అని మోదీ చెప్పారు. ఆర్థిక విషయాల్లో విమర్శల్ని తాము స్వీకరిస్తామనీ, అవసరమైన చోట్ల తగిన సవరణల్ని చేస్తామనీ తెలిపారు. 'మాది సున్నితత్వం ఉన్న ప్రభుత్వం. బలమైన విమర్శల్ని స్వీకరిస్తాం. వాటిని సవినయంగా పరిగణనలో తీసుకుంటాం. అధిక వృద్ధిపై 125 కోట్ల మంది ప్రజల్లోనూ ఆశలున్నాయి' అని చెప్పారు. రిజర్వ్ బ్యాంకును ఉటంకిస్తూ, ఆర్థిక సంవత్సర చివరి త్రైమాసికంలో వృద్ధి రేటు 7.7 శాతం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

### జూన్ 2017 తర్వాత నమోదైన వృద్ధి

| | | |
|---|---|---|
| కార్ల అమ్మకాలు 12% | వాణిజ్య వాహనాల అమ్మకాలు 23% | ద్విచక్ర వాహనాల అమ్మకాలు 14% |
| స్వదేశీ విమానయానంలో వృద్ధి 14% | విదేశీ సరకు రవాణాలో వృద్ధి 16% | టెలిఫోన్ వినియోగదారులు 14% |




వస్తు–సేవల పన్ను (జీఎస్టీ) అమల్లోకి వచ్చాక ఎదురవుతున్న అవరోధాల్ని, చిన్నవ్యాపారులు ఎదుర్కొంటున్న సాంకేతిక ఇబ్బందుల్ని గుర్తించాల్సిందిగా సంబంధిత పాలక మండలిని కోరినట్లు ప్రధాని తెలిపారు. చిన్నవ్యాపారులకు సాయపడేరీతిలో సవరణలు చేయడానికి ప్రభుత్వం సిద్ధమేనని ప్రకటించారు. ఆర్థిక ప్రధాన స్రవంతిలో వచ్చి చేరేవారి రికార్డుల్ని ప్రభుత్వం తిరగతోడదనీ, నిజాయితీ ఉన్నవారిని రక్షిస్తుందనీ హామీ ఇచ్చారు. కంపెనీ సెక్రటరీలు కూడా తమ కక్షిదారులు నిజాయితీతో పన్నులు చెల్లించేలా ప్రోత్సహించాలని సూచించారు. భవిష్యనిధి చందాదారుల సంఖ్య 2014 చివరి నాటికి 3.26 కోట్లు ఉంటే ఇప్పుడు 4.80 కోట్లకు చేరిందనీ, ఉద్యోగ సృష్టి లేనిదే ఇది సాధ్యమయ్యేది కాదని చెప్పారు. గత మూడేళ్లలో 21 రంగాల్లో 87 సంస్కరణల్ని తీసుకువచ్చి, విధానపరమైన నిష్క్రియాపరత్వం నుంచి దేశాన్ని బయట పడవేయగలిగినట్లు రుజువు చేసుకున్నామన్నారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ అమలు వంటి సాహసోపేత నిర్ణయాలను తీసుకునే ధైర్యం తమ ప్రభుత్వానికి ఉందనీ, గత ప్రభుత్వానికి అది కొరవడిందనీ చెప్పారు.

## సంస్కరణలు ముఖ్యం

పొగడ్తల కోసం తాయిలాలు ఇవ్వడానికి కాకుండా సంస్థాగతమైన సంస్కరణలపై ప్రభుత్వం దృష్టి సారిస్తుందని ప్రధాని చెప్పారు. ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక కష్టాలు గత ప్రభుత్వం అనుసరించిన లోపభూయిష్ట విధానాల ఫలితమేనన్నారు. "గత రెండు త్రైమాసికాల్లోని మందగమనం గురించి విమర్శకులు మాట్లాడతారే గానీ యూపీఏ హయాంలోని 10 శాతం ద్రవ్యోల్బణం బిజెపి ప్రభుత్వం వచ్చాక 2.5 శాతానికి తగ్గిన విషయాన్ని పట్టించుకోరు. కరెంటు ఖాతా లోటును 4 శాతం నుంచి ఒక శాతానికి, విత్తలోటును 4.5 శాతం నుంచి 3.5 శాతానికి తగ్గించిన తీరును వారు విస్మరిస్తున్నారు. గత ప్రభుత్వం హయాంలో జీడీపీ వృద్ధిరేటు 5.7 శాతమో, అంతకంటే తక్కువే ఉండేది. ఎనిమిది సార్లు అలాగే జరిగింది. ఈ ఏడాది ఏప్రిల్–జూన్ మధ్య ఇదే వృద్ధిరేటు 5.7 శాతం ఉండడంతో నిరాశావాదులు దానిని ప్రళయ కాలంగా చిత్రీకరిస్తున్నారు.' అని ప్రధాని వివరించారు. నిజానికి ఆ సమయంలో అంత తగ్గిపోవడం ఆర్థిక వ్యవస్థకు ఇప్పటికన్నా చాలా ప్రమాదకరం. ఎందుకంటే.. అప్పట్లో దేశం అధిక ద్రవ్యోల్బణం, అధిక కరెంటు ఖాతా లోటు, ఆర్థిక లోటుతో సతమత మవుతుండేది.

–జనసందేశ్ ప్రతినిధి

ఏకాత్మత

# విశ్వమంతా ఒక శక్తి స్వరూపమే!

• శివరాం

ఆనందం, ఐశ్వర్యం పొందడానికి పాశ్చాత్య సిద్ధాంతాలు మనకు యథాతథంగా ఉపకరించకపోయినా మానవ విజ్ఞానం ఉమ్మడి ఆస్తి అని తెలుసుకోవాలి.

### మానవ విజ్ఞానం ఉమ్మడిసొత్తు

అలాగే ఎక్కడెక్కడో ఉద్భవించిన ఆలోచనలు, సిద్ధాంతాలు స్థల కాలాలను బట్టి తప్పనిసరిగా అన్నీ స్థానికం కానక్కర్లేదని కూడా గ్రహించాలి. ఒక నిర్ణీత స్థల, కాల, సామాజిక వాతావరణంలో మానవుల ప్రతిస్పందన అలాంటివే అయిన అనేక ఇతర స్థలాల్లో, ఇతర కాలాల్లో ఎక్కడో ఉన్న ఇతర మానవులకు ఉపకరించవచ్చు. కనుక ఇతర సమాజాల్లోని గత, వర్తమాన అభివృద్ధిని ఏక మొత్తంగా ఉపేక్షించడం అవివేకం. ఈ అభివృద్ధిలో నిజాలను ఎంచుకోవాలి, ఆమోదించక్కర్లేదు. తక్కిన వాటిని పూర్తిగా త్రోసిపుచ్చాలి.

ఇతర సమాజాల జ్ఞానాన్ని గ్రహించే సమయంలో వారి పొరపాట్లు, వికృతులను పరిహరించడం మంచిది. వారి జ్ఞానాన్ని కూడా మన ప్రత్యేక పరిస్థితులకు తగినట్లు అన్వయించుకోవాలి. క్లుప్తంగా చెప్పాలంటే శాశ్వత సత్యాలు, విలువలకు సంబంధించినంత వరకు సమస్త మానవాళికి చెందిన లాభాలను, జ్ఞానాన్ని మనం స్వీకరించాలి. వీటిల్లో ఇతర సమాజాల నుండి ఎంచుకున్న వాటిని మన పరిస్థితులకు తగినట్లుగాను, మూలతః మన మధ్యే ఉద్భవించిన వాటిని మారిన కాలమాన పరిస్థితులకు తగినట్లు వివరించుకుని అమలు చేసుకోవాలి.

### విరుద్ధ ఆలోచనలు

జాతీయవాదం, ప్రజాస్వామ్యం, సామ్యవాదం లేదా సమానత్వములను ఆదర్శాలుగా పాశ్చాత్య రాజకీయం ఆమోదించింది. ప్రపంచ ఐక్యత కోసం అప్పుడప్పుడూ చేసిన ప్రయత్నాలు నానాజాతి సమితి, రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఐక్య రాజ్యసమితిగా రూపుదాల్చాయి. వివిధ కారణాల వల్ల అవి సఫలం కాకపోయినా ఆ దిశగా ప్రయత్నాలు జరిగాయి. ఆచరణలో ఇవన్నీ అసమగ్ర సిద్ధాంతాలనీ పరస్పర వ్యతిరేకమనీ రుజువైంది. జాతీయవాదం దేశాల మధ్య విభేదాలకు, అటుపైన ప్రపంచ విభేదాలకు దారితీసింది. పోనీ ప్రపంచ శాంతి



కోసం యథాతథ స్థితిని కొనసాగించాలని చూస్తే స్వతంత్రంత్రంగా ఉండే అనేక చిన్నదేశాల ఆకాంక్షలను ఎప్పటికీ పూర్తి కానివ్వరు. ప్రపంచ ఐక్యత జాతీయవాదం ఒక దానితో మరొకటి విభేదిస్తాయి. ప్రపంచ ఐక్యత కోసం జాతీయ వాదాన్ని అణచి వేయాలని కొందరు అంటే ప్రపంచ ఐక్యత ఒక ఊహా స్వప్నం అని, జాతీయతకే అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కొందరు అంటారు. ఇలాంటి చిక్కే సామ్యవాద, ప్రజాస్వామ్యం విషయంలో కూడా వస్తుంది. ప్రజాస్వామ్యం వ్యక్తికి స్వేచ్ఛనిస్తుంది కాని పెట్టుబడిదారి విధాన దోపిడికి, ఏకచ్ఛత్రాధిపత్యానికి అదే ఉపకరిస్తుంది. దోపిడి అంతానికి వచ్చిన సామ్యవాదం వ్యక్తిస్వేచ్ఛను, గౌరవాన్ని హరించింది. మానవ జాతి గందరగోళమై భవిష్యత్ పురోగమనానికి సరైన దారేదో నిర్ణయించ లేకున్నది. 'ఇదొక్కటి మినహా మరేదీ సరైన దారి కాదు' అని విశ్వాసంతో చెప్పలేని స్థితిలో పశ్చిమం స్వయంగా దేవులాడు కొంటున్నది. అందువల్ల కేవలం వారిని అనుసరించడం ఒక అంధుడు మరో అంధుడిని అనుసరించినట్లే! ఈ సమయంలో మనం భారతీయ సంస్కృతి వైపు దృష్టి సారించాలి. ప్రపంచానికి మన సంస్కృతి దిశానిర్దేశనం చేయగలదేమో చూడాలి. జాతీయ దృష్టికోణంలో మన స్వభావమే అది కనుక మనం మన సంస్కృతిని పరిగణనలోకి తీసుకోవాల్సిందే. స్వాతంత్ర్యం ప్రాథమికంగా సంస్కృతి సంబంధి. స్వాతంత్ర్యానికి సంస్కృతి పునాది కానట్లయితే రాజకీయ స్వాతంత్ర్య సమరం కొద్దిమంది స్వార్థపరుల, అధికార విపాశువుల పెనుగులాటగా దిగజారుతుంది. మన సంస్కృతి వ్యక్తీకరణకు ఉపకరణం కాగలిగి నప్పుడే స్వాతంత్ర్యం అర్థవంతం అవుతుంది. అలాంటి వ్యక్తీకరణ మన పురోగతికి తోడ్పడటమే కాక అందుకు జరిపే కృషి మనకు ఆనందాన్నిస్తుంది. కనుక జాతీయ, మానవీయ దృష్టికోణాల్లోంచి ఎటు చూసినా భారతీయ సంస్కృతి, విలువల గురించి ఆలోచించడం మనకు తప్పనిసరి. దాని సాయంతో వివిధ పాశ్చాత్య రాజకీయ ఆలోచనల ఆదర్శాలను సరిచూడ గలిగితే అది మనకు అదనపు సౌలభ్యం కాగలదు. ఈ పాశ్చాత్య విలువలు మానవ ఆలోచనా విప్లవం, సామాజిక విభేదాల నుండి ఉత్పన్న మైనవి. మానవ జాతి ఆకాంక్షలకు ప్రతి రూపాలైన వాటిని ఉపేక్షించడం సరి కాదు.

### భారతీయ సంస్కృతి సమగ్రమైనది

జీవితాన్ని సంపూర్ణంగా, సమగ్రంగా దర్శించడమే భారతీయ సంస్కృతి ప్రథమ లక్షణం. దానిది సమగ్ర దృష్టి. విడిభాగాలుగా ఆలోచించడం ప్రత్యేక నిపుణులకు తగునేమో కాని వాస్తవ ఆచరణాత్మక దృష్టికోణంలో అది సరి కాదు. జీవితాన్ని ముక్కలు ముక్కలుగా ఆలోచించి, ఆ తరువాత దాన్ని అతికి ఒకటి చేయాలని ప్రయత్నించే వైఖరే పాశ్చాత్యుల గందరగోళానికి కారణం. జీవితంలో వివిధత, బహుళతలను మనం ఆమోదిస్తాం. కాని, వాటి వెనుక గల ఐక్యతను తెలుసుకోడానికి సదా ప్రయత్నించాం. మన ఈ ప్రయత్నం పూర్తిగా శాస్త్రీయం. విశ్వంలో పైకి సక్రమంగా కనిపించని వాటిల్లోని క్రమాన్ని కనుక్కోడానికి శాస్త్రవేత్తలు ఎల్లప్పుడూ ప్రయత్నిస్తుంటారు. అలా విశ్వాన్ని నడిపిస్తున్న సూత్రాలను తెలుసుకుని వాటి ఆధారంగా ఆచరణీయ నియమాలను రూపొందిస్తారు. ఈ భౌతిక ప్రపంచమంతా కొన్ని మూలకాలమయమని రసాయన శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. భౌతిక శాస్త్రజ్ఞులు మరో అడుగు ముందుకు వెళ్ళి ఈ మూలకాలు సైతం శక్తిమయమే అని చూపించారు. విశ్వం అంతా ఒక శక్తి స్వరూపమే అని మనం ఇవాళ తెలుసుకున్నాం!■



జీవితమనే యుద్ధరంగంలో ధైర్యంగా పోరాడే సైనికుని శక్తి, స్ఫూర్తి మనకిప్పుడు కావాలి. - స్వామి వివేకానంద



గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న మూసాపేటలో మహాత్ముడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన మేడ్చల్ జిల్లా బిజెపి అధ్యక్షుడు మాధవరం కాంతారావు తదితరులు



అక్టోబర్ 2న హైదరాబాద్ అత్తాపూర్ డివిజన్‌లో గాంధీ జయంతి వేడుకలు



గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మోగిలిపాలెం గ్రామంలో గ్రామ పంచాయితీ పారిశుద్ధ్య కార్మికులను బీజేవైఎం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తమ్మిషెట్టి మల్లయ్య, ఎల్కాపెల్లి సంపత్, ఎర్రోజు లక్ష్మణ్, పాశం రాఘవ రెడ్డి, సుగుర్తి జగదీశ్వర్ చారి, మార్క హరిష, రాజు, కొయ్యడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బిజెపి రాష్ట్ర కార్యాలయంలో అక్టోబర్ 5న వాల్మీకీ సమాజ్ సెల్ ఆధ్వర్యంలో వాల్మీకీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో జాతీయ కార్యవర్గ సభ్యుడు నాగం జనార్ధన్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతా సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.



దీన్‌దయాళ్ ఉపాధ్యాయ 101వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించిన బిజెపి మేడ్చల్ జిల్లా నేతలు



సింగరేణి కార్మిక సంఘం ఎన్నికల్లో భారతీయ మజ్దూర్ సంఘ్‌కు మద్దతుగా ప్రచారం చేసిన బిజెపి పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కాశిపేట లింగయ్య.




మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షురాలు పద్మజా రెడ్డి ఆధ్వర్యంలో దీన్‌దయాళ్ 101వ జయంతి వేడుకలు



వరంగల్ అర్బన్ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ ఆధ్వర్యంలో దీన్‌దయాళ్ 101వ జయంతి వేడుకలు

సంస్మరణ




# పేదలకు విద్యుత్ 'సౌభాగ్య'ం

బీజెపి సిద్ధాంతకర్త దీన్‌దయాళ్ ఉపాధ్యాయ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని సెప్టెంబర్ 25న పేదలకు ఉచిత విద్యుత్తు కనెక్షన్లు అందించేందుకు ఉద్దేశించిన 'సౌభాగ్య' (ప్రధాన మంత్రి సహజ్ బిజలీ హర్ ఘర్ యోజన) పథకాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ఆవిష్కరించారు. ఈ పథకం ద్వారా 15 నెలల్లోగా (2018 డిసెంబరు నాటికి) 4 కోట్ల కుటుంబాలకు విద్యుత్తు కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే అయిదు కోట్ల కుటుంబాలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు ఇస్తున్న ప్రభుత్వం 'ప్రధాన మంత్రి సహజ్ బిజలీ హర్ ఘర్ యోజన' (సౌభాగ్య) పేరుతో కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందుకోసం రూ.16,320 కోట్లు కేటాయించింది. మొత్తం 4 కోట్ల కుటుంబాలకు ఈ 'సౌభాగ్యం' కలగనుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పేదలకు కూడా ఈ సౌకర్యం వర్తిస్తుంది. 2019 మార్చి నాటికి అన్ని ఇళ్లకూ విద్యుత్తు సౌకర్యం కలిగించాలని తొలుత గడువుగా పెట్టుకోగా, అంతకన్నా ముందుగానే 2018 డిసెంబరు నాటికే లక్ష్యాన్ని చేరుకోవాలని నిర్ణయించారు. దీనికి అనుగుణంగా గ్రామీణ విద్యుదీకరణ లక్ష్యాలను కూడా సవరించారు. తొలుత 2018 మే 1 నాటికి మొత్తం అన్ని గ్రామాలకూ విద్యుత్తు సౌకర్యం కలిగించాలని లక్ష్యంగా పెట్టుకోగా, దాన్ని కుదించి ఈ ఏడాది డిసెంబరు నాటికే పూర్తి చేయాలని నిర్ణయించారు. ఇంకా మిగిలిన 2986 గ్రామాలకు విద్యుత్తు సౌకర్యం కల్పించనున్నారు. విద్యుత్తు సౌకర్యం లేని 18,452 గ్రామాలకు వెయ్యి రోజుల్లో ఆ కొరత తీర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు 2015 నాటి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ పేదల జీవితాల్లో 'గుర్తించుకోదగ్గ మార్పు' తీసుకొని రావడం కోసమే సౌభాగ్య పథకాన్ని ప్రారంభించామని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లయినా నాలుగు కోట్ల కుటుంబాలకు విద్యుత్తు సౌకర్యం లేకపోవడం విచారకరమని అన్నారు. తొలుత నిర్ణయించుకున్న లక్ష్యాలకు ముందుగానే విద్యుత్తు సౌకర్యం కల్పిస్తున్నామని, ఇది ప్రభుత్వ పనితీరుకు, దృఢ సంకల్పానికి నిదర్శనమని అన్నారు. గతంలో విద్యుత్తు కోతలు, బొగ్గు కొరతపై వార్తలు వచ్చేవని, ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిందని చెప్పారు. దేశమంతటా విద్యుత్తు మిగులు కనిపిస్తోందని అన్నారు. "విద్యుత్తును కనిపెట్టిన థామస్ ఎడిసన్ ఓ మాట చెప్పారు. చాలా చౌక ధరలకే విద్యుత్తును ఉత్పత్తి చేస్తాం. కేవలం ధనవంతులే కొవ్వొత్తులు ఉపయోగించగలరు' అని అన్నారు. ఆ రోజులు రానున్నాయని మోదీ చెప్పారు. సౌర విద్యుత్తు ధర యూనిట్ రూ.2.44కు తగ్గిందని తెలిపారు.



పేదల సంక్షేమానికి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రధాని ఈ సందర్భంగా వివరించారు. 30 కోట్ల మందికి బ్యాంకు ఖాతాల సౌకర్యం కల్పించామని, నెలకు రూపాయి, రోజుకు 90 పైసల రుసుముతో బీమా సౌకర్యం కల్పించామని అన్నారు. 9 కోట్ల మందికి ఎటువంటి హామీ లేకుండానే రూ.3.5 లక్షల కోట్ల రుణాలు ఇచ్చామని వివరించారు.

కేంద్ర ఇంధనశాఖ మంత్రి ఆర్.కె.సింగ్ మాట్లాడుతూ 2019 మార్చికి అన్ని ఇళ్లకు విద్యుత్తు సౌకర్యం కలిగించడమే కాకుండా, రోజంతా సరఫరా ఉండేలా చూడాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. బిల్లుల చెల్లింపులో ప్రీపెయిడ్ విధానాన్ని తీసుకొచ్చే ఆలోచనుందని తెలిపారు. గ్రిడ్, ఫీడర్ నిర్వహణలో నైపుణ్యాలు పెరగాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతున్నందున విద్యుత్తు అవసరాలు నాలుగు రెట్లు పెరుగుతాయని, అందువల్ల ఈ రంగంలో పెట్టుబడులు పెట్టాలని పరిశ్రమలను కోరారు.

–జనసందేశ్ ప్రతినిధి

## లబ్ధిదారుల ఎంపిక

- సాంఘిక ఆర్థిక కుల జనాభా లెక్క (ఎస్ఈసీసీ-2011)ల్లో పేర్కొన్న విద్యుత్తు సౌకర్యం లేని కుటుంబాలను గుర్తిస్తారు. ఈ లెక్కల్లో లేని కుటుంబాలకు విద్యుత్తు సౌకర్యం లేకుంటే వాటికీ ఈ పథకాన్ని వర్తింపజేస్తారు. ఆ కుటుంబాలు రూ.500ను 10 వాయిదాల్లో డిస్కంలకు బిల్లులతో పాటు చెల్లించాలి.
- గ్రామ పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థలు దరఖాస్తులు ఇచ్చి, సంబంధిత పనులను పూర్తి చేస్తాయి. గ్రామీణ విద్యుదీకరణ సంస్థ సమన్వయకర్తగా వ్యవహరిస్తుంది.
- మరీ మారుమూల గ్రామాలకు సౌర విద్యుత్తు సౌకర్యం కలిగిస్తారు. 200-300 డబ్ల్యూపీ బ్యాటరీ, 5ఎ ల్ఈడీ బల్బులు, ఒక డీసీ ఫ్యాన్, ఒక డీసీ పవర్ ప్లగ్ ఇస్తారు. అయిదేళ్ల పాటు నిర్వహణ, మరమ్మతు బాధ్యతలు చూస్తారు.



పరోపకారమే పుణ్యం, పర పీడనమే పాపం. – శ్రీ విద్యా ప్రకాశనందగిరి స్వామి

మనమాట

# ఏడాదైనా గాడిన పడని పాలన

టీఆర్ఎస్ ప్రభుత్వం హడావిడిగా ఏర్పాటు చేసిన కొత్త జిల్లాలతో పరిపాలన గాడి తప్పింది. జిల్లాలు ఏర్పడి సంవత్సరం కావొస్తున్న ఎక్కడి సమస్యలు అక్కడే తిష్ట వేశాయి. జిల్లాల ఏర్పాటుతో మేలు జరుగుతుందని ఆశిస్తే అందుకు విరుద్ధమైన పరిస్థితులు ఉన్నాయి. రైతుల, విద్యార్థుల, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మన్ కొత్త జిల్లాల ఏర్పాటుతో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ అక్టోబర్ 4న సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. జనసందేశ్ పాఠకుల కోసం ఆ లేఖను యథాతథంగా ప్రచురిస్తున్నాం.

**–జనసందేశ్ ప్రతినిధి**

**శ్రీ కె. చంద్రశేఖర్ రావు గారికి** **తేది:** 04.10.2017

గౌరవ ముఖ్యమంత్రి, తెలంగాణ ప్రభుత్వం

హైదరాబాద్.

**ఆర్యా!**

జిల్లాలు, మండలాల పునర్ వ్యవస్థీకరణలో భాగంగా అదనంగా 21 కొత్త జిల్లాలు, 125 మండలాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కారణంగా పరిపాలన వికేంద్రీకరణ జరిగి ప్రజలకు మరింత చేరువవుతుందని, ప్రజల ముంగిటనే అధికారులు వాలిపోతారని ప్రభుత్వం భావించింది. కానీ వాస్తవ పరిస్థితి దీనికి విరుద్ధంగా ఉంది. సంవత్సరం గడిచినా పరిపాలన ఒక కొలిక్కి రాలేదు. ఇంకా గాడిన పడలేదు. పలు జిల్లాలలో తగిన సిబ్బంది లేక పనులు ఎక్కడికక్కడ స్తంభించాయి. కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, జిల్లా రెవెన్యూ అధికారులతో సహా అనేక పోస్టులలో ఇంచార్జీలు కొనసాగుతున్నారు. జిల్లాల సంఖ్య పెరగడం, విస్తీర్ణం తగ్గడంతో మంత్రులు లేని జిల్లాలలో అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలెక్టర్లపై పెత్తనం చెలాయిస్తున్నారని, రోజువారీ పాలన వ్యవహారాల్లో ముఖ్యంగా సిబ్బంది బదిలీలపై మితిమీరిన జోక్యం చేసుకుంటున్నారని తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. పలు జిల్లాలలో కలెక్టర్ కార్యాలయాల స్థలాల ఎంపిక ఇంకా పూర్తికాలేదు. వివిధ శాఖలకు అధికారులు లేకపోవడంతో జూనియర్లతోనే నెట్టుకొస్తున్నారు. ఇక రెవెన్యూ పరిపాలన సంగతి సరేసరి. నాలుగో వంతు పోస్టుల ఖాళీతో అస్తవ్యస్తంగా మారింది. అనేక జిల్లాలలో వివిధ శాఖల కార్యాలయాలు ఒకేచోట లేవు. అరకొర సౌకర్యాలు, అద్దె భవనాలతో కాలం వెళ్లదీస్తున్నారు.

ఇక మండలాల సంగతి చెప్పనక్కర్లేదు. 125 కొత్త రెవెన్యూ మండలాలలో ఒక్క సంవత్సరంలోనే రెండు, మూడు సార్లు తహసీల్దార్లు మారిన సంఘటనలు కోకొల్లలు. మ్యుటేషన్లు, పహానీ, పాస్‌బుక్కు, టైటిల్ డీడ్‌లు, కుల, నివాస, ఆదాయ ధ్రువపత్రాల జారీ తదితర అవసరాల కోసం ప్రజలు ముఖ్యంగా రైతులు, విద్యార్థులు పడుతున్న బాధలు వర్ణణాతీతం.

**వివిధ జిల్లాలలో పరిపాలనతీరుకు అద్దం పడుతున్న అంశాలు ఉదాహరణకు కొన్ని:**

☞ పెద్దపల్లి, నిజామాబాద్ జిల్లాలకు గత కొన్ని నెలలుగా జాయింట్ కలెక్టర్లే ఇంచార్జీ కలెక్టర్లుగా కొనసాగుతున్నారు.

☞ పెద్దపల్లి, హైదరాబాద్ జిల్లాలకు రెవెన్యూ అధికారులే లేరు.

☞ రెవెన్యూ డివిజన్ అధికారులు (ఆర్డీవోలు) పోస్టులలో కూడా పక్క ఆర్డీవోలే ఇంచార్జీలుగా కొనసాగుతున్నారు.

☞ మహబూబాబాద్, భూపాలపల్లి, జనగామ, వరంగల్ రూరల్, సిరిసిల్ల, జగిత్యాల, మంచిర్యాల, అసిఫాబాద్, మెదక్, గద్వాల, వనపర్తి, నాగర్ కర్నూల్, సూర్యాపేట, భువనగిరి తదితర జిల్లాలలో కార్యాలయాలు, సిబ్బంది పరిస్థితి ఘోరంగా ఉంది.

☞ రాజకీయాల కారణంగా రంగారెడ్డి, వరంగల్ రూరల్, మెదక్ తదితర జిల్లా కేంద్రాల స్థలం ఇంకా నిర్ణయం కాలేదు.

☞ మహబూబాబాద్, జనగామ, పెద్దపల్లి, మెదక్ తదితర జిల్లాల్లో కలెక్టర్లు ఎమ్మెల్యేల మధ్య ప్రచ్ఛన్న యుద్ధంతో పరిపాలన కుంటుపడినా సమన్వయం చేసే నాథుడు లేరు.

☞ రెవెన్యూ సంబంధించి తహసీల్దార్లు, ఉప తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, వీఆర్వోలు తదితరలతో కలిపి 39,805 పోస్టులు ఉండగా 5,933 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ఈ రకంగా జిల్లాలలో పరిపాలన ఎటువైపు పోతుందో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, తమకు అనుకూలంగా వ్యవహరించాలని పరిపాలనలో జోక్యం చేసుకుంటున్న ఎమ్మెల్యేలను అదుపులో ఉంచాలని, పారదర్శక పరిపాలన కోసం అధికారులకు పూర్తి స్వేచ్ఛనివ్వాలని కోరుతున్నాను. ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నందున తక్షణ అవసర చర్యలు చేపడుతారని ఆశిస్తున్నాను.

ధన్యవాదములతో..

భవదీయ

**(డా॥ కె.లక్ష్మన్)**






Mann Ki Baat

# ఖాదీ ప్రచారోద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్దాం

**సెప్టెంబర్ 24న ఆకాశవాణిలో ప్రసారమైన 'మన్ కీ బాత్' (మనసులో మాట)లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనేక అంశాలపై తన అభిప్రాయాలను ప్రజలతో పంచుకున్నారు. ఈ కార్యక్రమం మొదలై మూడేళ్లు నిండిందని, ఈ ప్రసంగం తన మనసులో మాట కాదని.. దేశ ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులనే ఇక్కడ ప్రస్తావిస్తున్నానని అన్నారు. దేశంలో ఖాదీ అమ్మకాలు ఊపందుకున్నాయని, ఈ ప్రచారోద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఈ సందర్భంగా కోరారు. ప్రధాని ప్రసంగంలోని ముఖ్యాంశాలను ఆయన మాటల్లోనే చూద్దాం.**

☞ చూస్తూ ఉండగానే 'మన్ కీ బాత్' (మనసులో మాట)కు మూడేళ్ళు నిండాయి. ఇది 36వ మన్ కీ బాత్. ఒక రకంగా చెప్పాలంటే, దేశం నలుమూలల్లోనూ నిండి ఉన్న ఆలోచనలు, ఆశలు, ఆకాంక్షల రూపం, ఒక సానుకూల శక్తి ఈ 'మన్ కీ బాత్'. కొన్ని చోట్ల నుండి ఫిర్యాదులు కూడా ఉన్నాయి కానీ ప్రజల మనసుల్లో వెల్లువేత్తే ఆలోచనలన్నింటితో నన్ను నేను అనుసంధానించుకునే ఒక అద్భుతమైన అవకాశాన్ని నాకు ఈ 'మన్ కీ బాత్' ఇచ్చింది. ఇవి నా మనసులో మాటలని నేనెప్పుడూ చెప్పలేదు. ఈ 'మన్ కీ బాత్'లో నేను చెప్పే కబుర్లు దేశం నలుమూలల నుండీ నాకు ప్రజలు పంపిన మాటలే.

☞ 'మన్ కీ బాత్'కు రాజకీయ రంగు అంటకుండానే చూశాను. ఎప్పటికప్పుడు, పరిస్థితుల్లో ఎంతటి తీవ్రత ఉన్నా, ఆక్రోశాలున్నా, వాటితో పాటూ నేనూ కదిలిపోకుండా, ఒక స్థిరమైన మనసుతో, మీతో కలిసి ఉండే ప్రయత్నమే చేశాను.

☞ భోజనం చేసేప్పుడు.. మనకి ఎంత అవసరం అని ఆలోచించి, సరిపడినంతే తినాలి. పదార్థాలను వృథా చెయ్యకూడదు అని నేనిదివరకూ 'మన్ కీ బాత్'లో ఒకసారి చెప్పాను. ఆ తర్వాత దేశం నలుమూలల నుండీ, అనేక సామాజిక సంస్థలు, అనేకమంది యువకులు ముందు నుంచే ఇటువంటి పనులు చేస్తున్నారని చెప్తూ నాకు ఎన్నో ఉత్తరాలు వచ్చాయి. కంచంలో వదిలేసిన అన్నాన్ని ఒక చోట చేర్చి, దానిని ఎలా సద్వినియోగపరచాలని ఆలోచించేవాళ్ళు ఎంతో మంది ఉన్నారన్న సంగతి నా దృష్టికి వచ్చాకా, నాకు ఎంతో సంతోషం కలిగింది.

☞ మరోసారి 'మన్ కీ బాత్'లో నేను మహారాష్ట్రలో పదవీ విరమణ చేసిన ఒక ఉపాధ్యాయుడు చంద్రకాంత్ కులకర్ణీ గురించి చెప్పాను. ఆయనకు వచ్చే రూ.16 వేల పెన్షన్ లోంచి రూ.5 వేలు తీసి, 51 పోస్ట్‌డేటెడ్ చెక్‌ల రూపంలో పారిశుధ్యం కోసం దానమిచ్చేశారు. ఆ తరువాత స్వచ్ఛత కోసం ఇటువంటి పనులు చెయ్యడానికి ఎందరో ముందుకు వచ్చారు.

☞ నేను హర్యానాలో ఒక సర్పంచ్ తీసుకున్న 'సెల్ఫీ విత్ డాటర్' ఫోటో చూసి, దాని గురించి 'మన్ కీ బాత్'లో చెప్పాను. చూస్తూండగానే ఒక్క భారతదేశంలోనే కాక, యావత్ ప్రపంచంలోనే 'సెల్ఫీ విత్ డాటర్' అనే ఒక పెద్ద ఉద్యమం మొదలైంది. ఇది కేవలం సామాజిక మాధ్యమం తాలూకూ విషయం మాత్రమే కాదు. ప్రతి అమ్మాయిలోనూ ఒక కొత్త ఆత్మవిశ్వాసాన్నీ, నూతన గర్వాన్నీ నింపే సంఘటన ఇది. అందరు తల్లిదండ్రులకీ తమ కుమార్తెలతో సెల్ఫీ తీసుకోవాలని అనిపించింది. ప్రతి అమ్మాయికీ తనలో ఏదో గొప్పతనం ఉందనీ, తనకు ప్రాముఖ్యత ఉందనీ నమ్మకం కలిగింది.

☞ ఈ మధ్య కాలంలో ప్రజల్లో ఖాదీ పట్ల ఆసక్తి పెరగటం గమనించాను. ఆ కారణంగా పేదల ఇళ్ళల్లో వారికి అవసరమైన ఉపాధి లభించింది. అక్టోబర్ 2 నుంచి ఖాదీ అమ్మకాల్లో డిస్కౌంట్‌లు లభిస్తాయి. చాలావరకూ తగ్గింపు లభిస్తుంది. ఈ ఖాదీ ప్రచారాన్ని ఇలానే ముందుకు నడిపించి, పెంచాలని నేను మరోసారి కోరుతున్నాను. ఖాదీ వస్త్రాలని కొని పేదవారి ఇళ్లల్లో దీపావళి దీపాలను వెలిగించండి. కొత్త సాంకేతికతని ఎలా తేవాలి, ఉత్పాదన శక్తిని ఎలా పెంచాలి, సౌరశక్తితో పనిచేసే చేతి మగ్గాలు ఎలా తేవాలి, ఏళ్ల నుండీ మూసుకుపోయి ఉన్న ప్రాచీన సాంప్రదాయాన్ని ఎలా పునరుద్ధరించాలి.. మొదలైన ఆలోచనలు పెరిగాయి

☞ గత నెలలోని 'మన్ కీ బాత్'లో మనందరమూ ఒక సంకల్పాన్ని తీసుకున్నాం. గాంధీ జయంతికి పదిహేను రోజుల ముందు నుండీ దేశమంతటా స్వచ్ఛతా ఉత్సవాన్ని జరుపుకోవాలని మనం నిర్ణయించుకున్నాం. ప్రజలందరినీ పరిశుభ్రతతో కలుపుకుందా మనుకున్నాం. మన రాష్ట్రపతి గారు ఈ కార్యక్రమాన్ని



జీవితమనే యుద్ధరంగంలో ధైర్యంగా పోరాడే సైనికుని శక్తి, స్ఫూర్తి మనకిప్పుడు కావాలి. – స్వామి వివేకానంద

ప్రారంభించారు. యావత్ దేశం ఏకమైంది. పిల్లలు-పెద్దలూ, పురుషులు, స్త్రీలు, నగరాల్లో, పల్లెల్లో, ప్రతిఒక్కరూ ఇవాళ పారిశుధ్య ప్రచారంలో భాగస్థులయ్యారు. "సంకల్పంతో సాధించగలం" అని నేను చెప్పినట్లుగా, ఈ పారిశుధ్య ప్రచారం ఏ రకంగా ముందుకు నడుస్తోందో మనం కళ్ల ముందరే చూస్తున్నాం. ప్రతి ఒక్కరూ ఈ ప్రచారానికి స్పందించి, సహకరించి, సఫలం చేయడానికి తన వంతు సహకారాన్ని అందిస్తున్నారు.

- పరిశుభ్రతను ఒక స్వభావంగా మార్చుకోవాలంటే, భావోద్వేగ ఉద్యమం కూడా అవసరమే. ఈసారి "స్వచ్ఛతే సేవ" ద్వారా ఎన్నో పోటీలు జరిగాయి. 2000 కంటే ఎక్కువమంది పిల్లలు ఈ పరిశుభ్రత తాలూకూ వ్యాస రచన పోటీల్లో పాల్గొన్నారు. వేల మంది పిల్లలు చిత్రాలు గీశారు. తమ తమ ఊహలతోనే పరిశుభ్రత గురించి చిత్రాలు వేశారు. చాలా మంది కవితలు రాశారు.
- శ్రీనగర్ పురపాలక సంఘం "పారిశుధ్యం" కోసం బిలాల్ దార్‌ను తమ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించిందని తెలిస్తే మీరు సంతోషపడతారు. బ్రాండ్ అంబాసిడర్ అనగానే అతడు సినీ రంగానికో, క్రీడారంగానికో చెందిన హీరో అని మీరు అనుకోవచ్చు. కానే కాదు. బిలాల్ దార్ తన పన్నెండు-పదమూడేళ్ళ వయసు నుంచీ, గత ఐదారేళ్ళుగా పరిశుభ్రతపైనే దృష్టి పెట్టాడు. శ్రీనగర్‌లోని ఆసియాలోనే అతిపెద్దదైన సరస్సులో ప్లాస్టిక్, పాలిథీన్, వాడేసిన బాటిల్స్, చెత్తా చెదారం, అన్నింటినీ శుభ్రపరుస్తూ వస్తున్నాడు. వాటితో కాస్తంత ఆదాయం కూడా అతడికి లభిస్తోంది. అతడి తండ్రి చిన్నతనంలోనే కేన్సర్‌తో చనిపోతే, తన జీవనానికి సరిపడే జీవనోపాధికి పారిశుధ్యాన్ని కూడా జతపరిచాడీ యువకుడు. బిలాల్ ఏడాదికి 12 వేల కిలోల కంటే ఎక్కువ చెత్తను శుభ్రపరిచాడని ఒక అంచనా. శ్రీనగర్ ఒక ప్రముఖ పర్యాటక ప్రాంతమే కాక భారతదేశంలో ప్రతి ఒక్కరూ వెళ్లాలని కోరుకునే నగరమైన శ్రీనగర్‌లో ఇలాంటి పరిశుభ్రత కార్యక్రమాలు జరగడం చాలా పెద్ద విషయం.
- ఈ అక్టోబర్ నెల ఎందరో మహాపురుషులను స్మరించుకోవాల్సిన నెల. మహాత్మా గాంధీ మొదలుకొని సర్దార్ పటేల్ వరకూ ఎందరో మహాపురుషులు మన ముందర ఉన్నారు. వారంతా కూడా 20వ, 21వ శతాబ్దాల కోసం మనందరికీ దారి చూపారు. నాయకత్వం వహించారు. మార్గదర్శకంగా నిలిచారు. దేశం కోసం వారంతా ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నారు. అక్టోబర్ 2న మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రిల జయంతి అయితే అక్టోబర్ 11న జయప్రకాశ్ నారాయణ్, నానాజీ దేశ్‌ముఖ్‌ల జయంతి. సెప్టెంబర్ 25న పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి. ఈ మహాపురుషులందరినీ స్మరించుకోవడం వారికి ఉపకారం చెయ్యడానికి కాదు. ముందుకి నడవడానికి మనకి దారి దొరుకుతుందని. మనం సరైన దిశలో పయనించాలని.
- భిన్నత్వంలో ఏకత్వం మన భారతదేశ ప్రత్యేకత అని సాధారణంగా చెప్తూ ఉంటాం. భిన్నత్వాన్ని మనం గౌరవిస్తాం కానీ మీరెప్పుడైనా ఈ భిన్నత్వాన్ని అనుభూతి చెందే ప్రయత్నం చేశారా? భారతదేశంలోని వైవిధ్యాలను అనుభూతి చెందండి, వాటిని స్పృశించండి, వాటి పరిమళాన్ని ఆస్వాదించండి అని ప్రత్యేకంగా మన యువతతో చెప్పాలనుకున్నాను. మీ వ్యక్తిత్వ వికాసానికి కూడా మన దేశంలోని వైవిధ్యాలు పెద్ద పాఠశాలలుగా మారగలవు. సెలవు రోజులు గడుస్తున్నాయి. దేశంలో ఏదో ఒక చోటికి ప్రయాణించి వెళ్ళే ఆలోచనలో అంతా ఉన్నారు. అందరూ పర్యాటకులుగా వెళ్లడం సాధారణమైన విషయమే. కానీ బాధని కలిగించే విషయం ఏమిటంటే, ప్రజలు మన దేశాన్ని చూడరు, దేశంలోని వైవిధ్యాలను చూడరు. తెలుసుకోరు. కానీ తళుకుబెళుకుల మాయలో పడి విదేశీ పర్యటన చేసేందుకు మాత్రం సంసిద్ధంగా ఉన్నారు.
- సాధారణంగా అక్టోబర్ నుండి మార్చి దాకా పర్యటనకు బావుంటుంది. ప్రజలు అలానే వెళ్తూంటారు. మీరీసారి వెళ్తే గనుక నా ప్రచారాన్ని ఇంకా ముందుకు తీసుకువెళ్తారని నాకు నమ్మకం. మీరెక్కడికి వెళ్ళినా మీ అనుభవాలను పంచుకోండి. చిత్రాలను పంచుకోండి. **#incredibleindia**లో మీ ఫోటోని తప్పక పంపించండి. మీరు వెళ్ళిన చోట కలిసిన మనుషుల చిత్రాలను కూడా పంపించండి. కేవలం నిర్మాణాల గురించే కాకుండా, ప్రకృతి సౌందర్యాన్నే కాకుండా అక్కడి జనజీవన విధానాల గురించి కూడా రాయండి. మీ ప్రయాణం గురించిన చక్కని వ్యాసాన్ని రాయండి. **Mygov, NarendraModiApp**కి పంపించండి. మీ రాష్ట్రంలోని ఏడు ఉత్తమమైన పర్యాటక ప్రదేశాలను గురించి రాయండి. ప్రతి భారతీయుడూ మీ రాష్ట్రంలోని ఆ ఏడు ప్రాంతాల గురించీ తెలుసుకోవాలి. వీలైతే వెళ్లాలి. ఈ విషయంలో మీరేదైనా సమాచారాన్ని అందించగలరా?
- భారత సైన్యానికి లెఫ్టినెంట్ స్వాతి, నిధిల రూపాల్లో ఇద్దరు వీర వనితలు లభించారు. వీరు అసామాన్యులు. అసామాన్యులు అని ఎందుకు అంటున్నానంటే భారతమాతకి సేవ చేస్తూ, చేస్తూ వారి భర్తలు స్వర్గస్థులయ్యారు. చిన్న వయసులో సంసారం ఛిన్నాభిన్నమయిపోతే వారి మనఃస్థితి ఎలా ఉంటుందో మనం ఊహించగలం. అమరవీరుడు కర్నల్ సంతోష్ మహాదిక్ భార్య స్వాతి మహాదిక్ ఇటువంటి కఠినమైన పరిస్థితులను ఎదుర్కొంటూనే భారత సైన్యంలో చేరాలని నిశ్చయించుకుంది. భారత సైన్యంలో చేరింది. పదకొండు నెలలపాటు ఆమె కఠిన శిక్షణ పొంది, తన భర్త కలలను సాకారం చెయ్యడానికి తన జీవితాన్ని అంకితం చేసింది. అలానే నిధీ దూబే భర్త ముఖేష్ దూబే కూడా సైన్యంలో పని చేస్తూ, మృత్యుభూమికి మరలిపోయారు. ఆయన భార్య నిధి కూడా సైన్యంలోనే చేరాలని పట్టుబట్టి, చేరింది. ప్రతి భారతీయుడికీ మన ఈ మాతృ శక్తి పట్ల, మన ఈ వీర వనితల పట్ల గౌరవభావం కలగడం స్వాభావికమే. నేను ఈ ఇద్దరు సోదరీమణులకూ హృదయపూర్వకంగా అనేకానేక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. వారు దేశంలోని కోటాదికోట్ల ప్రజలకి కొత్త ప్రేరణనూ, కొత్త ఉత్తేజాన్నీ అందించారు. ఆ ఇద్దరు సోదరీమణులకూ అనేకానేక అభినందనలు.

**-జనసందేశ్ ప్రతినిధి**




# ఐరాసలో అబద్ధపు ప్రచారం - బోర్లబొక్కపడ్డ పాకిస్థాన్

● సుధా కస్తూరి

ఐరాసలో పాకిస్థాన్ మరోసారి బొక్కబోర్ల పడింది. ఇప్పటికే అంతర్జాతీయంగా ఉగ్రవాదాన్ని తప్ప మరేమీ ఎగుమతి చేయలేని దేశంగా పేరొందిన పాకిస్థాన్, ఆడరానమ్మ మద్దెల ఓడు అన్నట్టు భారత్‌పై విమర్శలు చేసేందుకు ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీని ఎంచుకుంది. ఎప్పట్లాగానే కడుపు చించుకుంది. కాళ్లమీద పారేసుకుంది. మోకాలడ్డం పెట్టి బొక్కబోర్ల పడింది.

సెప్టెంబర్ 19 నుంచి 29 వరకూ జరిగిన జనరల్ అసెంబ్లీ సమావేశాలు ఉత్తర కొరియా అణ్వస్త్ర క్షిపణి ప్రయోగాలు, అమెరికా ఉత్తర కొరియా వివాదాలు, నాలుగున్నర లక్షల మంది రోహింగ్యాలు మ్యాన్మార్ నుంచి బంగ్లాదేశ్‌కి తరలి రావడం, ప్యారిస్ వాతావరణ మార్పుల ఒప్పందం నుంచి అమెరికా వైదొలగడం, ప్రపంచవ్యాప్త ఉగ్రవాదం వంటి ప్రధాన సమస్యల నేపథ్యంలో జరిగింది. నిజానికి చర్చ కూడా దానిపైనే ప్రధానంగా జరిగింది. కానీ పాకిస్థాన్ ఈ రామాయణంలో పిడకల వేట చేసి తీరాలని నిర్ణయించుకుని మరీ ఐరాసకు వచ్చింది. కశ్మీర్ అనే పాచిపోయిన పాత పదార్థాన్నే మళ్లీ మళ్లీ పరమాన్నంలా వడ్డించేందుకు కొంగు బిగించింది. అయితే ప్రపంచం ఈ పాచిపదార్థాన్ని తినేందుకు అటుంచితే వాసన చూసేందుకు కూడా ఇష్టపడటం లేదన్నది పాకిస్థాన్‌కు ఇప్పటికీ అర్థం కావడం లేదు. పాక్ కొత్త ప్రధాని అబ్బాసీ తన ప్రసంగంలో పదిహేడు సార్లు కశ్మీర్ పేరు, పధ్నాలుగు సార్లు ఇండియా పేరును ప్రస్తావించారు. హిరణ్య కశిపుడు విష్ణువు తలచుకున్నట్టు ఆయన భారత్ భజన చేశారు. దానికి మన విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మా స్వరాజ్ దీటైన సమాధానం చెప్పారు. పాకిస్థాన్ ఇప్పుడు టెర్రరిస్థాన్‌గా మారిపోయిందని ఆమె విమర్శించారు. "భారత్ ఐటీని, ఐఐటీని సృష్టిస్తే పాకిస్థాన్ ఎల్ఈటీ (లష్కరె తోయిబా)ను తయారు చేస్తోందని ఆమె వ్యాఖ్యానించారు. పాకిస్థాన్ వద్ద దీనికి జవాబు లేకపోయింది. తాను తీసిన గోతిలో తనే పడింది.

ఇదంతా చాలదన్నట్టు పాకిస్థాన్ కశ్మీర్ ప్రస్తావనను మళ్లీ తీసుకొచ్చింది. ఐరాస జనరల్ అసెంబ్లీలో పాకిస్థాన్ శాశ్వత ప్రతినిధి మలీహా లోధీ కశ్మీర్‌లో పెల్లెట్ గన్స్ వాడకం గురించి నోరుపారేసుకున్నారు. అదే ఊపులో ఆమె ఒక యువతి ఫోటోను చూపించి "ఇదిగో ఇదీ అమాయక కశ్మీరీలపై భారత పోలీసులు చేస్తున్న జులుం" అని ప్రకటించింది. అక్కడే ఆమె పప్పులో కాలేసింది. ఆమె చూపించింది కశ్మీరీ యువతి ఫోటో కాదు. రోయా అబూ జోమా అనే పదిహేడేళ్ల పాలెస్తీనా యువతి ఫోటో అది. ఆమె ఇంటిపై ఇజ్రాయిలీ సేనలు దాడి చేసినప్పుడు ఆమెకు ఈ గాయాలయ్యాయి. ఆమె ఆస్పత్రిలో ఉండగా ఆమె ఫోటోను హైదీ లెవైన్ అనే సుప్రసిద్ధ అమెరికన్ ఫోటోగ్రాఫర్ తీశాడు. ఇది అనేక ప్రముఖ పత్రికల్లో ప్రచురితమైంది. ఫోటోగ్రాఫర్‌కు బహుమతులను కూడా తెచ్చిపెట్టింది. అలాంటి సుప్రసిద్ధ ఫోటోను కశ్మీరీ యువతి ఫోటో అని చెలామణీ చేసి, అసత్య ప్రచారానికి పాకిస్థాన్ పాల్పడింది. తక్షణమే నెటిజెన్లు పాకిస్థాన్ అసత్య ప్రచారాన్ని బట్టబయలు చేశారు. ఆ మరుసటి రోజు కశ్మీర్ వాస్తవ పరిస్థితుల గురించి మన ఫస్ట్ అండర్ సెక్రటరీ పౌలోమీ త్రిపాఠీ ప్రసంగించారు. పాక్ అసత్య ప్రచారానికి బదులుగా కశ్మీర్‌లో పాక్ ఉగ్రవాదులు మట్టుపెట్టిన సైనికాధికారి కల్నల్ ఫైయాజ్ అహ్మద్ ఫోటోను చూపించి, ఇదీ కశ్మీర్ వాస్తవికత అని ఎత్తి చూపారు.

మొత్తం మీద పాకిస్థాన్ పన్నాగం పటాపంచలైపోయింది. భారత్‌ను ఇబ్బందుల పాలు చేద్దామని ప్రయత్నించి ఘోషయాత్రలో దుర్యోధనుడిలా అభాసుపాలైంది. దొంగ ఫోటో చూపి అసత్య ప్రచారం చేయబోయి అడుసు తొక్కింది. ఇప్పుడు కాలు కడుక్కోవడం కష్టమైపోయింది. నిజానికి పాకిస్థాన్ కశ్మీర్ విషయంలో ఆశలకు నీళ్లొదులుకోవాలి. కశ్మీర్‌లోయ ఏనాడూ పాకిస్థాన్ పరం కాదన్న విషయం ఆ దేశం గుర్తించాలి. అసత్య ప్రచారంతోనో, ఆర్భాటంతోనో పని కాని వ్వాలనుకోవడం పొరబాటు. నిజానికి ఉగ్రవాదాన్ని ఎగుమతి చేసే దేశంగా పాకిస్థాన్ ప్రపంచం ముందు బోనులో దోషిలా నిలబడింది. ప్రపంచంలో ఎక్కడ ఉగ్రవాద సంఘటన జరిగినా దాని మూలాలు పాకిస్థాన్‌లోనే ఉంటాయన్నది జగమెరిగిన సత్యం. అమెరికా, ఆఖరికి నమ్మిన దోస్తు చైనా కూడా పాకిస్థాన్‌ను హెచ్చరిస్తున్నాయి. ఈ వాతావరణంలో పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే విధానాన్ని మానుకోవాల్సిన అవసరం ఉంది. లేకపోతే అంతర్జాతీయంగా పాకిస్థాన్ ఒంటరిదైపోవడం ఖాయం. ■

## అధికార ప్రతినిధులుగా నందీశ్వర్ గౌడ్, శ్రీధర్ రెడ్డి







బిజెపి తెలంగాణ అధికార ప్రతినిధులుగా సంగారెడ్డి జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్ గౌడ్, హైదరాబాద్‌కు చెందిన రావుల శ్రీధర్ రెడ్డిలను రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మణ్ నియమించారు. బిజెపి తెలంగాణ రాష్ట్ర కార్యాలయ ప్రోగ్రామ్స్ ఇంచార్జ్‌గా గోషామహల్‌కు చెందిన డి.గోపాల్ నియమితులయ్యారు. ■



పొగిడితే మందహాసం చేసి, తిడితే మౌనం వహించువాడు ఉత్తముడు. - గాంధీ




# బెంగాల్ రాజకీయాల్లో పెను మార్పులు

• క్రరావు

పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్‌కు ఎదురుగాలి వీస్తోంది. రాజకీయంగా అక్కడ పెను మార్పులు సంభవిస్తున్నాయి. బెంగాల్ రాజకీయాల్లో నాలుగో శక్తి నుంచి బిజెపి రెండో శక్తిగా ఎదిగింది. ఇప్పుడు తృణమూల్ కాంగ్రెస్‌కు బిజెపియే ప్రత్యామ్నాయంగా ఎదిగింది. మూడు దశాబ్దాలు పైబడి అధికారం చెలాయించిన కమ్యూనిస్టులు ఇప్పుడు రాజకీయంగా అత్యంత బలహీన స్థితిలో ఉన్నారు. వారి ఓట్ల శాతం శరవేగంగా పతనమవుతోంది. కాంగ్రెస్ పార్టీ కూడా నానాటికీ బలహీనపడుతోంది.

తృణమూల్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ముకుల్ రాయ్ పార్టీ వీడటం ఒక కీలక పరిణామం. ముకుల్ రాయ్ తృణమూల్ వ్యవస్థాపకుల్లో ఒకరు. పార్టీ నిర్మాణంలో ఆయనది కీలక పాత్ర. మమతా బెనర్జీ జనాకర్షణకి, ముకుల్ రాయ్ సంస్థాగత నిర్మాణ కౌశల్యం జోడైన కారణంగానే తృణమూల్ ఎదిగింది. 2011 అసెంబ్లీ ఎన్నికల్లో దశాబ్దాల కమ్యూనిస్టు ఏలుబడికి భరతవాక్యం పలికి తృణమూల్ సాధించిన విజయం వెనుక ముకుల్ రాయ్ కృషి ఎంతైనా ఉంది. సింగూర్, నందిగ్రామ్ ఉద్యమాలకు వ్యూహం కూడా ఆయనదే. 2014 లోకసభ ఎన్నికల్లోనూ తృణమూల్ విజయఢంకా బజాయించడం వెనుక ముకుల్ పాత్ర ఉంది. అటువంటి ముకుల్ పార్టీ వ్యవహారాలకు గత రెండేళ్లుగా దూరంగా ఉంటున్నారు. మమతా బెనర్జీ ఆయనను పార్టీ రాజ్యసభ నాయకత్వం నుంచి తప్పించింది. పార్టీ ఉపాధ్యక్ష పదవి నుంచి కూడా ఆయనను పక్కన బెట్టారు. శారదా చిట్‌ఫండ్ కుంభకోణంలో ఆయన పార్టీని కాపాడలేదన్నది మమత భావన. ఆ కారణంగా ఆయనను పక్కన పెట్టింది.

ముకుల్ రాయ్ పార్టీ నుంచి బయటకు రావడం వల్ల బెంగాల్ రాజకీయాల్లో మార్పులకు శ్రీకారం చుట్టినట్టయింది. బెంగాల్‌లో ఇప్పట్లో ఎన్నికలు లేవు. ఈ నేపథ్యంలో ఆయన పార్టీని వీడటం వెనుక అవకాశవాదం లేదన్నది సుస్పష్టం. ఆయన భారతీయ జనతా పార్టీలో చేరుతారన్న వార్తలు వస్తున్నాయి. బిజెపి నైతిక రాజకీయాల ప్రమాణాలకు అనుగుణంగా ఆయన తన రాజ్యసభ పదవికి కూడా రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు.

మరోవైపు సీపీఎం ఎంపీలలో ఒకరైన రితబ్రత బెనర్జీ కూడా పార్టీకి రాజీనామా చేశారు. ఆయనను సీపీఎం ఆరేళ్ల పాటు సస్పెండ్ చేసింది. కమ్యూనిస్టు పార్టీ తరపున ఎంపీగా గెలిచిన యువనేత రితబ్రత ఛానెళ్లలో వామపక్ష రాజకీయాల దివాళాకోరుతనాన్ని, నాయకత్వ లోపాలను ఎత్తిచూపారు. ముస్లింలకు పార్టీలో కోటా ఉందని ఆయన సంచలన ప్రకటనలు చేశారు. సీపీఎం బెంగాల్ బాగోగులను పట్టించుకోవడం లేదని, రాష్ట్ర జనాభాలో పాతిక శాతం కన్నా ఎక్కువగా ఉన్న యువ ఓటర్ల ఆకాంక్షలను పార్టీ అర్థం చేసుకోవడం లేదని ఆయన అన్నారు. కమ్యూనిస్టు పార్టీలో ఈ రకమైన ప్రకటనలు చేయడం సాధారణంగా జరగదు. రితబ్రత ఇలాంటి ప్రకటనలు చేయడంతో పార్టీ నాయకత్వం ఖంగుతిన్నది. రితబ్రత బిజెపిలో చేరబోతున్నారని కమ్యూనిస్టు పార్టీలు ఆరోపించాయి. అయితే ఆయన ఇప్పటి వరకూ బిజెపిలో చేరతానని ప్రకటించలేదు. కానీ ఆయన, ముకుల్ రాయ్ కలిసి పనిచేయబోతున్నారన్న వార్తలు వెలువడుతున్నాయి.

> **ముకుల్ రాయ్ పార్టీ నుంచి బయటకు రావడం వల్ల బెంగాల్ రాజకీయాల్లో మార్పులకు శ్రీకారం చుట్టినట్టయింది. బెంగాల్‌లో ఇప్పట్లో ఎన్నికలు లేవు. ఈ నేపథ్యంలో ఆయన పార్టీని వీడటం వెనుక అవకాశవాదం లేదన్నది సుస్పష్టం. బిజెపి నైతిక రాజకీయాల ప్రమాణాలకు అనుగుణంగా ఆయన తన రాజ్యసభ పదవికి కూడా రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు.**

కమ్యూనిస్టు పార్టీ నుంచి, తృణమూల్ నుంచి నాయకులు బయటకి రావడం ఆ పార్టీల డొల్లతనాన్ని బయటపెడుతున్నాయి. ఇప్పటికే త్రిపుర, మణిపూర్‌లలోని తృణమూల్ యూనిట్లు బిజెపిలో కలిసిపోయాయి. అక్కడ కమ్యూనిస్టు పార్టీ నుంచి కూడా బిజెపిలోకి వలసలు జరుగుతున్నాయి. బెంగాల్ రాష్ట్రంలో బిజెపి ఇప్పుడు రెండవ స్థానంలో ఉంది. కమ్యూనిస్టు, కాంగ్రెస్ పార్టీలు రాజకీయంగా అగాధాల లోతుల్లోకి కూరుకుపోతున్నాయి. తృణమూల్ అసహనానికి ఇదే కారణం. మత రాజకీయాలు, ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నా తృణమూల్‌లో బిజెపి ఎదుగుదల పట్ల ఆందోళన పెరుగుతోంది. ■



నాట్యకళా భారతి సరళ కుమారి రచించిన "బతుకమ్మ నృత్యం – శాస్త్రీయత!!" పుస్తకాన్ని సెప్టెంబర్ 27న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మణ్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నేత నల్లు ఇంద్రసేనా రెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు ఆకుల విజయ పాల్గొన్నారు.

ఒక రాజ్యంలో నివసించే ప్రజల భాషను తెలుసుకోకుండా, ప్రజాభిప్రాయాన్ని తెలుసుకోవడం సాధ్యం కాదు. – బార్కం

ముఖాముఖి

# దక్షిణాదిలోనూ పాగా వేస్తాం!



**తెలంగాణలో టీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం బిజెపి మాత్రమేనని బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి పి.మురళీధర్ రావు స్పష్టం చేశారు. ఇతర పార్టీల నేతలు టచ్‌లో ఉన్నారని, ఎప్పుడైనా బిజెపి కండువా కప్పకునే అవకాశం ఉందని చెప్పారు. తాను కర్ణాటక ఇంచార్జిగా ఉన్నందున కేంద్ర మంత్రిమండలిలోకి తీసుకునే అవకాశం లేదని తనకు తెలుసని అన్నారు. ఓ ఛానెల్ ఇంటర్వ్యూలో మాట్లాడిన మురళీధర్ రావు తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాజకీయాలపైనా తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఆ ఇంటర్వ్యూ ముఖ్యాంశాలను చూద్దాం.**

**ప్ర: మీరు కేంద్రమంత్రిగా ఉంటారనుకున్నాం.. దక్షిణాదికే పరిమితం అయ్యారు...?**

**జ:** నేను వాస్తవానికి కర్ణాటక రాష్ట్ర ఇంచార్జిని. అక్కడ 2018 ప్రథమార్ధంలో ఎన్నికలు రానున్నాయి. బిజెపికి కీలకమైన రాష్ట్రం అది. దత్తాత్రేయ గారు ఇక కేంద్ర మంత్రిగా ఉండరనే విషయం నేను ఊహించలేదు. దీంతో తెలంగాణ నుంచి నన్ను కేబినెట్‌లోకి తీసుకుంటారని చాలామంది అనుకున్నారు. నేను మొదటి నుంచి కర్ణాటక రాష్ట్రానికి బాధ్యుడిగా ఉన్నందున ఇది జరిగే వ్యవహారం కాదని నాకు తెలుసు.

**ప్ర: ఏపీ, తెలంగాణకు మీరు ఇంచార్జి కాదన్నట్టేగా?**

**జ:** నేను తెలంగాణ ప్రాంతానికి చెందిన వ్యక్తిని. జాతీయ ప్రధాన కార్యదర్శిగా రాష్ట్ర పార్టీ వ్యవహారాల్లో ఎప్పుడూ ఉంటాను. మిషన్ 2019 వ్యూహంలో భాగంగా 120-130 కొత్త నియోజకవర్గాలను పార్టీ గుర్తించింది. ఉత్తరాంధ్ర బాధ్యతను నాకు అప్పగించింది. అంటే.. ఆంధ్రలో నేను ఉన్నట్టే. శ్రీకాకుళం, విజయనగరం, కాకినాడ, అరకు, అనకాపల్లి నియోజకవర్గాల బాధ్యతను నాకు అప్పగించింది.

**ప్ర: దక్షిణాదిలో మీ పార్టీ బలం ఏమిటో మీకు తెలుసు. కానీ అన్ని సీట్లూ గెలుస్తామంటారు.?**

**జ:** అన్నీ గెలుస్తామనే ఆశ, ఆకాంక్ష, పోటీతత్వం లేకపోయివుంటే.. 1951లో ప్రారంభమై ఇప్పుడు జాతీయ పార్టీగా ఎదిగేవాళ్లమా? స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పుట్టి అధికారంలోకి వచ్చిన ఏకైక పార్టీ బిజెపి. అవిశ్రాంతమైన పోరాటం, పట్టుదల, దేశానికి నాయకత్వం వహించాలన్న కోరిక లేకపోయుంటే ఇది సాధ్యమయ్యేది కాదు.

**ప్ర: పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి స్థాయికి మీరు ఎదిగారు కదా? ఎక్కడి నుంచి మొదలైంది మీ ప్రయాణం?**

**జ:** వరంగల్‌లో డిగ్రీ చదువుతున్న రోజుల్లో ఆర్ఎస్ఎస్ వైపు ఆకర్షితుడనయ్యాను. తర్వాత ఏబీవీపీలో క్రియాశీలకంగా పనిచేశాను. విద్యార్థి పరిషత్, నక్సల్స్ మధ్య పోరాటంతో విద్యార్థి నాయకుడిగా ఎదిగాను. తర్వాత ఓయూకు వచ్చాను. ఆర్ట్స్ కాలేజీలో జనరల్ సెక్రటరీగా పనిచేశాను. ఓయూకు వచ్చాక కూడా నక్సల్స్‌కు టార్గెట్ అయ్యాను. 1988 నవంబరు 6న నక్సల్స్ నాపై దాడి చేశారు. ఛాతీలో బుల్లెట్లు దిగాయి. 18 పెల్లెట్స్ ఇంకా శరీరంలోనే ఉన్నాయి. 2008 ఆఖర్లో బిజెపిలో చేరాను. అప్పట్లో పార్టీ అధ్యక్షుడిగా ఉన్న రాజ్‌నాథ్ సింగ్‌కు సలహాదారుగా నన్ను ఎంపిక చేశారు. మాది సామాన్యమైన రైతు కుటుంబం.

**ప్ర: దేశానికి ఏ విదేశీ ప్రాజెక్టు వచ్చినా ప్రధాని అర్జెంటుగా గుజరాత్‌కు తీసుకెళుతున్నారనే టాక్ ఉంది?**

**జ:** ఇది కరెక్టు కాదు. ప్రధానిగా మోదీ వచ్చిన తర్వాత వివిధ దేశాల నాయకులు వచ్చినప్పుడు ఆ కార్యక్రమాల్లో సీఎంలకు భాగస్వామ్యం కల్పిస్తున్నారు. హైదరాబాద్‌లో త్వరలో ప్రపంచ ఆంత్రప్రెన్యూర్‌షిప్ సదస్సు జరగనుంది. ట్రంప్ కూతురు, అమెరికా బృందం వస్తోంది. ఇలా అన్ని రాష్ట్రాలకూ మోదీ ప్రాధాన్యమిస్తున్నారు.

**ప్ర: మోదీ బలమైన నాయకుడు గనుక ఏ సీఎం అయినా సరే ఆయనకు**

**మోకరిల్లాల్సిందే అంటారా?**

జ: అలాకాదు. ప్రభుత్వాల మధ్య ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఉంటుంది. కేంద్రం దేశాన్ని నడిపిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రాన్ని నడిపిస్తుంది. రెండింటి మధ్య అవగాహన, అవసరాలు ఉంటాయి. ఇందిరా గాంధీ, రాజీవ్‌గాంధీ ప్రధానులుగా.. ఎన్టీఆర్‌లాంటి సీఎంలు ఉన్న రోజుల్లో తమ రాష్ట్రాలకు అన్యాయం జరుగుతోందంటూ కేంద్రానికి వ్యతిరేకంగా ప్రతిరోజూ రోడ్ల మీద గొడవలు జరిగేవి. మన్మోహన్ ప్రధానిగా ఉన్నప్పుడూ ఇదే పరిస్థితి. ఇప్పుడలా లేదు. నవీన్ పట్నాయక్, మమతా బెనర్జీ తదితరులు రాజకీయంగా బిజెపితో విభేదిస్తుండొచ్చు. కేంద్రం తమను చులకన చేస్తున్నదనో, అభివృద్ధిలో నిర్లక్ష్యం చేస్తున్నదనో అంటున్న రాష్ట్ర ప్రభుత్వం ఏదీ లేదు.

**ప్ర. : ఇంతకీ మీ పార్టీ నుంచి కేసీఆర్‌కు దీటైన ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరు?**

జ: ఎన్నికల్లో, వ్యూహంలో ఒక ప్రత్యామ్నాయ సీఎం అభ్యర్థిని ప్రకటించడం అన్ని రాష్ట్రాల్లో కరెక్టు కాదు. ఏ నిర్ణయమైనా పార్టీ ఆలోచించి తీసుకుంటుంది.

**ప్ర: జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఒక్క డివిజన్ కూడా గెలవలేకపోయారు?**

జ: నిజమే. కానీ హైదరాబాద్ బిజెపికి బలమైన కోటనే. జాతీయ స్థాయిలో ఒకప్పుడు మా పార్టీ రెండు స్థానాలనే గెలిచింది.

**ప్ర: 2019 తర్వాత చంద్రబాబు ఉండరు.. మేమే ఉంటాం అని అన్నారటగా?**

జ: ఇందులో వాస్తవం లేదు. పూర్తి అసత్యం. పైపెచ్చు మా మధ్య కార్డియల్ రిలేషన్స్ ఎక్కువున్నాయి. 2019 తర్వాత ఏపీలో మేమే ఉంటాం అనీ నేనెప్పుడూ అన్లేదు.

**ప్ర: తమిళనాడులో రజనీకాంత్‌ను బిజెపిలోకి తెచ్చుకుంటున్నారా?**

జ: రజనీకాంత్ పార్టీ పెడతారా.. బిజెపిలోకి వస్తారా? అనేది ఆయనే తేల్చుకోవాలి. అయితే ఆయనతో మా పార్టీకి సంబంధాలున్నాయి. చర్చలు నడుస్తున్నాయి.

**ప్ర: కేసీఆర్... ప్రధాని మోదీతో మంచిగా ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు. మీరేమో అందుకు భిన్నంగా ఉంటున్నారు. ఏమిటీ వైరుధ్యం?**

జ: ఇది హాట్ అండ్ కోల్డ్ (నవ్వులు).. కేసీఆర్ సీఎం మాత్రమే కాదు. ఓ పార్టీకి నాయకుడు. తన పార్టీ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొనే రాజకీయ నిర్ణయాలు తీసుకుంటారు. అందుకే పార్టీకి నష్టం కలిగించేందుకో.. ఆత్మహత్యా సదృశంగానో మోదీకి హెల్ప్ చేస్తున్నారనుకోవడం సరికాదు. మోదీకి దేశ ప్రజల్లో ఆకర్షణ, ఆదరణ లేకుండా, ప్రధానిగా గుర్తింపు లేకపోతే ఏ సీఎం కూడా మద్దతు ఇవ్వడానికి సిద్ధపడరు. అదే సమయంలో రాజకీయంగా ఇబ్బంది ఉండి ఆయనకు సహకరించాల్సిన అవసరం లేదనుకున్నప్పుడు కేంద్రంలో ఉన్నవారు కూడా ఏ ముఖ్యమంత్రికీ సహకరించరు. ఇది సహజం.

**ప్ర: రెండు సీట్లున్న పార్టీని అద్వానీ రథయాత్ర చేసి ఒక స్థాయికి తెచ్చారు. ఆయన్నే పక్కనబెట్టారనేది సామాన్య ప్రజల్లో కూడా ఏర్పడిన అభిప్రాయం కదా?**

జ: అద్వానీ పట్ల పార్టీ కేడర్‌లో ఏమాత్రం అగౌరవ భావం లేదు. ఒకరు ఫలానా ఆశిస్తున్నారని పార్టీ ఇవ్వడం లేదనేది బిజెపిలో ఉండదు. అద్వానీ గురించి రెండో విధంగా ఆలోచించే స్థితి మా పార్టీలో లేదు. పార్టీ నుంచి ప్రజా నాయకుడిగా ఎదిగినవారు ఎవరున్నా.. అందులో అద్వానీ పాత్ర ఉంది. కాబట్టి బిజెపి సిద్ధాంతం ఉన్నన్ని రోజులు అద్వానీ పేరుంటుంది.

**ప్ర: తెలంగాణలో పార్టీలోకి వచ్చేందుకు టచ్‌లో ఉన్నది ఎంతమంది? ఏ పార్టీవాళ్లు?**

జ: ఓ చెరువులో ఉన్న చేపలు పరస్పరం టచ్‌లో ఉండకుండా ఉంటాయా? రాజకీయాలూ అంతే. రాజకీయాల్లో ఉన్నప్పుడు కలుసుకోవడం చర్చించుకోవడం సహజం. టీడీపీ ప్రభుత్వం నడిపింది. తెలంగాణలో బలమైన నాయకత్వం కింది దాకా ఉండింది. అనుకోని పరిస్థితులు, రాజకీయ మార్పుల కారణంగా మరో పార్టీలోకి వెళ్లారు. అలాగే కాంగ్రెస్ కూడా. జాతీయస్థాయిలోనూ ఆ పార్టీ పరిస్థితి బాగోలేదు. అప్పుడు రాష్ట్రస్థాయి నేతలకు ఇబ్బందులొస్తాయి. బిజెపికి తెలంగాణ కోసం నిలబడిన పార్టీగా గుర్తింపు ఉంది. కాబట్టి అవకాశాలున్నాయి. ఈ అవకాశాలను వినియోగించుకునేందుకు ప్రయత్నిస్తున్నాం. తెలంగాణలో టీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం కాగలిగిన పార్టీ బిజెపి మాత్రమే. తెలంగాణ ఏర్పాటుకు కేసీఆర్ కారణమని, రాష్ట్ర అభివృద్ధికీ ఆయనే కారణం అవుతారు అని ప్రజలు భావించారు. అందుకే.. ఓ అవకాశం ఇచ్చారు. అయితే పాలనలో టీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది.

**ప్ర: ప్రధాని మోదీ తీసుకున్న పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ వల్ల ప్రజలకు మేలు జరగలేదు.. దేశానికి నష్టం జరిగిందనే అభిప్రాయం ఉంది?**

జ: పెద్దనోట్ల రద్దు అనేది రాజకీయంగా సాహసోపేతమైన నిర్ణయం. దీనివల్ల లోటుపాట్లు ఏమిటనేది రానున్న ఏడాదిన్నర కాలంలో ప్రజలకు అర్థమవుతాయి. రానున్న రోజుల్లో బలమైన పునాదుల మీద ఆర్థిక వ్యవస్థ నిలబడాలనే ఆత్మవిశ్వాసం, ప్రజలు మద్దతు ఇస్తారనే నమ్మకంతోనే ఈ నిర్ణయం తీసుకున్నారు. జీఎస్టీలో మున్ముందు ఇన్ని స్లాబ్‌లు ఉండవు.


**ప్ర: వచ్చే ఎన్నికల్లో ఏపీలో పొత్తు ఎవరితో? సింగిల్‌గా వెళతారా?**

జ: రాజకీయాలేమీ ఏడేడు జన్మల బంధాలు కావు. చంద్రబాబు కూడా బిజెపితో ఏడు జన్మల బంధం అనే భావనతో లేరు. రెండు పార్టీలుగా ఎవరి లక్ష్యాలు వారికి ఉన్నాయి. ఇప్పటి దాకా మంచిగానే ప్రయాణం చేస్తున్నాం. ఒకరి వల్ల మరొకరికి నష్టం లేదని అనుకుంటున్నాం. ఎవరో థర్డ్ పార్టీ వచ్చి.. ప్రేమ పాట పాడితే... మా బంధం చెడుతుందని అనుకోరాదు (నవ్వులు).

**ప్ర: జగన్మోహన్ రెడ్డి ప్రేమ గీతం పాడారా?**

జ: రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో మా అభ్యర్థులకు ఆయన మద్దతిచ్చినంత మాత్రాన మా రెగ్యులర్ పార్ట్‌నర్‌కు అనుమానం రాకూడదు. ఏపీలో మా పార్టీ భవిష్యత్తుకు టీడీపీ ఇబ్బంది.. మా ఎదుగుదలకు అవరోధం.. ఆ పార్టీని విడిచిపెడితే తప్ప మేం అక్కడ ఎదగం అనే ఆలోచనకు మేం రాలేదు. ఆ పరిస్థితి చంద్రబాబు కల్పిస్తున్నట్టూ నేను అనుకోవడం లేదు. టీడీపీకి నష్టం కలగకుండా మా పార్టీ ఎదిగే స్పేస్ అక్కడ ఉంది.

**–జనసందేశ్ ప్రతినిధి**




# బిజెపిలో జోరుగా చేరికలు

బిజెపిలో చేరికలు ఊపందుకుంటున్నాయి. తెలంగాణలో టీఆర్ఎస్ ప్రజావ్యతిరేక విధానాలపై నిరసనగా, కేంద్రంలో మోదీ ప్రభుత్వం దేశ సమగ్రాభివృద్ధికి చేపడుతున్న చర్యలకు మద్దతు తెలుపుతూ వివిధ రంగాల్లో స్థిరపడిన ప్రముఖులు, ఇతర పార్టీ నేతలు, కార్యకర్తలు బిజెపిలో చేరుతున్నారు. తెలంగాణవ్యాప్తంగా నిత్యం ఏదో ఒక చోట ఈ చేరికలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మణ్ సమక్షంలో సెప్టెంబర్ 22న సిద్ధిపేట, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల నుండి వందలాది మంది టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు... సెప్టెంబర్ 27న ప్రముఖ సంఘసేవకురాలు లలిత, అజూరిల ఆధ్వర్యంలో మహిళలు పార్టీలో చేరారు.

ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. టీఆర్ఎస్ ప్రభుత్వంపై ఉన్న భ్రమలు తొలగిపోయాయని, రాష్ట్రంలో నేరంద్ర మోదీ తరహా పాలన కోరుకుంటున్నారని అన్నారు. వాగ్దానాలు ఇచ్చి మోసం చేయడం, అవినీతిని పతాక స్థాయికి తీసుకెళ్లడం టీఆర్ఎస్‌లో భాగమైపోయిందని, దీనిని తెలంగాణ ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో రేషన్ షాపుల ద్వారా దాదాపు 9 రకాల నిత్యావసర వస్తువులు సరఫరా చేసేవారని... నేడు బియ్యం తప్ప ఏమీ ఇవ్వడం లేదని వాపోయారు. రూపాయికి కిలో బియ్యం పథకంలో మోదీ ప్రభుత్వం సుమారు రూ.29 సబ్సిడీ ఇస్తే టీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం తన పథకంగా చెప్పుకుంటుందని ఎద్దేవా చేశారు. పండుగలకు రాష్ట్ర ప్రభుత్వం నిత్యవసర వస్తువులను సరఫరా చేయకపోవడం బాధాకరమని వ్యాఖ్యానించారు.



అవినీతిలో కాంగ్రెస్‌తో టీఆర్ఎస్ పోటీపడుతున్నదని, ప్రాజెక్టులలో నీరు పారడం ఏమో కానీ, డబ్బు పారుతుందని, వేల కోట్ల రూపాయలు అవినీతి డబ్బు చేతులు మారుతుందని తెలిపారు. కాంగ్రెస్ ముక్త్ భారత్ దిశగా దేశం వెళుందని, ఇక్కడ టీఆర్ఎస్–కాంగ్రెస్ ముక్త్ తెలంగాణ ఏర్పడుతుందని ఆయన అన్నారు. కేసీఆర్ హామీలైన పేదలకు ఉచిత డబుల్ బెడ్‌రూమ్, దళితుడ్ని ముఖ్యమంత్రి చేస్తామనడం, మూడు ఎకరాల భూ పంపిణీ, యువతకు ఉద్యోగాల కల్పన మాటలకే పరిమితమయ్యాయని విమర్శించారు. ప్రస్తుతం ఉన్న సచివాలయాన్ని కాదని, ముఖమంత్రి కొత్తది కడతామనడం ప్రజాధనం దుర్వినియోగం చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. రవీంద్ర భారతిని ముత్యం చిప్పగా, ఎన్‌టీఆర్ స్టేడియాన్ని కళాక్షేత్రంగా మారుస్తామంటూ, ఇందిరాపార్క్‌లో చెరువు కడుతామంటూ, హుస్సేన్‌సాగర్‌ను కొబ్బరి నీళ్లతో నింపుతానంటూ ముఖ్యమంత్రి గారడి మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, వాస్తవాలను తెలుసుకుంటున్నారని డా॥ లక్ష్మణ్ అన్నారు.

తెలంగాణలో పోలీసు రాజ్యం కొనసాగుతుందని, అది నిజాం పాలనను మైమరిపించే రీతిలో ఉందని నిప్పులు చెరిగారు. రైతులకు బేడీలు వేయడం, నేరెళ్లలో దళితులపై దాడులు కొన్ని ఉదాహరణలు మాత్రమేనని తీవ్రంగా విమర్శించారు. టీఆర్ఎస్ నుండి పెద్ద సంఖ్యలో బిజెపిలో చేరడానికి ముందుకు వస్తున్నారని, ఉద్యమ సమయంలో పనిచేసిన వారికి తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడమేకాక, వారిని అగౌరవపరుస్తున్నారని, తెలంగాణకు వ్యతిరేకంగా పనిచేసిన వారి పెత్తనాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారని డా॥ లక్ష్మణ్ అన్నారు. మతోన్మాద మజ్లిస్, తెలంగాణను వ్యతిరేకించిన వారి మద్దతుతో బంగారు తెలంగాణ సాధిస్తామంటున్న టీఆర్ఎస్‌కు, కేసీఆర్‌కు ప్రజలు గుణపాఠం చెప్పేరోజు త్వరలో వస్తుందని స్పష్టం చేశారు.


కేంద్రంలో నరేంద్ర మోదీ అవినీతిరహిత పాలన, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగేలా తెలంగాణలో ప్రతి ఒక్కరూ బిజెపికి మద్దతు తెలిపాలని డా॥ లక్ష్మణ్ పిలుపునిచ్చారు. 2014లో దేశంలో 40 శాతం కుటుంబాలకు మరుగుదొడ్లు లేవని, 60 సంవత్సరాల కాంగ్రెస్ పాలన పేదలకు ఏం చేసిందో ఇదొక ఉదాహరణగా అభివర్ణించారు. 2018 వరకు దేశంలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం పూర్తిచేయాలనే ప్రణాళికతో మోదీ ప్రభుత్వం ముందుకువెళ్తున్నదని తెలిపారు. బేటి బచావో–బేటి పఢావో, ఉజ్వల పథకం కింద 5 కోట్ల గ్యాస్ కనెక్షన్లు ఇవ్వడం, సుకన్య సమృద్ధి పథకం, స్టార్టప్, స్టాండప్ ఇండియా కింద రూ.2 కోట్ల వరకు రుణాలు ఇప్పించడం, మహిళలను పారిశ్రామికవేత్తలుగా చేయడం లాంటి అనేక కార్యక్రమాలను చేపడుతూ మహిళా సాధికారత కోసం నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా బిజెపి తరఫున 200 మంది పేద మహిళలకు నిత్యావసర వస్తువుల కిట్‌ను పంపిణీ చేశారు.




–జనసందేశ్ ప్రతినిధి



ఈ భూమ్మీద జన్మచేత ఎవరూ అధికులు కారు. బహిరింద్రియ నిగ్రహం కలవారే ఇతరులకన్నా అధికులు, ఉత్తములు. – శ్రీ జ్యోతిరావు ఫూలే




# బతుకమ్మ చీరల్లో అబద్ధపు రంగులు

ఎన్.వి.సుభాష్
బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి



ఏ చోట విన్నా... ఏ నోట విన్నా... మళ్లీ మళ్లీ వినబడే ఒకేమాట... 'బంగారు తెలంగాణ'. ఊరూరా వాడవాడలా ఇదే నినాదం. ఈ నినాదంతోనే ప్రజలని మత్తులో ఉంచి, మభ్యపెడుతూ పబ్బం గడుపుకుంటూ సొంతబలాన్ని పెంచుకుంటూ పోతున్న టీఆర్ఎస్ చేస్తున్న గొప్ప బురిడీలలో ఒకటి.. తెలంగాణ ఆడపడుచులకు బతుకమ్మ చీరల పంపిణీ వినూత్న కార్యక్రమం! ఎంతో చాకచాక్యంగా వేసిన సరికొత్త ఎత్తుగడ ఇది!!

బంగారు తెలంగాణ ఓ బ్రహ్మాండమైన నాటకం అయితే ఈ 'బతుకమ్మ చీరెలు' ఐడియా అంతకుమించిన బూటకం. కేసీఆర్ పాలనలో రోజుకో వింతగా పుట్టుకొస్తున్న విడ్డూరాలు ఎన్నో.. ఎన్నెన్నో!! వాటిలో లేటెస్ట్ తమాషా ఇది.. ఘరానా మోసానికి గుమ్మతైన మార్గం ఇది. ఏళ్ల తరబడి జరుపుకొంటున్న బతుకమ్మ పండుగ సందర్భంగా భారీ కార్యక్రమంగా భూతద్దంలో చూపించి, తమ రాజకీయ ప్రాబల్యం పెంచుకోవడానికి టీఆర్ఎస్ అందంగా తయారు చేసిన ఈ పన్నాగం వల్ల దాపురిస్తున్న తలనొప్పులు అన్నీ ఇన్నీ కావు అనేది ప్రతి ఒక్కరికీ అర్థమవతున్న చేదు నిజం!

నిజానికి ఈ బతుకుమ్మ పండుగని కవిత తదితర టీఆర్ఎస్ నాయకులు తమ ఇమేజ్‌ని పెంచుకుని ప్రజల్ని మభ్యపెట్టడానికి తెలివిగా ఆడుతున్న డ్రామా ఈ 'ఘనమైన' కార్యక్రమం. సొంత లాభాలు, స్వార్థపూరిత ప్రయోజనాల తప్ప దీనివల్ల ఒరిగిందేమీ లేదు. రాష్ట్రవ్యాప్తంగా కోలహలం పుట్టించి, చేసిందేమీ లేకపోయినా, ప్రజల మనోభావాలతో ఆడుకోవడం ద్వారా తమ స్థానాన్ని సుస్థిరం చేసుకునే వ్యర్థ ప్రయత్నమే ఇది. 'బతుకమ్మ చీరలు పంచిపెడుతున్నాం... రండి' అని తెలంగాణ ఆడపడుచులని పట్టపగలు మోసానికి గురిచేసింది ఈ టీఆర్ఎస్ ప్రభుత్వం. పాపం, ఎన్నో అవస్థలకి గురై, గుంపుల్లో నలిగి, గంటల తరబడి ఎదురుచూసి, కష్టపడిన తెలంగాణ ఆడపచులకి చివరకి మిగిలింది అంతులేని నిరాశే. అంత ప్రహసనం తర్వాత వాళ్ల చేతికి చిక్కింది- పనికిమాలిన చీరలే! ఈ వ్యవహారం మొత్తంలో ఎంతగానో లాభపడింది మాత్రం- ఆధార్ కార్డుల కాపీలు చేసే జిరాక్స్ సెంటర్లు.



'ఎంతో ప్రేమగా పిలుస్తున్నారు... వెళ్లి తెచ్చుకుందాం' అని ఆశపడిన తెలంగాణ ఆడపడుచులు పూర్తిగా నిరాశకి గురికావడం కడు శోచనీయం అనే నగ్నసత్యం పలుచోట్ల చోటుచేసుకున్న నిరసన సంఘటనల ద్వారా బయటపడింది. తక్కువ సమయంలో ఎక్కువ ఘనకార్యాలు సాధించామని పదేపదే సొంత డబ్బాలు వాయించుకుంటున్న, బడాయిలు చెప్పించుకుంటున్న టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల కళ్లుకప్పి, దాదాపు 150 కోట్ల రూపాయల అవినీతికి రాచబాట వేసుకుంది. "రూ. 200 ఖరీదుచేసే చీరలు పంచిపెడుతున్నాం" అని పబ్లిగా ప్రకటించింది టీఆర్ఎస్ ప్రభుత్వం. తీరాచూస్తే, అవి కేవలం 40-50 రూపాయలు కూడా చేయని నాసిరకం చీరలని అందరికీ అర్థమైంది. ఇంత జరిగినా, సిగ్గులేకుండా టీఆర్ఎస్ నేతలు కళ్లు మూసుకుని పాలుతాగే పిల్లిలాగా, వాస్తవాలను విస్మరించి, అబద్ధపు రంగులు అదుతున్నారు. హితవు పలికే ప్రజలు, ప్రతిపక్ష పార్టీల గొంతునొక్కేలా ప్రగల్భాలు సాగించడం చరిత్ర ఎరుగని దౌర్భాగ్యం.

అసలు.. మనం అందరం ఒక్క విషయం జాగ్రత్తగా ఆలోచించాలి. చీరలు ఎటువంటివైనా, ఎలాగైనా వాడుకునే జీవన విధానం కలిగిన మన ఆడపడులు ఎంతగా నిరాశ పడకపోతే, నిస్పృహకి గురవకపోతే, 'ఛీ' అనిపించకపోతే ప్రభుత్వం పంచిపెట్టిన చీరలని నడి వీధుల్లో, నడి రోడ్ల మీద కాల్చివేసి, బతుకమ్మ ఆడతారు? ఇంత చండాలం ఎక్కడైనా ఉంటుందా? ఉండదు కాక ఉండదు.

బిజెపి గమనించిన మరో ముఖ్య వాస్తవం.. గద్వాల, పోచంపాడు, దుబ్బాక, సిరిసిల్ల తదితర అనేక తెలంగాణ ప్రాంతాలలో అష్టకష్టాలు పడుతున్న చేనేత కార్మికుల కడుపులు కొట్టి, ప్రతిక్షణం చేనేత కార్మికుల సంక్షేమం గురించి దండోరావేసే టీఆర్ఎస్, బతుకమ్మ చీరల పంపిణీకి సూరత్ నుండి తూకం పద్ధతిన కొనుక్కొచ్చిన పాలిస్టర్ చీరలను తేవడం. ఇంతకంటే అమానుషం ఎక్కడుంటుంది? ఇంత హేయమైన చర్యలని ఖండిస్తున్న బిజెపితో అందరూ కలిసి రావాలి. టీఆర్ఎస్ కళ్లు తెరిపించి, కళ్లెం వేయడంలో తోడుగా ఉండాలి. ■



బతుకమ్మ చీరలు నాణ్యతారాహిత్యంగా ఉన్నాయని, చీరల పంపిణీలో పెద్ద ఎత్తున అవినీతి చోటుచేసుకుందని ఆరోపిస్తూ సెప్టెంబర్ 19న వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద బిజెపి నేతలు, మహిళలు అందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో బిజెపి వరంగల్ అర్బన్ జిల్లా అధ్యక్షురాలు రావుపద్మ, మాజీ ఎమ్మెల్యే ఎం.ధర్మారావు సహా బిజెపి నేతలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జనవాణి

# ముఖ్యమంత్రులు జలవివాదాలను పరిష్కరించుకోలేరా?

• కృష్ణ చైతన్య

రాష్ట్ర విభజన జరిగినప్పటి నుండి జలాల పంపిణీపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు తరచూ వివాదాలకు దిగుతున్నాయి. తాజాగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాదాగిరితో కృష్ణా జలాలను అడ్డగోలుగా తరలిస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆరోపించారు. కేటాయింపులు లేకపోయినా నిబంధనలకు విరుద్ధంగా పోతిరెడ్డిపాడు ప్రాజెక్టుకు నీటిని విడుదల చేశారని విమర్శించారు. దీనిపై కృష్ణా బోర్డు చైర్మన్ శ్రీవత్సవతో కూడా మాట్లాడినట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సైతం తెలంగాణ ప్రభుత్వంపై ఇటువంటి ఆరోపణలు చేస్తూ ఉండటం గమనార్హం.

తెలంగాణ ప్రయోజనాలు కాపాడేందుకు తానెంత నిజాయితీగా ఉన్నాడో చెప్పుకొనే ప్రయత్నం చేస్తున్నారు. వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాలకు సంబంధించిన అంశాలలో రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పరస్పరం 'అవగాహన'తో వ్యవహరిస్తున్నారు. ఒకరి ప్రయోజనాలకు మరొకరు విఘాతం కలిగించకుండా జాగ్రత్త పడుతున్నారు. కానీ ప్రజల ప్రయోజనాలకు సంబంధించిన అంశాలలో మాత్రం వివాదాలనే ఆశ్రయిస్తున్నారు. కీలకమైన సమస్యలను పక్కదోవ పట్టిస్తున్నారు.

ఆగష్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని రాజభవన్‌లో జరిగిన తేనీటి విందు సందర్భంగా గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ సమక్షంలో ఇద్దరు ముఖ్యమంత్రులు చర్చించుకున్నారు. అయితే రెండు రాష్ట్రాల ప్రజలకు సంబంధించిన అంశాలను, వివాదాల పరిష్కారం గురించి చర్చించక పోవడం గమనార్హం. కేవలం 2019 ఎన్నికల నాటికి నియోజకవర్గాల సంఖ్యను పెంచేవిధంగా కేంద్రంపై ఏ విధంగా ఒత్తిడి తీసుకురావాలనే విషయంపైనే చర్చించినట్లు తెలుస్తుంది. ఈ విషయంలో పరస్పరం అవగాహనతో ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేశారు. పలుమార్లు కేంద్ర హోం శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిశారు. ఇతర మంత్రులతో పాటు నేరుగా ప్రధాని నరేంద్ర మోదీని కూడా కలిసి ఎన్నికలలోగా నియోజకవర్గాల సంఖ్యను పెంచాలని కోరారు. ఆ మేరకు పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు తీసుకురావాలని కోరారు. ఈ విషయమై రాజ్యాంగ సవరణ చేయవలసిన అవసరం ఉన్నందున ఇప్పట్లో సాధ్యం కాదని కేంద్రం సర్దిచెప్పే ప్రయత్నం చేసినా వినిపించు కోలేదు. రాజ్యాంగ సవరణ లేకుండానే పార్లమెంట్‌లో బిల్లు తీసుకొచ్చి చేయవచ్చని వాదించారు. ఈ విషయంలో కేంద్రం రాజ్యాంగం ప్రకారం నడుచుకోవాలని నిశ్చయించడంతో వీరిద్దరికీ ఆశాభంగం తప్పలేదు.

తాము ప్రోత్సహించిన పార్టీ ఫిరాయింపుల కారణంగా తమ పార్టీలలో తిరుగుబాటు రాకుండా చేసుకోవడం కోసం ఇంతగా తాపత్రయపడుతున్న వీరు రెండు రాష్ట్ర ప్రజల ప్రయోజనాల గురించి మాత్రం ఎందుకు మాట్లాడుకోరు.? కృష్ణా జలాలను సర్దుబాటు చేసుకోవడంలో ఇద్దరు ముఖ్యమంత్రులు కలసి చర్చించుకోవచ్చు గదా..? అటువంటి ప్రయత్నం కూడా చేయరే..? సామరస్య పూర్వకంగా రెండు రాష్ట్రాల మధ్య నెలకొన్న వివాదాలను పరిష్కరించడం కోసం గవర్నర్ తన వంతు ప్రయత్నం చేశారు. రెండు రాష్ట్రాలకు చెందిన మంత్రుల బృందాలను తన సమక్షంలో కూర్చొని, సమస్యలకు పరిష్కారం కనుగొనే వెసులుబాటు కల్పించారు. అయితే రెండువైపులా మొండి వైఖరి అవలంబించి, ఇచ్చిపుచ్చుకొనే ధోరణి ప్రదర్శించక పోవడంతో ఈ చర్చలు ఎటువంటి ప్రయోజనం ఇవ్వలేక పోయాయి.

ఈ సంవత్సరం భారీ వర్షాలు కురిసినా ఎగువ ప్రాంతంలో అక్కడికక్కడే ఆనకట్టలు కడుతూ ఉండటం, తమ వాటాకు మించి ఎక్కువగా నీటిని ఎగువ రాష్ట్రం ఉపయోగించు కోవడంతో శ్రీశైలం, నాగార్జునసాగర్ రిజర్వా యర్‌లు అడుగంటే పరిస్థితి నెలకొంది. దీనిపై రెండు ప్రభుత్వాలు ప్రేక్షక పాత్ర వహిస్తూ ఉండటం ఆందోళన కలిగిస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను సస్యశ్యామలంచేసి ఆధునిక దేవాలయంగా ఖ్యాతి గడించిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు, జల విద్యుత్ రంగానికి దిక్సూచిగా ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు భవిష్యత్తు అయోమయంలో పడింది. ఈ రెండూ ప్రస్తుతానికి నీటి నిల్వ చేసే డ్యాములుగా మారిపోయాయి. రానున్న రోజుల్లో మహాద్భుతం జరిగి భారీ వర్షాలు పడితే తప్ప నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు వచ్చే నీటి ప్రవాహం ఏమీ ఉండదని స్పష్టం అవుతున్నది.

శ్రీశైలం ప్రాజెక్టు నుంచి వదిలే నీటిని ఒడిసిపట్టి కుడి, ఎడమ కాల్వల ద్వారా తెలుగు రాష్ట్రాల్లోని దాదాపు రెండు కోట్ల జనాభాకు మంచినీటిని సరఫరా మాత్రమే చేసే రిజర్వాయర్‌గా సాగర్ మారిపోయింది. ప్రస్తుత పరిస్థితిని విశ్లేషిస్తే ఈ ఏడాది నాగార్జునసాగర్ ఆయకట్టు కింద రెండు రాష్ట్రాల్లో ఉన్న 22 లక్షల ఎకరాలకు ఖరీఫ్, రబీ లేదు. ఈ విషయాన్ని కృష్ణా బోర్డు కరాఖండిగా తేల్చి చెప్పేసింది. అయినా రాష్ట్ర ప్రభుత్వంలో ఆందోళన కనబడక పోవడం విచారం కలిగిస్తుంది. శ్రీశైలం ప్రాజెక్టుకు తుంగభద్ర జలాలు వస్తాయి. ఆ నది పరివాహక ప్రాంతం రాయలసీమలో ఉంది. శ్రీశైలం ప్రాజెక్టులో నీటి మట్టం 854 అడగులకు తగ్గకుండా చూడాలని కృష్ణా బోర్డు ఆదేశాలు జారీ చేసింది. కాని ఆచరణలో అమలు సాధ్యమా? అని తెలంగాణ, ఆంధ్ర అధికారులు అంటున్నారు. 854 అడుగుల కంటే దిగువకు నీటి మట్టం పడిపోయేలా నీటిని ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలు వినియోగిస్తే, రాయలసీమ వాసులు ఆంధ్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తేందుకు సిద్ధంగా ఉన్నారు.

నాగార్జున సాగర్ నుంచి మంచినీటిని హైదరాబాద్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాలకు సరఫరా చేయాల్సి ఉంది. ఇప్పటికే ఈ జిల్లాల్లో నీటి కటకట ఏర్పడింది. కృష్ణా బోర్డు ఈ జిల్లాలకు ప్రస్తుతం 2 టీఎంసీలు, వచ్చే రోజుల్లో మరో టీఎంసీని విడుదల చేయాలని ఆదేశిం చినా, ఈ నీరు ఏ మాత్రం చాలదు. శ్రీశైలం నుంచి నీటిని విడుదల చేయాలని కోరితే ఏపీ ప్రభుత్వం అంగీకరించదు. అందుకే తెలంగాణ జల విద్యుదుత్పత్తి చేసి దిగువకు నీటిని విడుదల చేస్తోంది. రెండు రాష్ట్రాల మధ్య వివాదాలు కొనసాగుతూ ఉంటే పొరుగు రాష్ట్రం వైఖరి కారణంగా తమకు అన్యాయం జరుగుతుందం టూ ప్రజలను రెచ్చగొట్టడం కోసం కేసీఆర్ తాపత్రయపడుతున్నట్లు కనిపిస్తున్నది. ■

# గత చరిత్ర జ్ఞాపకాలు - భవిష్యత్ తరాలకు దారి దీపాలు

**సెప్టెంబర్ 20న ఆంధ్రభూమిలో ప్రచురితమైన వ్యాసానికి మాజీ ఎమ్మెల్యే మందాడి సత్యనారాయణ రెడ్డి స్పందన**


**మందాడి సత్యనారాయణ రెడ్డి**
మాజీ ఎమ్మెల్యే




"ప్రపంచ చరిత్రలో తెలంగాణా విముక్తి ఉద్యమమంతటి అద్భుత పోరాటం మరొకటి లేకపోవచ్చు" నంటూనే ఇంకా దాని గురించి ఉత్సవాలెందుకని చాణక్య గారు (తేది: 20.09.2017 ఆంధ్రభూమిలో) వ్రాసిన వ్యాసం ఆశ్చర్యం కలిగిస్తోంది. తెలంగాణ విముక్తి పోరాటం అంత అద్భుతంగా జరిగినప్పుడు ఆ పోరాట స్ఫూర్తి భావితరాలకు దారిదీపం కాదా? ఆ మహత్తర చరిత్రను పదే పదే జ్ఞాపకం చేయటానికై ఉత్సవం జరుపవద్దా? తన గతాన్ని విస్మరించిన ఏ జాతికి భవిష్యత్తు ఉండదని వారికి తెలియదా?

2001లో తెలంగాణ ఉద్యమం మొదలైన తర్వాతనే ఈ అంశం తెరపైకి వచ్చిందనటం నిజం కాదు. కేసీఆర్ తెలంగాణ ఉద్యమంలోకి రాకముందే, ఆయన టీడీపీ ప్రభుత్వంలో డిప్యూటీ స్పీకరుగా ఉన్నప్పుడే 1998లో హైదరాబాద్ నిజాం కాలేజి మైదానంలో బిజెపి భారీ బహిరంగ సభను నిర్వహించి, తెలంగాణ విమోచన ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వమే జరపాలని డిమాండ్ చేసింది. ఆ సభలో నాటి కేంద్ర హోం మంత్రి ఎల్.కె.అద్వాని ముఖ్య అతిథిగా పాల్గొని రాష్ట్ర ప్రభుత్వాలే విమోచన ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలని ఉద్బోధించారు. ఆ సభలో పూర్వ నైజాం సంస్థానంలోని మరాట్వాడా - కన్నడ ప్రాంతాలకు చెందిన ప్రజలు, సమర యోధులు కూడా భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అద్వానీ పిలుపు మేరకు మహారాష్ట్ర - కర్ణాటక ప్రభుత్వాలు విమోచనోత్సవాలను అధికారికంగా జరపాలని నిర్ణయించి, జి.ఒ. విడుదల చేశాయి. ఆ జి.ఒ. కాఫీలను నేటి మహారాష్ట్ర గవర్నరు సి.హెచ్.విద్యాసాగర్ రావు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి చూపించి ఇక్కడ కూడా రాష్ట్ర ప్రభుత్వం విమోచన ఉత్సవం జరపాలని పలుసార్లు డిమాండ్ చేశారు. అప్పటి నుండి బిజెపి ఆందోళన చేస్తున్నది.

తెలంగాణ ఉద్యమంలోకి కేసీఆర్ రంగ ప్రవేశం చేసిన తర్వాతే ప్రతి అంశం తెరపైకి తెచ్చినట్లు చెప్పటం విడ్డూరం! తెలంగాణ అంశానికి కర్త, కర్మ, క్రియ అన్నీ కేసీఆర్ అనుకుంటే ఇంత కాలం ఈ దీపం ఆరిపోకుండా కాపాడిన మేధావులు, కవులు, గాయకులు చేసింది ఏమీ లేదా? కేసీఆర్ ఉద్యమంలోకి రాకముందు నుండీ విమోచన ఉత్సవాలకై బిజెపి డిమాండ్ చేస్తున్నది. 1998 నుండి విమోచన ఉత్సవాలు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించాలన్న డిమాండ్‌తో ఆందోళన చేస్తున్నది. ఈ నినాదాన్ని కేసీఆర్ నుండి బిజెపి నకల్ కొట్టినట్లు చిత్రించటం అతిశయోక్తే! మలి దళ ఉద్యమానికి పురుడు పోసింది బిజెపి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయాలని మొట్టమొదట తీర్మానం చేసిన జాతీయ పార్టీ బిజెపి. ఇటు ఉద్యమంలోను అటు పార్లమెంట్ లోపల ఎలాంటి రాజకీయ లాభాపేక్ష లేకుండా తెలంగాణ కోసం నిబద్ధతతో నిలబడింది బిజెపి. ఎంఐఎం, సిపిఐఎమ్ తప్ప కేసీఆర్‌తో పాటు అందరి పాత్రా ఉద్యమంలో ఉంది.

> **కేసీఆర్ తెలంగాణ ఉద్యమంలోకి రాకముందే, ఆయన టీడీపీ ప్రభుత్వంలో డిప్యూటీ స్పీకరుగా ఉన్నప్పుడే 1998లో హైదరాబాద్ నిజాం కాలేజి మైదానంలో బిజెపి భారీ బహిరంగ సభను నిర్వహించి, తెలంగాణ విమోచన ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వమే జరపాలని డిమాండ్ చేసింది. ఆ సభలో నాటి కేంద్ర హోం మంత్రి ఎల్.కె.అద్వాని ముఖ్య అతిథిగా పాల్గొని రాష్ట్ర ప్రభుత్వాలే విమోచన ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలని ఉద్బోధించారు.**

విమోచన ఉత్సవం మన అస్థిత్వానికి, ఆత్మగౌరవానికి చాలాముఖ్యం. కొన్ని వందల ఏండ్ల నుండి 70 సం॥ల క్రితం వరకు నిరంకుశ నిజాం ప్రజా కంఠకపాలనతో, రజాకార్ల రాక్షసకృత్యాలతో, నిజాంతొత్తులైన దొరలు, జమీందార్లు, పటేల్ పట్వారీలు సాగించిన వెట్టి చాకిరి, దోపిడీ దౌర్జన్యాలతో మన పూర్వుల బానిస బతుకుల గురించి, ఆనాటి సమరయోధుల త్యాగాలు, బలిదానాల గురించి భావితరాలకు తెలియ చెప్పాలి. విమోచన ఉత్సవాలు అప్రస్తుతం అనే వారు కొమరంభీం - కాళోజి - దాశరథి - దొడ్డి కొమురయ్య, షోయాబుల్లా ఖాన్ లాంటి అమరుల చరిత్ర పాఠాలు, వారి జయంతి ఉత్సవాలు, భవనాలు, స్మారక స్థూపాలు కూడా దండుగ మారి ఖర్చు అంటారేమో?

భారత స్వాతంత్ర దినోత్సవం నాడు ఆంగ్లేయుల దుష్టపాలను, సమరయోధుల త్యాగాలను, విప్లవవీరుల బలిదానాలను, దేశ విభజనకు కారణమైన మహ్మదాలి జిన్నాను, ముస్లిం లీగును, వారికి వంత పాడిన జాతి ద్రోహులను గుర్తు చేసుకుంటాం. బ్రిటిష్ పాలకులు క్రైస్తవులు కనుక ఈ దేశంలోని ఆంగ్లో ఇండియన్‌లు, ఇక్కడి భారతీయ క్రైస్తవుల మనోభావాలు దెబ్బ తింటాయని భారత స్వాతంత్రం ఉత్సవం జరుపవద్దని అనగలరా? భారత స్వాతంత్రదినం నాడు నాటి దేశ విభజన ఘోర ఉదంతాలు, తూర్పు పడమర పాకిస్థాన్ ప్రాంతంలోని లక్షలాది హిందువుల నరమేధం, కోట్లాది మంది కాందీశీకులై వచ్చిన ప్రజల విషాదగాథలు గుర్తు చేసుకుంటాం. విభజనకు కారకుడైన మహ్మదాలి జిన్నా, అతని ముస్లిం లీగ్ పార్టీలో అందరూ ముస్లింలే కనుక భారత ముస్లింల మనోభావాలు గాయపడతాయని దేశ స్వతంత్ర దినోత్సవం జరపటం మానేయాలా?

70 ఏండ్ల నాటి తెలంగాణ విమోచన గురించి ఇప్పుడెందుకు పండుగలు అన్నారు. ఏ నాటి త్రేతా యుగం.. ఎప్పటి రాముడు? ఎన్నటి రావణుడు? యుగయుగాల తర్వాత కూడా ఈ నాటికి ప్రతి విజయ దశమి నాడు రావణుడి బొమ్మలను బాంబులతో పేల్చి దహనం చేస్తున్నది ఈ సమాజం. ఒక భారత నారి సీతమ్మను రావణుడు అపహరించాడన్న కారణంతోనే కదా..? రజాకార్లవలె రావణుడు నగ్నంగా బతుకమ్మ ఆడించలేదు. అత్యాచారాలు చేయలేదు. అపహరించి

నిర్బంధించినందుకే రావణుడి బొమ్మలను తగలబెడుతున్నాం. అలాంటిది నిజాం రజాకార్లు సాగించిన రాక్షసకాండ ఫలితంగా నిజాంతొత్తులైన దొరలు, పటేల్, పట్వారీల, దోపిడి, దౌర్జన్యాలతో విసుగు చెందిన ప్రజలు తిరుగబడి నిజాం రాజ్యానికి ఘోరీకట్టారు. రజాకార్లను తరిమికొట్టారు. ఈ చరిత్రను భూస్థాపితం చేయటాన్ని తెలంగాణ ప్రజలు సహించరు. నిజాం రాజ్య దుర్మార్గాలను రేపటి పౌరులకు చెప్పి తీరాల్సిందే.

విమోచన ఉత్సవాలు జరిపితే మత ఉద్రిక్తతలు ఏర్పతాయన్నది ఉత్తమాట. నిజాం ఆగడాల గురించి, రజాకార్ల హింసాకాండ గురించి చెప్పాల్సిందే. ఇందులో ముస్లింల కెందుకు అభ్యంతరం ఉంటుంది.? నిజాంకు వ్యతిరేకంగా హిందూముస్లింలు కలిసి పోరాటం చేశారు. ముస్లింలను కూడా రజాకార్లు చంపారు. ఆనాటి పోరాటం నిజాంకు, రజాకార్లకు వ్యతిరేకంగా జరిగిందే తప్ప ముస్లింలకు వ్యతిరేకం కాదు. కేవలం రజాకార్ల వారసులైన ఎంఐఎం పార్టీ వారికి, ఓటుబ్యాంకు రాజకీయ బిచ్చగాళ్ళకు మాత్రం విమోచన అనగానే శరీరం మీద జెర్రు పారినట్లైతది. అందుకోసం ఉత్సవాలు జరుపవద్దంటున్నారు?

సాయుధ పోరాటానికి పిలుపునిచ్చింది ఆంధ్ర మహసభలోని అతివాద యువ నాయకత్వం. మిగతా మితవాదులు, జాతీయవాదులు సత్యాగ్రహాలను ఉధృతంగా చేసి జైళ్ళునింపారు. ఆంధ్ర మహాసభలో కమ్యూనిస్టులు కూడా ఉన్నారు. ఆయుధం పట్టిన వారందరు కమ్యూనిస్టులు కారు. నిజాం మీద, రజాకార్ల మీద ఉన్న ఆగ్రహం, దొరలపై ఉన్న కసి కొద్దీ రైతు కూలీ యువకులందరు ఆయుధాలు పట్టారు. నిజాం లొంగిపోయిన తక్షణం 85 శాతం మంది ఆయుధాలు పక్కనబెట్టి పోరాటం ఆపారు. సాయుధ పోరాట వారసత్వం మొత్తం కమ్యూనిస్టులదేననటం అవాస్తవం. పైకి నిజాం వ్యతిరేక పోరాటమని చెప్పుకున్నా కమ్యూనిస్టుల రహస్య ఎజెండా సంస్థానాన్ని భారత్‌లో కలుపకూడదనే. అప్పటికి బిజెపి పుట్టలేదు కనుక సాయుధ పోరాటం గురించి మాట్లాడే అధికారం కమ్యూనిస్టు పార్టీకి తప్ప బిజెపికి లేదనడం మూర్ఖత్వం. 1857లో ఝాన్సీ రాణి పోరాటం చేసినప్పుడు మనం పుట్టలేదు కనుక దాన్ని గురించి మాట్లాడే హక్కు ఇప్పుడెవరికీ లేనట్టేనా? పాకిస్థాన్ ఏర్పాటుకు మద్దతిచ్చి నిజాం సంస్థానం భారత్‌లో విలీనం కాకుండా మన సైన్యాలపై పోరాటం చేసిన ద్రోహులకు ఉందా.. మాట్లాడే హక్కు..?

విమోచనోత్సవాలు అప్రస్తుతం అని తేల్చి చెప్పగలిన వారు అది విమోచనో, విలీనమో, విద్రోహమో ఎందుకు తేల్చి చెప్పరు? తేల్చలేక కాదు తేల్చి చెప్పే నిజాయితీ లేక. ఓట్ల బిక్షగాళ్ళకు, ఎంఐఎంతో కుమ్మక్కైన వారికి, గోడమీది పిల్లులకు అది కేవలం విలీనం, కరుడు గట్టిన కమ్యూనిస్టులకు అది విద్రోహం. సకల జనులకు మాత్రం విమోచనం. విలీనం కూడా.

పైగా భారత సైన్యం అటు రజాకార్లను ఇటు కమ్యూనిస్టులను ఊచకోత కోసిం దన్నారు. రజాకార్లను అణిచి వేసి ప్రజల మాన ప్రాణాలను కాపాడటానికే సైన్యం వచ్చినప్పుడు ఆపనే కదా చేయాల్సింది! నిజాం గద్దెదిగిన తర్వాత కూడా కమ్యూనిస్టులు 3 ఏండ్ల వరకు సైన్యంతో తల పడితే అరెస్టు చేసి కేసులు పెట్టడానికి వాళ్లేమైనా పోలీసులా? సైన్యం తన విధి నిర్వహిస్తే అది ఊచకోత అంటారా? విమోచనోత్సవాలు అప్రస్తుతం అని తేల్చి చెప్పగలిన వారు అది విమోచనో, విలీనమో, విద్రోహమో ఎందుకు తేల్చి చెప్పరు? తేల్చలేక కాదు తేల్చి చెప్పే నిజాయితీ లేక. ఓట్ల బిక్షగాళ్ళకు, ఎంఐఎంతో కుమ్మక్కైన వారికి, గోడమీది పిల్లులకు అది కేవలం విలీనం, కరుడు గట్టిన కమ్యూనిస్టులకు అది విద్రోహం. సకల జనులకు మాత్రం విమోచనం. విలీనం కూడా. నిజాం రాజు కబందహస్తాల నుండి విముక్తి అయిన తర్వాత భారత్‌లో విలీనం అయ్యింది. కనుక విమోచన విలీనం. దేశ వ్యతిరేకులకు మాత్రమే విద్రోహం అని పిస్తుంది.

ఉనికి చాటుకోవటానికే విమోచన అంశాన్ని బిజెపి నెత్తినెత్తుకున్నదని హేళన చేయడం విడ్డూరం. జాతీయ స్థాయి గుర్తింపు కోల్పోయి, ప్రాంతీయ స్థాయికి దిగజారి ఉనికి కోల్పోతూ కొన ఊపిరితో ఉన్న ఓ పార్టీ 2019 నాటికి ఉండకపోవచ్చునేమో కానీ బిజెపి కాదు. భవనంపై ఎగిరి చూసే కాకికి ఆ భవనంపై రంగులు మాత్రమే కనిపిస్తాయి, పునాదులు కనిపించవు. బిజెపి పునాదులు పార్టీ సిద్ధాంతంలో ఉన్నవి. ప్రజల గుండెలలో ఉన్నవి. దాని జీవనాడులు త్యాగధనులైన నాయకులు, నిష్టావంతులైన కార్యకర్తలు. దాని లక్ష్యం వైభవ సంపన్నమైన సమగ్ర సమైక్య భారతం. దాని ఆరాధ్యులు అణగారిన జాతిజనులు. చివరగా బిజెపి చెప్పుకోవటానికి ఈ రాష్ట్రానికి చేసింది ఏమీ లేదని తేల్చి పారేశారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం చేసింది చాలా ఉంది. సంక్షేమ పథకాలు, అభివృద్ధి నిధులు, విద్యా వైద్య రంగాలకు, జాతీయ రహదారులకు, పట్టణాల అభివృద్ధికి గృహ నిర్మాణానికి, వివిధ పరిశ్రమలకు ముందెప్పుడు లేనంతగా చేసింది. అత్త మీద కోపంతో బిడ్డను కుంపట్లో వేసినట్లు బిజెపిపై వ్యతిరేకతతో తెలంగాణ విమోచన అంశాన్ని వివాదంగా మార్చకండి.

(సెప్టెంబర్ 10 జనసందేశ్ సంచికలో మాజీ ఎమ్మెల్యే మందాడి సత్యనారాయణ రెడ్డి రాసిన వ్యాసం 'సెప్టెంబర్ 17 విమోచనమే' శీర్షికతో ప్రచురితమైంది. అయితే రచయిత పేరులో తప్పు దొర్లింది. జరిగిన పొరబాటుకు చింతిస్తున్నాం.)■

## గమనిక

పాఠకుల సౌలభ్యం కోసం జనసందేశ్ పక్ష పత్రిక ఈ-మ్యాగజైన్ రూపంలోనూ అందుబాటులోకి వచ్చింది. http://www.bjptelangana.org/ వెబ్‌సైట్‌లో లాగిన్ అయి జనసందేశ్(ఈ-బుక్) ట్యాబ్‌ను ప్రెస్ చేస్తే గత 10 సంచికలకు సంబంధించిన తేదీలు కనిపిస్తాయి. కావాల్సిన సంచికను ఎంచుకొని క్లిక్ చేస్తే ఈ-మ్యాగజైన్ తెరుచుకుంటుంది. అవసరమైతే పాఠకులు ఈ ఈ-మ్యాగజైన్‌ను డౌన్‌లోడ్ చేసుకొని తర్వాత కూడా చదువుకోచ్చు.


-ఎడిటర్



కిరీటాన్ని ధరించే శిరస్సు సుఖానికి దూరమవుతుంది. - షేక్స్పియర్

Declaration No. K1852/SB/81/2005

R.N.I. No.52751/91, Postal Regd. No.H-HD-GPO/018/2015-2017
Date of Publication : 05-10-2017
Date of Posting : 08-10-2017












Editor, Printer & Publisher : **MANTHRI SRINIVASULU** on behalf of Bharateeya Janata Party and Printed at Kala Jyothi Process Pvt. Ltd., RTC 'X' Roads, Hyderabad.
Published at: Dr.Shyam Prasad Mukharji Bhavan, opp: Exhibition Grounds, Nampally, Hyderabad - 500 001.